# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

సంపుటి : 09 సంచిక : 23 పేజిలు : 08, వెల రూ. 5రూ/ బుధవారం- 16 - జూలై- 2025


## సంక్షోభంలో గ్రానైట్ పరిశ్రమ



### చివరి క్షణంలో నిమిష ప్రియ

# ఉరిశిక్ష వాయిదా!

- మరికొన్ని గంటల్లో ఉరికంబం ఎక్కాల్సిన కేరళ నర్స్ నిమిష ప్రియకు ఊరట లభించింది
- నిమిష ప్రియ విషయంలో ఫలిస్తున్న విదేశాంగ శాఖ యత్నాలు
- యెమెన్‌లో కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్ష వాయిదా
- బుధవారం (జులై 16) అమలు కావాల్సిన ఆమె ఉరిశిక్షను యెమెన్ ప్రభుత్వం వాయిదా వేసింది
- ఈ కేసులో బాధితురాలికి సాయం చేసేందుకు భారత్ ప్రభుత్వం మొదటి నుంచి తనవంతు ప్రయత్నాలు చేస్తోంది
- బాధిత కుటుంబానికి ఒక మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 8.6కోట్ల) క్షమాధనాన్ని ఇచ్చేందుకు నిమిష ప్రియ కుటుంబం సిద్ధంగా ఉంది



మరికొన్ని గంటల్లో ఉరికంబం ఎక్కాల్సిన కేరళ నర్స్ నిమిష ప్రియకు ఊరట లభించింది. బుధవారం (జులై 16) అమలు కావాల్సిన ఆమె ఉరిశిక్షను యెమెన్ ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ఓ ప్రకటన చేసింది. యెమెన్ జైలు అధికారులతోపాటు ప్రాసిక్యూషన్ కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.'ఈ కేసులో బాధితురాలికి సాయం చేసేందుకు భారత్ ప్రభుత్వం మొదటి నుంచి తనవంతు ప్రయత్నాలు చేస్తోంది. నిమిష, బాధిత కుటుంబాల మధ్య పరస్పర అంగీకరానికి వచ్చి కేసును పరిష్కరించుకునేలా మరింత సమయం ఇవ్వాలని కోరాం. ఈ విషయంలో స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్ ఆఫీసుతో నిరంతరం జరిపిన సంప్రదింపులు ఫలించాయి. మరణశిక్ష అమలును వాయిదా వేసేందుకు - మిగతా 2 లో

### ఆయుధాలు ఇస్తే నువ్వు నేరుగా మాస్కోపై దాడి చేయగలవా?




జెలెన్ స్కీని అడిగిన ట్రంప్!

ఇటీవల ట్రంప్-పుతిన్ మధ్య ఫోన్ కాల్ సంభాషణ

ట్రంప్ ప్రతిపాదనకు నో చెప్పిన పుతిన్!

అనంతరం జెలెన్ స్కీతో ట్రంప్ కీలక చర్చలు!

ఇప్పటిదాకా శాంతి మంత్రం జపించిన ట్రంప్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ట్రంప్ ఫోన్ కాల్ సంభాషణ తీవ్ర నిరాశాజనకంగా ముగిసిన తర్వాత జెలెన్ స్కీతో ఈ చర్చ

50 రోజుల్లో శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యా ఎగుమతుల కొనుగోలుదారులపై ఆంక్షలు విధిస్తామని బెదిరించడం వంటి పరిణామాలు మాస్కో మొండి వైఖరి కారణం

# శుక్లాను స్వాగతించడంలో దేశంతోపాటు నేనూ చేరతాను

- అంతరిక్ష యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకున్న శుక్లా- అభినందించిన మోదీ
- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి సురక్షితంగా భూమికి తిరిగి వచ్చిన భారత ముద్దుబిడ్డ శుభాంశు శుక్లాకు ప్రధాని మోదీ వెల్‌కమ్
- ఐఎస్ఎస్‌ను సందర్శించిన భారత మొట్టమొదటి వ్యోమగామిగా రికార్డు
- యాక్సియమ్-4 చారిత్రాత్మక మిషన్ ద్వారా అంతరిక్ష యాత్ర పూర్తి చేసుకుని భూమికి తిరిగి వచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి సురక్షితంగా భూమికి తిరిగి వచ్చిన భారత ముద్దుబిడ్డ శుభాంశు శుక్లాకు ప్రధాని మోదీ వెల్‌కమ్ చెప్పారు. ఐఎస్ఎస్‌ను సందర్శించిన భారత మొట్టమొదటి వ్యోమగామిగా రికార్డు నెలకొల్పిన ఆయనను ప్రధాని అభినందించారు. శుక్లా తన అంకితభావం, ధైర్యం, మార్గదర్శక స్ఫూర్తితో బిలియన్ల కలలను ప్రేరేపించారని అన్నారు. ఇది మన సొంత మానవ అంతరిక్ష విమాన మిషన్ అంటే గగన్‌యాన్ వైపు మరో మైలురాయిని సూచిస్తుందని పేర్కొంటూ తన అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు."యాక్సియమ్-4 - మిగతా 2 లో

### జినోమ్ వ్యాలీతో

# తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు

- పారిశ్రామిక రంగంలో పెట్టుబడులకు అవసరమైన ప్రోత్సాహాలను అందిస్తాం
- కొత్త యూనిట్‌కు సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ
- హైదరాబాద్ బ్రాండ్‌ను ప్రపంచంలోనే ఒక ఫార్మా కంపెనీల బ్రాండ్‌గా తీర్చిదిద్దుతాం
- జినోమ్ వ్యాలీ ఎవరూ ఊహించని విధంగా ఉత్పత్తులను ఎగుమతి చేస్తుంది
- ప్రపంచంలో 30 శాతం ఫార్మా ఉత్పత్తులు జినోమ్ వ్యాలీ నుంచే తయారవుతున్నాయి
- లారస్ ల్యాబ్స్, కర్కు ల్యాబ్స్ సుమారు 300 ఎకరాల్లో రూ.2వేల కోట్లతో వందల మందికి ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమల ఉత్పత్తి ప్రారంభించాయని సీఎం రేవంత్ తెలిపారు



హైదరాబాద్ - శామీర్‌పేట జినోమ్ వ్యాలీతో తెలంగాణ రాష్ట్రానికే ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాలీలో ఐకోర్ బయాలజిక్స్ కొత్త యూనిట్ కు నేడు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ హైదరాబాద్ బ్రాండ్‌ను ప్రపంచంలోనే ఒక ఫార్మా కంపెనీల బ్రాండ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. జినోమ్ వ్యాలీ ఎవరూ ఊహించని విధంగా ఉత్పత్తులను ఎగుమతి చేస్తుందని, ప్రపంచంలో 30 శాతం ఫార్మా ఉత్పత్తులు జినోమ్ వ్యాలీ నుంచే తయారవుతున్నాయని తెలిపారు. 30,40 ఏళ్లుగా కృషి చేస్తున్న ఫార్మా పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం, సకల వసతులు కల్పిస్తూ మరిన్ని పెట్టుబడులు వచ్చే - మిగతా 2 లో

### తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశంలో రేవంత్ రెడ్డితెలంగాణ వాదన గట్టిగా వినిపించాలి!




తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేయదన్న బండి సంజయ్

కేంద్ర ప్రభుత్వానికి రెండు రాష్ట్రాలు సమానమేనని వ్యాఖ్య

ముస్లింలను కలిపి బీసీలకు అన్యాయం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపణ

బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసే కుట్రలు జరుగుతున్నాయి

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

# విద్యార్థుల మరణాలకు రేవంత్ బాధ్యత వహించాలి

- ఫుడ్ పాయిజనింగ్ కారణంగా వందకు పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారన్న కేటీఆర్
- రేవంత్ ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శ
- విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపాటు
- కనీసం ఒక తండ్రిగానైనా రేవంత్ స్పందించాలని
- పిల్లలు కలిగిన ఒక తండ్రిగా కోరుతున్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు




రాష్ట్రంలో విద్యార్థుల ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఈ ఘటనలకు, విద్యార్థుల మరణాలకు రేవంత్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంలో వేలాది మంది విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్ తో అనారోగ్యం పాలయ్యారని, వందకు పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని - మిగతా 2 లో


## శుభాంశు శుక్లాకు రేవంత్ రెడ్డి అభినందనలు

- అంతరిక్ష కేంద్రం నుంచి భూమిపై అడుగిడిన శుభాంశు శుక్లా బృందం
- శుభాంశు ధైర్యం, అంకితభావం స్ఫూర్తిగా నిలుస్తుందన్న రేవంత్ రెడ్డి
- శుభాంశు భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్ష
- సాహసోపేతమైన, చారిత్రాత్మక యాక్సియం-4 మిషన్‌ను శుభాంశు శుక్లా బృందం విజయవంతంగా పూర్తి




# 'శుభ' స్వాగతం


- సురక్షితంగా పుడమికి చేరుకున్న శుక్లా అండ్ టీమ్
- వెల్‌కమ్ శుక్లా అండ్ కో
- వ్యోమగాములను సేఫ్‌గా భూమికి తీసుకొచ్చిన డ్రాగన్ 'గ్రేస్' క్యాప్సూల్
- అంతరిక్ష యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని భారత కీర్తి పతాకాన్ని సమున్నతంగా ఎగరేసిన మన ముద్దుబిడ్డ శుభాంశు శుక్లా
- శుక్లాతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు కాలిఫోర్నియా తీరంలో సురక్షితంగా ల్యాండ్
- జూన్ 26, 2025న భారత వైమానిక దళ టెస్ట్ పైలట్ గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టి చరిత్ర సృష్టించాడు



అంతరిక్ష యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని భారత కీర్తి పతాకాన్ని సమున్నతంగా ఎగరేసిన మన ముద్దుబిడ్డ శుభాంశు శుక్లా పుడమికి తిరిగొచ్చాడు. శుక్లాతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములతో నుంచి బయల్దేరిన క్రూ డ్రాగన్ 213 'గ్రేస్' క్యాప్సూల్ ఇవాళ అంటే జులై 15న మధ్యాహ్నం 3.01 గంటలకు కాలిఫోర్నియా తీరంలో సురక్షితంగా ల్యాండ్ అయింది.జూన్ 26, 2025న భారత వైమానిక దళ టెస్ట్ పైలట్ గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టి చరిత్ర సృష్టించాడు. 39 ఏళ్ల వయసున్న శుక్లా కు వెళ్లిన తొలి భారతీయుడిగా, 634వ వ్యోమగామిగా ఘనత పొందారు. మరో ప్రత్యేకత ఏంటంటే 41 ఏళ్ల తర్వాత అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి భారతీయుడూ ఆయనే. రాకేశ్ శర్మ తర్వాత అంతరిక్ష యాత్రలో - మిగతా 2 లో

# రూ. లక్ష కోట్ల పెట్టుబడులకు 95 సంస్థలు ముందుకు

- ఏపీలో రాబోయే నాలుగేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు
- అధికారులకు మంత్రి నారా లోకేశ్ దిశానిర్దేశం
- సంస్థలు త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచన
- గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ద్వారా 10 లక్షల ఉద్యోగాలను సృష్టించాలి
- ఇప్పటివరకు 95 ప్రముఖ సంస్థలు రూ. లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు
- రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్
- కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 400 ఎకరాల్లో నిర్మించదలపెట్టిన డ్రోన్ సిటీని ఏడాదిలోగా పూర్తిచేసేలా చర్యలు
- పౌరసేవల్లో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలను మరింత విస్తృతపరచాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు



ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే నాలుగేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ద్వారా 10 లక్షల ఉద్యోగాలను సృష్టించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ లక్ష్యాన్ని ప్రకటించారు.రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు, జీసీసీలు, డేటా సెంటర్ల స్థాపనకు ఇప్పటివరకు 95 ప్రముఖ సంస్థలు రూ. లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని మంత్రి తెలిపారు. ఈ సంస్థలు త్వరితగతిన తమ యూనిట్లను ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు, ఇతర సౌకర్యాలను కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలకు - మిగతా 2 లో

## ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం అఖిలపక్ష సమావేశం




హాజరైన టీడీపీ నాయకులు

ఎన్నికల విధానాల్లో సంస్కరణ, ఓటరు జాబితాల్లో సంస్కరణలపై చర్చ

అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిన ఈసీ

సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఢిల్లీ వచ్చి సమావేశంలో పాల్గొన్న టీడీపీ బృందం

డూప్లికేట్ ఓటర్లను తొలగించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని పల్లా శ్రీనివాస రావు సూచించారు

సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల విధానాల్లో సంస్కరణలు, ఓటరు జాబితా సవరణలపై చర్చించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ఢిల్లీలో అఖిల పక్ష సమావేశం నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తరపున పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు యాదవ్, టీడీపీ ఎంపీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస రావు మాట్లాడుతూ, ఓటరు జాబితాల్లోని లోపాలను సరిచేయాలన్న ఎన్నికల సంఘం లక్ష్యాన్ని స్వాగతించారు. కేంద్ర ఎన్నికల సంఘంపై తమకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. ఓటరు గుర్తింపులో ఆధార్‌ను ఏకైక ఆధారంగా పరిగణించకూడదని సూచించిన - మిగతా 2 లో

# పల్లె భారతిలో నాబార్డ్ ప్రగతి సేద్యం




హరిత విప్లవానంతరం భారత వ్యవసాయ రంగం ఆధునికీకరణ దిశగా ముందడుగు వేస్తున్న సమయంలో, వ్యవసాయానికి అవసరమైన రుణాల కోసం రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపై ఆధారపడేవారు. అప్పట్లో దేశంలోని బ్యాంకులన్నీ ప్రైవేటు రంగంలో ఉండటంతో, వ్యవసాయ రంగానికి రుణాల వాటా మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థలో ఒక శాతం కంటే కూడా తక్కువగా ఉండేది. ఈ పరిస్థితిని గమనించిన అప్పటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ, వ్యవసాయ - గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలన్న దృక్పథంతో 1969లో 14 పెద్ద బ్యాంకులను, 1980లో మరో ఆరు బ్యాంకులను జాతీయం చేశారు. బ్యాంకుల జాతీయాకరణ తరువాత, వ్యవసాయ - గ్రామీణ రంగాలను ప్రాధాన్య రంగాలుగా గుర్తిస్తూ, మొత్తం బ్యాంక్ రుణాల్లో కనీసం 40 శాతం ఈ రంగాలకు కేటాయించాలన్న నిబంధనను అప్పటి కేంద్ర ప్రభుత్వం అమలు చేసింది. అంతేకాకుండా, గ్రామీణాభివృద్ధికి మరింత బలమిచ్చే ఉద్దేశంతో 1975లో గ్రామీణ బ్యాంకుల వ్యవస్థను ప్రారంభించింది.భారతదేశంలో వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి రంగాలకు బ్యాంకుల జాతీయాకరణ అనంతరం పెట్టుబడుల కోసం రుణాలు గణనీయంగా పెరిగినా, ఆ రంగాల కోసం ప్రత్యేకంగా సమన్వయం, నియంత్రణ చేపట్టే జాతీయస్థాయి శిఖరాగ్ర బ్యాంకు లేదు. అప్పటివరకు ఆర్బీఐలోని ప్రత్యేక విభాగం వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధికి సంబంధించిన రుణాలు, పెట్టుబడులను సమన్వయం చేస్తున్నది. ఈ లోపాన్ని గుర్తించిన ఇందిరాగాంధీ 1982 జూలై 12న రూ. 100 కోట్ల మూలధనంతో జాతీయ వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి బ్యాంకును ముంబయి కేంద్రంగా స్థాపించి, జూలై 15న జాతికి అంకితం చేశారు. అప్పటి నుంచి నాబార్డ్ ప్రస్థానం నానాటికీ విస్తరించి, నేడు 43 సంవత్సరాల ప్రయాణంలో ఒక మహావృక్షంగా రూపాంతరం చెందింది. 2023 - 24 నాటికి నాబార్డ్ వివిధ రూపాల్లో వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి తొమ్మిది లక్షల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు, రుణాలు అందించింది. దేశవ్యాప్తంగా విస్తృతంగా సేవలందిస్తోంది.సహకార సంఘాల అభివృద్ధిలో నాబార్డ్ పాత్ర అసాధారణమైనది. ఈ బ్యాంకు దేశవ్యాప్తంగా సహకార బ్యాంకులకు అవసరమైన రీఫైనాన్స్ నిధులను అందించింది. తద్వారా సహకార బ్యాంకులు ముఖ్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు... గ్రామీణ రుణాల పంపిణీకి ప్రధాన కేంద్రాలుగా మారాయి. నాబార్డ్ సమర్థమైన పర్యవేక్షణ, ఆర్థిక మద్దతుతో ఈ సహకార సంఘాలు రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు, వితరణ సేవలు, నిల్వ సదుపాయాలు, సబ్సిడీ విధానాలను అమలుచేశాయి. అంతేకాక, స్వయం సహాయక సంఘాల అభివృద్ధిలో నాబార్డ్ పాత్ర అపూర్వం. 1992లో ప్రారంభించిన స్వయం సహాయక సంఘాలను బ్యాంకులకు అనుసంధానించడం ద్వారా గ్రామీణ మహిళలు సమూహాలుగా ఏర్పడి, బ్యాంకుల ద్వారా రుణాలు పొందడం సుగమమైంది. నాబార్డ్ శిక్షణ, నిధుల మంజూరు, పర్యవేక్షణతో స్వయం సహాయక సంఘాలు స్థిరమైన ఆర్థిక సంఘాలుగా మారాయి.గ్రామీణ బ్యాంకింగ్‌ను ఆధునికీకరించడంలో నాబార్డ్ కీలకపాత్ర పోషించింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 63వేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను డిజిటలైజ్ చేయడం ద్వారా, రుణాల మంజూరు, నిల్వ నిర్వహణ, పంట నష్టపరిహారాల లింకేజీ వంటి సేవలన్నీ పారదర్శకంగా అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఈ సంస్థలు ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందాయి. నాబార్డ్ దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పీఓ) ఏర్పాటుకు నిధులు, శిక్షణ, మార్కెట్ లింకేజీలతో సహకారం అందిస్తోంది. మధ్యవర్తులపై ఆధారాన్ని తగ్గించి, రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా నాబార్డ్ ఈ రంగంలో మార్గనిర్దేశక పాత్ర పోషిస్తోంది.1995లో ప్రారంభించిన రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఆర్ఐడిఎఫ్) ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రేటుతో నాబార్డ్ రుణాలు అందించింది. ఈ నిధులతో గ్రామీణ రహదారులు, చెక్‌డ్యామ్‌లు, మార్కెట్ యార్డులు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, శీతల గిడ్డంగులు వంటి మౌలిక వసతుల నిర్మాణం వీలైంది. నీటిపారుదల రంగంలో నాబార్డ్ అందించిన రీఫైనాన్స్ వల్ల చిన్న, మధ్యస్థ సాగునీటి ప్రాజెక్టులు అమలులోకి వచ్చాయి. ఇది సాగు విస్తీర్ణం పెరుగుదలకు దోహదం చేసింది. ప్రాంతీయ వ్యవసాయ వ్యాపార ఇన్క్యుబేటర్ కేంద్రాల ద్వారా యువతకు నాబార్డ్ కొత్త అవకాశాలను అందిస్తోంది. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల మద్దతుతో ఏర్పడిన ఈ కేంద్రాలు... యువతకు శిక్షణ, మార్గదర్శకత్వం, మార్కెట్ లింకేజీ వంటి అంశాల్లో సహాయపడుతూ, స్వయం ఉపాధి రంగాన్ని అభివృద్ధి చేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తున్నాయి. ఇలా భారత గ్రామీణ అభివృద్ధి చరిత్రలో నాబార్డ్ ఒక కీలక మైలురాయిగా నిలిచింది. వ్యవసాయ రంగానికి నిధుల సమకూర్పు, మౌలిక వసతుల నిర్మాణం, సహకార సంస్థల పునరుద్ధరణ, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అనేక అంశాల్లో నాబార్డ్ పాత్ర ఎంతో అమోఘమైనది. గ్రామీణ బ్యాంకింగ్‌ను డిజిటలైజ్ చేస్తూ, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ, వ్యవసాయ స్టార్టప్‌లకు తోడ్పాటుతో నాబార్డ్ గ్రామీణ భారత ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తోంది.

# ఆయుధాలు ఇస్తే నువ్వు నేరుగా మాస్కోపై దాడి చేయగలవా?

ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వైఖరిని మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటిదాకా శాంతి మంత్రం జపించిన ట్రంప్... ఇకపై రష్యాను ఒత్తిడిలోకి నెట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్టు తాజా పరిణామాలు చెబుతున్నాయి. జులై 4న ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీతో జరిగిన ఒక ప్రైవేట్ సంభాషణలో, అవసరమైన ఆయుధాలు అందిస్తే మాస్కో మరియు సెయింట్ పీటర్స్‌బర్గ్‌లతో సహా రష్యా లోపల దాడులను తీవ్రతరం చేయగలరా? అని ట్రంప్ ప్రశ్నించినట్లు ఓ కథనం వచ్చింది.ఆ కథనం ప్రకారం... రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ట్రంప్ ఫోన్ కాల్ సంభాషణ తీవ్ర నిరాశాజనకంగా ముగిసిన తర్వాత జెలెన్ స్కీతో ఈ చర్చ జరిగింది. కాల్పుల విరమణ చర్చలకు రష్యా నిరాకరించడంపై అమెరికాలో పెరుగుతున్న అసంతృప్తిని ఇది సూచిస్తోంది. రష్యాను నేరుగా ఎదుర్కోవడానికి వెనుకడుగు వేస్తారన్న ట్రంప్ మునుపటి అభిప్రాయానికి ఇది భిన్నమైన వైఖరిగా భావిస్తున్నారు. రష్యన్లకు ఏదో విధంగా బాధ కలిగించి, వారిని చర్చలకు రప్పించడమే ట్రంప్ కొత్త వ్యూహమని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా దీర్ఘ శ్రేణి ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందిస్తుందా లేదా అనేది స్పష్టంగా తెలియకపోయినా, రష్యా భూభాగంపై మరింత దూకుడు దాడులకు పాశ్చాత్య దేశాలు, మరియు అమెరికా విధాన రూపకర్తలలో మద్దతు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు కొత్త ఆయుధాలను అందిస్తామని ట్రంప్ బహిరంగంగా ప్రకటించడం, అలాగే 50 రోజుల్లో శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యా ఎగుమతుల కొనుగోలుదారులపై ఆంక్షలు విధిస్తామని బెదిరించడం వంటి పరిణామాలు మాస్కో మొండి వైఖరి కారణంగానే చోటుచేసుకున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

# విద్యార్థుల మరణాలకు రేవంత్ బాధ్యత వహించాలి

ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ కూడా ఆయన చేతిలోనే ఉన్నప్పటికీ ఇంతవరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శించారు.కనీసం ఒక తండ్రిగానైనా రేవంత్ స్పందించాలని... పిల్లలు కలిగిన ఒక తండ్రిగా కోరుతున్నానని కేటీఆర్ అన్నారు. మీ పిల్లలకు విషం కలిపిన ఆహారాన్ని ప్రభుత్వం పెడితే మీరు ఊరుకుంటారా?అని ప్రశ్నించారు.విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం నిర్ల క్షంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి సరైన చర్యలు తీసుకోవాలని డిమా ండ్ చేశారు.ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని తగిన సమయంలో తీర్పు ఇస్తారని చెప్పారు.

## శుభాంశు శుక్లాకు రేవంత్ రెడ్డి అభినందనలు



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి భూమిపై అడుగు పెట్టిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లాకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. సాహసోపేతమైన, చారిత్రాత్మక యాక్సియం-4 మిషన్‌ను శుభాంశు శుక్లా బృందం విజయవంతంగా పూర్తి చేసింది. దీంతో వారికి ప్రపంచవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.శుభాంశు ప్రదర్శించిన ధైర్యం, అంకితభావం అందరికీ స్ఫూర్తిగా నిలుస్తాయని, భవిష్యత్తు తరాలకు మార్గదర్శిగా ఉంటారని ముఖ్యమంత్రి కొనియాడారు. పైలట్ శుభాంశు భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని, దేశానికి మరింత సేవ చేయాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

# 'శుభ' స్వాగతం

మొదటిపేజీ తరువాయి -
పాల్గొన్న రెండో భారతీయుడిగా శుక్లా రికార్డుకెక్కారు.యాక్సియమ్-4 మిషన్‌లో భాగంగా ఫాల్కన్-9 రాకెట్‌ను జూన్ 25న అంతరిక్షంలోకి ప్రయోగించారు. ఈ మిషన్‌లో శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నియెస్కీ, టిబోర్ కాపు పాల్గొన్నారు. భూమి చుట్టూ 28 గంటల ప్రయాణం తర్వాత వ్యోమగాములు బయల్దేరిన స్పేస్‌క్రాఫ్ట్ ISSకు డాక్ అయింది.జూన్ 26న ISSకు చేరుకున్న ఈ నలుగురు వ్యోమగాములు అమెరికా, భారతదేశం, పోలాండ్, హంగేరీ, సౌదీ అరేబియా, బ్రెజిల్, నైజీరియా, UAE, యూరప్ అంతటా ఉన్న దేశాలతో సహా 31 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తూ మైక్రోగ్రావిటీలో దాదాపు 60 శాస్త్రీయ అధ్యయనాలు, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించారు. వాటిలో భారతదేశం ఇస్రో ద్వారా ఏడు కీలక అధ్యయనాలను ఈ మిషన్‌కు అందించింది.అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 18 రోజుల పాటు విస్తృత పరిశోధనలు జరిపిన అనంతరం నిన్న అంటే జులై 14న సాయంత్రం 4:45 గంటలకు ISSతో క్రూ డ్రాగన్ C213 'గ్రేస్' క్యాప్సూల్ అన్‌డాకింగ్ ప్రక్రియ నిర్వహించారు. పలు ఆర్బిటల్ ప్రక్రియల అనంతరం ఇవాళ మధ్యాహ్నం 3.01 గంటలకు కాలిఫోర్నియా తీరంలో క్రూ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ ల్యాండ్ అయింది. వెంటనే శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నియెస్కీ, టిబోర్ కాపు వ్యోమగాములను ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించనున్నారు.అంతరిక్షంలో భారరహిత స్థితిని అనుభవించిన కారణంగా భూమిపైకి చేరగానే ఇక్కడి వాతావరణానికి వారి శరీరాలు అలవాటు పడేందుకు ఈ చర్యలు తీసుకోనున్నట్లు ఇస్రో పేర్కొంది. అందుకోసం వారం రోజుల పాటు రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంచనున్నట్లు తెలిపింది. ఇస్రోకు చెందిన వైద్యాధికారులు వ్యోమగాముల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను నిరంతరం పర్యవేక్షిస్తారని వివరించింది.

# శుక్లాను స్వాగతించడంలో దేశంతోపాటు నేనూ చేరతాను





మొదటిపేజీ తరువాయి - చారిత్రాత్మక మిషన్ ద్వారా అంతరిక్ష యాత్ర పూర్తి చేసుకుని భూమికి తిరిగి వచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను స్వాగతించడంలో దేశంతోపాటు నేనూ చేరతాను. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన భారతదేశపు మొట్టమొదటి వ్యోమగామిగా, ఆయన తన అంకితభావం, ధైర్యం, మార్గదర్శక స్ఫూర్తి ద్వారా బిలియన్ల కలలను ప్రేరేపించారు. ఇది మన సొంత మానవ అంతరిక్ష విమాన మిషన్- గగన్‌యాన్ వైపు మరో మైలురాయిని సూచిస్తుంది."ఏంటీ గగన్‌యాన్: గగన్‌యాన్ అనేది భారత్ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన తొలి మానవసహిత అంతరిక్ష మిషన్. ఈ మిషన్? ద్వారా ముగ్గురు వ్యోమగాములను 400 కి.మీ భూమి అత్యల్ప కక్ష్యకు పంపించడమే ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో 'గగన్‌యాన్' మిషన్‌కు ముందుగా శుక్లా చేసిన 'యాక్సియం మిషన్ 4' ప్రయాణం ఒక ముఖ్యమైన ఎక్స్ పీరియన్స్‌ను అందించడంలో తోడ్పడుతుంది.యాక్సియమ్ మిషన్‌లో శుక్లా పాత్ర: నాసా చేపట్టిన 'యాక్సియమ్ మిషన్ 4' ప్రయోగంలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) సైతం భాగస్వామిగా మారింది. శుభాంశు శుక్లా ఈ అంతరిక్షయానం భారత అంతరిక్ష ప్రయాణంలో కీలక మైలురాయిని సూచిస్తుంది. ఇస్రో 'గగన్?యాన్' మిషన్?లో భాగంగా భాగంగా శుక్లా 'యాక్సియమ్ మిషన్ 4'కు ఎంపికయ్యారు. ఈ మిషన్‌లో భాగంగా స్పేస్‌ఎక్స్ సంస్థ అభివృద్ధి చేసిన డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌కు పైలట్‌గా వ్యవహరించారు.

# చివరి క్షణంలో నిమిష ప్రియ ఉరిశిక్ష వాయిదా!

మొదటిపేజీ తరువాయి -
యెమెన్ అధికారులు అంగీకారం తెలిపారు' అని విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి.ఇక ఈ కేసులో బ్లడ్ మనీ తీసుకునేలా బాధిత కుటుంబాన్ని ఒప్పించేందుకు మత గురువు కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ సంప్రదింపులు జరుపుతున్నారు. ఆ చర్చలు కూడా సానుకూలంగా జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. బాధిత కుటుంబానికి ఒక మిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.6కోట్ల) క్షమాధనాన్ని ఇచ్చేందుకు నిమిష ప్రియ కుటుంబం సిద్ధంగా ఉంది. ఇందుకు వారు అంగీకరిస్తే నిమిష ప్రియకు మరణశిక్ష తప్పే అవకాశం ఉంది.

అసలేమిటీ కేసు

కేరళ పాలక్కాడ్ జిల్లాకు చెందిన నిమిష నర్సు కోర్సు పూర్తి చేసిన తర్వాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరారు. 2011లో థామస్‌ను వివాహం చేసుకున్న ఆమె అక్కడే ఓ క్లినిక్ తెరవాలనుకొన్నారు. ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక తలాల్ అదిబ్ మెహది అనే వ్యక్తిని నిమిష, థామస్ జంట తమ వ్యాపార భాగస్వామిగా చేసుకొన్నారు. వారు అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను ప్రారంభించారు. కొన్నేళ్ల తర్వాత ఆమె భర్త, కుమార్తె కేరళకు వచ్చేశారు. నిమిష యెమెన్‌లోనే ఉంటూ సెంటర్‌ను కొనసాగించారు.ఈ సమయంలో మెహది- నిమిష ప్రియను తన భార్యగా పేర్కొంటూ వేధింపులకు గురిచేస్తూ ఆమె పాస్‌పోర్టు లాక్కొన్నాడు. అతడిపై 2016లో ప్రియ పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోకపోయేసరికి, 2017లో మెహదికి మత్తు మందు ఇచ్చి అతడి వద్ద ఉన్న తన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాలని ఆమె భావించింది. మోతాదు ఎక్కువవడంతో అతడు చనిపోయాడు. ఆ తర్వాత మృతదేహాన్ని ఓ వాటర్ ట్యాంక్‌లో పడేసింది. అక్కడి నుంచి సౌదీకి పారిపోతుండగా ఆమెను అరెస్టు చేశారు. ఈ కేసులో 2020లో ఆమె ఉరిశిక్ష విధించగా, 2023లో చివరి అప్పీల్‌ను యెమెన్ ప్రభుత్వం తిరస్కరించింది. ప్రస్తుతం నిమిష ప్రియ యెమెన్ రాజధానిలోని సనా జైలులో ఉంది.

# ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం అఖిలపక్ష సమావేశం

మొదటిపేజీ తరువాయి -
టీడీపీ, 11 రకాల గుర్తింపు పత్రాలను అంగీకరించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని స్వాగతించింది.

**ఆధునిక సాంకేతికత వినియోగం, డూప్లికేట్ ఓట్ల తొలగింపు**

డూప్లికేట్ ఓటర్లను తొలగించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని పల్లా శ్రీనివాస రావు సూచించారు. ప్రతి ఓటరుకు ప్రత్యేక డోర్ నంబర్ కేటాయించడం ద్వారా డేటా చోరీని నిరోధించి, యూనిక్ ఓటర్ ఐడెంటిటీని సృష్టించవచ్చని ఆయన పేర్కొన్నారు.

**పౌరసత్వ నిర్ధారణపై సుప్రీంకోర్టు తీర్పు ప్రస్తావన**

ఓటరు జాబితా పరిశీలనలో ఎన్నికల సంఘానికి ప్రత్యేక హక్కులు ఉన్నప్పటికీ, పౌరసత్వ నిర్ధారణ వారి అధికార పరిధిలో లేదని, 1995 సుప్రీంకోర్టు లాల్ బాబు హుస్సేన్ కేసు తీర్పును ఆయన గుర్తు చేశారు. అభ్యంతరాలు లేవనెత్తిన వారే ఆధారాలు సమర్పించాలని, ఆధారాలు చూపలేకపోయినంత మాత్రాన ఓటర్ల హక్కును రద్దు చేయడం సరికాదని స్పష్టం చేశారు.

**బీహార్‌లో తొలగింపు ప్రక్రియపై ఆందోళన**

బీహార్‌లో ఓటర్ల తొలగింపు ప్రక్రియ కారణంగా గందరగోళం నెలకొందని, గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత తక్కువగా ఉండటం, ఆధార్ ఉన్నా ఇతర పత్రాలు లేని వారు ఎక్కువగా ఉండటం వల్ల నిజమైన ఓటర్లు తొలగింపుకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీహార్‌లో సుమారు 3 కోట్ల మంది ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడం ఆర్టికల్ 326కు విరుద్ధమని, గుర్తింపు పత్రాలు లేని వారు భారతీయులేనని నిర్ధారించే బాధ్యత ప్రభుత్వ సంస్థలదేనని ఆయన అన్నారు.

**టీడీపీ సిఫార్సులు...**

టీడీపీ తరఫున పల్లా శ్రీనివాస రావు, ఓటర్లకు అన్యాయం జరగకుండా న్యాయపరమైన, పారదర్శకమైన విధానాలను అమలు చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. ముఖ్యంగా:

డ్రాఫ్ట్ ఓటరు జాబితాలను అన్ని రాజకీయ పార్టీలకు అందజేయాలి.

ఫీల్డ్ లెవెల్ అధికారుల నియామకంలో పారదర్శకతను నిర్వహించాలి.

వాలంటీర్ వ్యవస్థలు, మొబైల్ వాహనాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పత్రాల సేకరణకు ప్రభుత్వం సహాయం అందించాలి.

వాట్సాప్ హెల్ప్‌లైన్లు, వార్డు స్థాయి సమస్యా పరిష్కార విధానాలు సమర్థవంతంగా పనిచేయాలి.

పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులను అన్ని దశల్లో భాగస్వామ్యం చేయాలి.

ప్రతి పౌరుని ఓటు హక్కును కాపాడేందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలి.

బూత్ లెవెల్ అధికారులకు ప్రస్తుతం అందిస్తున్న రూ.250 ప్రోత్సాహకాన్ని పెంచాలి. బూత్ లెవెల్ ఏజెంట్లు, బీఎల్వోలు సమన్వయంతో పనిచేస్తే పని మరింత వేగంగా, సమర్థవంతంగా జరుగుతుంది.

ఈ సమావేశంలో తెలుగుదేశం తరఫున పల్లా శ్రీనివాస రావుతోపాటు పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, శబరి, కూన రవికుమార్, జ్యోత్స్న పాల్గొన్నారు.

# రూ. లక్ష కోట్ల పెట్టుబడులకు 95 సంస్థలు ముందుకు

మొదటిపేజీ తరువాయి - విశాఖలో ఇప్పటికే భూకేటాయింపులు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించగా, ఈ సంస్థలు త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని లోకేశ్ సూచించారు.ఇటీవలి బెంగళూరు పర్యటనలో ఏఎన్ఎస్ఆర్, సత్వ సంస్థలు జీసీసీల ఏర్పాటుకు ఎంఓయూలు కుదుర్చుకున్నాయని, వీటి ద్వారానే యువతకు 35,000 ఉద్యోగాలు లభిస్తాయని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఎంఓయూలు చేసుకున్న సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ యూనిట్లు ఏర్పాటు చేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి వచ్చే చిన్న సంస్థల కోసం 26 జిల్లా కేంద్రాల్లో కో-వర్కింగ్ స్పేస్‌లను సిద్ధం చేయాలని ఆయన సూచించారు.

త్వరలోనే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

రాష్ట్రంలో నవీన ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ప్రోత్సాహానికి తలపెట్టిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ త్వరలోనే ప్రారంభించనున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. దీంతో పాటు విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, అనంతపురంలో ప్రాంతీయ స్పోక్స్ కేంద్రాలను కూడా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి సంబంధించి టీసీఎస్, ఎల్ అండ్ టీ, ఐబీఎంల భాగస్వామ్యంతో కంపెనీ ఏర్పాటైందని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులు దృష్టిసారించాలని అన్నారు.కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 400 ఎకరాల్లో నిర్మించదలపెట్టిన డ్రోన్ సిటీని ఏడాదిలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన ఎకో సిస్టమ్ కల్పించాలని అధికారులను ఆదేశించారు. బుడమేరు వరదల సమయంలో డ్రోన్‌ల సేవలు ఎంతగానో ఉపకరించాయని, వ్యవసాయం, పోలీసింగ్, వాతావరణం తదితర శాఖల్లో డ్రోన్‌ల వినియోగంపై నెలకు ఒక జిల్లాలో ఈవెంట్లు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు.

మనమిత్ర సేవలు మరింత సులభతరం

పౌరసేవల్లో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలను మరింత విస్తృతపరచాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. మొత్తం 702 సేవలలో 535 సేవలను ఇప్పటికే మనమిత్ర ద్వారా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి చెక్ పెట్టాలని, కుల ధృవీకరణ పత్రంతో సహా విద్యాసంబంధిత అన్ని రకాల సర్టిఫికెట్లు బ్లాక్ చైన్‌తో అనుసంధానం చేసి మనమిత్ర ద్వారా సులభతరంగా పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.రాష్ట్రంలోని 45,000 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి స్కూలుకు ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి వంటి ఎయిర్‌పోర్టుల్లో అంతరాయం లేని ఫోన్ కనెక్టివిటీకి చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఐటీ అండ్ సీ స్పెషల్ సెక్రటరీ సుందర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిశోర్, ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ సాయికాంత్ వర్మ, ఆర్టీజీఎస్ సీఓ ప్రకార్ జైన్, ఏపీటీఎస్ ఎండీ సూర్యతేజ,

# తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశంలో రేవంత్ రెడ్డి తెలంగాణ వాదన గట్టిగా వినిపించాలి!

మొదటిపేజీ తరువాయి - ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరగనున్న సమావేశంలో తెలంగాణ వాణిని బలంగా వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సూచించారు. కేంద్ర జలశక్తి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు పిలుపు వచ్చింది. రేపు ఈ సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు.తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం చేయదని ఆయన అన్నారు. కేంద్రానికి రెండు రాష్ట్రాలు సమానమేనని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరిగే నష్టాన్ని ముఖ్యమంత్రి వివరించాలని సూచించారు. కరీంనగర్‌లో పర్యటించిన బండి సంజయ్ మాట్లాడుతూ, బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసే అన్యాయాన్ని బీసీ సంఘాలు ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన నిలదీశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన సమగ్ర సర్వేలో బీసీలు 51 శాతమని తేలితే, కాంగ్రెస్ సర్వేలో మాత్రం 46 శాతంగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు.బీసీలలో ముస్లింలను కలపడం సరికాదని ఆయన అన్నారు. బీసీ ఆర్డినెన్స్‌ను తాము వ్యతిరేకించబోమని, కానీ బీసీల్లో ముస్లింలను కలిపితే మాత్రం అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. బీసీ రిజర్వేషన్లలో ముస్లింలను కలుపుతూ అన్యాయం చేస్తోందని, బీసీ నాయకులు ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు.

# జినోమ్ వ్యాలీతో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు

మొదటిపేజీ తరువాయి -విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. లారస్ ల్యాబ్స్, కర్క ల్యాబ్స్ సుమారు 300 ఎకరాల్లో రూ.2వేల కోట్లతో వందల మందికి ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమల ఉత్పత్తి ప్రక్రియలను ప్రారంభించాయని గుర్తు చేశారు.ప్రపంచ ఫార్మా దృష్టిని ఆకర్షించేందుకు జినోమ్ వ్యాలీని ప్రపంచస్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామన్న సీఎం ఫార్మా రంగంలో పెట్టుబడులకు స్వర్గధామంలా తయారు చేసి ఉపాధి అవకాశాలు, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అందుకే, ఫార్మా కంపెనీల దిగ్గజాలతో మరిన్ని పెట్టుబడులు రాబట్టే ఆలోచనలు విస్తృతంగా చేస్తున్నట్లు పేర్కొన్నారు.పారిశ్రామిక రంగంలో పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహకాలను అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పారిశ్రామిక రంగం అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, రాయితీలు, అనుమతులను మంజూరు చేయడం వంటి సానుకూల వాతావరణం కల్పిస్తామని చెప్పారు.శామీర్‌పేట్ జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయాలజిక్స్ కొత్త యూనిట్‌కు ముఖ్యమంత్రి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , వివేక్ వెంకటస్వామి , శాసనసభ్యులు పి. సుదర్శన్ రెడ్డి , ఐకార్ మేనేజింగ్ డైరెక్టర్ సూదిని ఆనంద రెడ్డి తో పాటు అధికారులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ,



రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. ఐటీ, ఎలక్ట్రిక్ వెహికిల్స్, ఫార్మా, బయో సైన్సెస్‌లతో పాటు ఇతర రంగాల్లో పెట్టుబడులతో ముందుకొచ్చే పారిశ్రామిక వేత్తలకు అన్ని విధాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. "ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పెట్టుబడులకు చైనాకు ప్రత్యామ్నాయంగా పారిశ్రామిక రంగం భారత్ వైపు దృష్టి సారించగా, అందుకు అత్యుత్తమ గమ్యస్థానంగా తెలంగాణ ఉండాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం. తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీ పడాలన్నది మా ఆలోచన. 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని నిర్దేశించగా, అందులో తెలంగాణ నుంచి 10 శాతం మేరకు కంట్రిబ్యూట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నిర్దేశిత గడువు నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలని లక్ష్యంతో పెట్టుకున్నాం. బల్క్ డ్రగ్స్, వాక్సిన్ల తయారీలో ప్రపంచంలోనే తెలంగాణకు పేరు ప్రఖ్యాతులు వచ్చాయంటే ఇక్కడి పారిశ్రామిక వేత్తల కృషి ఎంతో ఉంది. కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని బయపెడుతున్న సమయంలో జినోమ్ వ్యాలీ నుంచే వ్యాక్సీన్లు తయారు చేసి దాదాపు వంద దేశాలకు సరఫరా చేసిన సందర్భం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం. ఈరోజు దేశంలో 33 శాతం వ్యాక్సీన్లు తెలంగాణ నుంచి ఉత్పత్తి అవుతుండగా, 40 శాతం మేరకు బల్క్ డ్రగ్స్ ఉత్పత్తు చేస్తున్నామంటే ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టిన వారు ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చారు. ఈ మధ్య కాలంలో బయో, ఫార్మసీ రంగంలో కూడా ప్రపంచంలోని అత్యాధునిక విధానాలు అవలంభిస్తున్న పరిశ్రమలను అహ్వానించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం.జినోమ్ వ్యాలీ పెట్టుబడు దారులకు స్వాగతం పలుకుతున్నాం. ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా ప్రోత్సాహకాలను అందిస్తుంది. మీ మద్దతు కావాలి.పెట్టుబడులు పెట్టండి.."అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో మంత్రి శ్రీధర్ బాబు ఐకార్ లోగో ఆవిష్కరించగా, మంత్రి వివేక్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.

# సంపాదకీయం

## పెన్షనర్లకు న్యాయం చేయాలి

ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన పెన్షనర్ల%-%వర్గీకరణ చట్టం వల్ల పెన్షనర్లు ఆందోళన చెందుతున్నారు. పెన్షనుదారులను విధులు ముగిసిన సంవత్సరం, పదవీ విరమణ తేదీ, లేదా నియమాల ఆధారంగా వేర్వేరు వర్గాల్లో ఉంచటం వల్ల ఒకే విధిగా సేవ చేసినవారు వేర్వేరు లాభాలు పొందే అవకాశం ఉంది. సీనియర్ పెన్షనర్లకు తక్కువ, జూనియర్ పెన్షనర్లు ఎక్కువ పెన్షన్ పొందే పరిస్థితులు ఏర్పడతాయి. సమాన విధులు నిర్వహించిన వారికి సమాన పెన్షన్ రావాలని సుప్రీంకోర్టు పలుమార్లు తీర్పులు ఇచ్చినా, ఈ చట్టం ఆ ఆదేశాలను బైపాస్ చేసేలా తయారైందని పెన్షన్‌దారులు అభిప్రాయపడుతున్నారు. 1979లో ఆనాటి కేంద్ర ప్రభుత్వం కొత్త పెన్షన్ పాలసీని అమలు చేసింది. దీని ప్రకారం, 1979 మే 31 తర్వాత పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే కొత్త పెన్షన్ లబ్ధిని వర్తింపజేస్తామని తెలిపింది. అంతకుముందు పదవీ విరమణ పొందిన వారికి ఈ పెన్షన్ సౌకర్యాలు వర్తించవని నిర్ణయించింది. దీనిని వ్యతిరేకిస్తూ డి.ఎస్. నకారా అనే పెన్షన్‌దారు, మరికొందరు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో "పెన్షన్ అనేది సౌకర్యం కాదు, అది ఒక హక్కు, ఉద్యోగ సమయంలో చెల్లించిన సేవలకు ప్రతిఫలంగా ఇచ్చే సామాజిక భద్రత, విభజన అసమంజసం... పెన్షన్ విధానంలో మార్పులు, పెంపులు అన్నీ అంతకుముందు పదవీ విరమణ పొందినవారికీ వర్తించాలి." అని సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. పెన్షనుదారుల హక్కులకు, భద్రతకు ముప్పు తలపెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన 'పెన్షనర్ల వర్గీకరణ చట్టం'పై రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్‌దారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టం అమలుతో వేతన సవరణ, అరియర్స్, కరువుభత్యాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ వంటి అంశాల్లో పెన్షన్‌దారులకు అన్యాయాలు జరుగుతున్నాయని పెన్షన్‌దారుల సంఘం పేర్కొంది. పెన్షన్‌దారుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి, అఖిల భారత రాష్ట్ర పెన్షనర్ల సమాఖ్య పిలుపుతో, ఆంధ్రప్రదేశ్ పెన్షన్‌దారుల సంఘం ప్రధానమంత్రికి ఒక వినతిపత్రాన్ని పంపేందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో పెన్షన్‌దారుల సంక్షేమానికి అనేక చొరవలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో స్పందించి కేంద్రం దిశానిర్దేశం చేసిన చట్టాల వల్ల రాష్ట్ర పెన్షన్‌దారులకు తలెత్తిన సమస్యల పరిష్కారానికి అండగా నిలవాలని పెన్షన్‌దారులు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి చేసిన విజ్ఞప్తి లేఖలో పెన్షనర్లకు 12వ పీఆర్సీ అమలు, 35 శాతం మధ్యంతర భృతి, తగ్గించిన అదనపు క్వాంటం పెన్షన్ పునరుద్ధరణ, కమ్యుటేషన్ కాల పరిమితి 15 నుంచి 11 సంవత్సరాలకు తగ్గించడం వంటివి ఉన్నాయి.

## ఈ అరకొర నివేదిక దేనికి?!



ఒక పెను విషాదంపై జరిగే దర్యాప్తు ఎంతో బాధ్యతాయుతంగా వుండాలి. ఆ ఉదంతంలో అసలు జరిగిందేమిటో చెప్పే ప్రయత్నం చేసినప్పుడు అస్పష్టతకు తావీయకూడదు. ప్రాథమిక దర్యాప్తుకైనా, పూర్తిస్థాయి దర్యాప్తుకైనా ఇదే వర్తిస్తుంది. కానీ గత నెల 12న గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం విషయమై శుక్రవారం అర్ధరాత్రి వెలువరించిన ప్రాథమిక దర్యాప్తు ఆ నియమాలను ఉల్లంఘించింది. బాధిత కుటుంబాల్లో అయోమయాన్ని మరింత పెంచింది. ఆ ప్రమాదం వైమానిక ప్రమాదాల చరిత్రలో పెద్దది. ఆ విషాద ఘటన సమ యంలో విమానంలో 242 మంది ప్రయాణికులుండగా, ఒకరు క్షేమంగా బయటపడ్డారు. భవంతిపై కూలినందువల్ల అక్కడున్న 19 మంది ప్రాణాలు కోల్పోయారు. విమానంలో ఇంధనాన్ని నియంత్రించే స్విచ్‌లు రెండూ ఆపివేసి వుండటం వల్లనే ప్రమాదం జరిగివుండొచ్చని దర్యాప్తు చేస్తున్న విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక నివేదిక భావించింది. ఇది కేవలం ప్రాథమిక నివేదికే గనుక వెంటనే నిర్ణయానికి రావటం తగదని కేంద్ర వైమానిక మంత్రిత్వ శాఖ అంటున్నది. మంచిదే. అటువంటప్పుడు ఏఏఐబీ నివేదిక స్విచ్‌ల విషయంలో మరింత సమాచారం అందాకే వాటిని ప్రస్తావించి వుండాల్సింది. పైలెట్ల సంఘం కూడా నివేదికను తప్పుబడు తోంది. పైలెట్ల తప్పిదమే కారణమని అర్థం వచ్చేలా నివేదిక వుండటం సరికాదని విమర్శిస్తున్నారు. దర్యాప్తులో తమ ప్రతినిధికి ఇప్పటికైనా చోటీయాలని వారు అంటున్నారు. ఈ అయోమయం ఇప్పటికే పుట్టెడు దుఃఖంలో వున్న బాధిత కుటుంబాలను మరింత నొప్పించదా? అంతర్జాతీయ వైమానిక నిబంధనల ప్రకారం ప్రమాదం జరిగిన ఏడాదిలోగా తుది నివేదిక రావాలి. ఈలోగా విడుదల చేసే ప్రాథమిక నివేదిక పైలెట్లను తప్పుబట్టే విధంగా వుండటం, ఆ తర్వాత దాన్ని ప్రామాణికంగా తీసుకోవాల్సిన అవసరం లేదనటం న్యాయమేనా? ఘటనా స్థలంలో దొరికిన స్విచ్‌లున్న పరికరంలో అవి రెండూ 'ఆన్' చేసివున్నాయి. కానీ కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో ఒక పైలెట్ మరొకరితో 'ఇంధనం ఎందుకు నిలిపివేశావ్' అని అడగటం, అందుకు రెండో పైలెట్ 'నేనలా చేయలేదే...' అంటూ జవాబివ్వటం వినబడటాన్నిబట్టి స్విచ్‌లు ఆపివేసి వున్నట్టు దర్యాప్తు బృందం నిర్ధారణకొచ్చింది. కానీ రెండో పైలెట్ ఆ వెంటనే వాటిని సరిచేసి వుండొచ్చని, అందుకే అవి సక్రమంగా వున్న స్థితిలో లభించాయని నివేదిక అంటున్నది. ఈ సంభాషణల్లో అడిగిన వారెవరో, జవాబిచ్చిన వారెవరో దర్యాప్తు చేసినవారు గుర్తించారా? గుర్తించి వుంటే ఆ సంగతి వెల్లడించటానికి వారికున్న అభ్యంతరమేమిటి? ఒకవేళ అలాంటి అభ్యంతరం వున్నప్పుడు అసలు ఆ సంభాషణను బయటపెట్టడం దేనికి? విమానంలోని యాంత్రిక వ్యవస్థలు సంక్లిష్టమైనవి. విమాన గమనంలో మనుషుల జోక్యం దాదాపు అవసరం లేని 'ఫ్లై బై వైర్' వ్యవస్థ అందుబాటులోకొచ్చి దశాబ్దాలవుతోంది. ముఖ్యంగా విమానం టేకాఫ్ సమయంలోనూ, దిగే సమయంలోనూ ఆ వ్యవస్థ పూర్తిగా తనకు తానే అన్నిటినీ సరిచేసుకుంటుంది. పైకెగిరినప్పుడూ, కిందకు దిగినప్పుడూ అవసరమైన ఇంధనం సరఫరా అయ్యేలా చూసుకుంటుంది. ఇవి విఫలమైన పక్షంలో పైలెట్ అవసరమైన మార్పులు చేసుకోవ డానికే స్విచ్‌లుంటాయి. రెండు స్విచ్‌లకూ రెండువైపులా రింగ్‌లుంటాయి. వాటికి ప్రత్యేక లాకింగ్ వ్యవస్థ వుంటుంది. మనిషి ప్రత్యేకించి వాటిని స్విచాన్ చేయటానికైనా, స్విచాఫ్ చేయటానికైనా ముందు ఆ లాకింగ్‌ను తెరవక తప్పదు. రెండు స్విచ్‌లూ ఆగిపోవటానికి మధ్య సెకను వ్యవధి వుందని తేల్చారు. పైగా పైకెగురుతున్న సమయంలో ఎక్కువ ఇంధనం సరఫరా కావాల్సి వుండగా దాన్ని కావాలని ఏ పైలెట్ కూడా స్విచాఫ్ చేయడు. దానిపై దర్యాప్తు బృందం ఏ నిర్ధారణకూ రాలేదు. పైలెట్లుగా వ్యవహరించినవారి చరిత్ర చూసినా ఉద్దేశపూర్వకంగా ఆపివుంటారని ఊహించటం అసాధ్యం. ప్రధాన పైలెట్ సుమీత్ సభర్వాల్‌కు బోయింగ్ 787ను 8,600 గంటలు నడిపిన సర్వీస్ (మొత్తంగా 15,638 గంటల సర్వీస్) వుండగా, కో పైలెట్ క్లైవ్ కుందేర్‌కు బోయింగ్‌పై 1,100 గంటల అనుభవం, మొత్తంగా 3,403 గంటల అనుభవం వుంది. ఇద్దరూ ఈ విమానం నడపటానికి ముందు తగినంత విశ్రాంతి తీసుకున్నవారే. ప్రధాన పైలెట్ పర్యవేక్షణలో కో పైలెట్ ఇష్టానుసారం చేయటం సాధ్యపడదు. ఒకవేళ ఆ ప్రయత్నం జరిగివుంటే వాగ్వాదం చోటుచేసు కునేది. అది రికార్డయ్యేది. పూర్తి స్థాయి పారదర్శకతకు దర్యాప్తు సంస్థ ఎందుకు వెనకాడుతోంది? ఇద్దరి మధ్య జరిగిన సంభాషణను కేవలం ఒక ప్రశ్న, జవాబు స్థాయికి కుదించటంలోని మర్మమేమిటి? అటు తర్వాత లేదా అంతకుముందు వారేం మాట్లాడుకున్నారు? ఇది చెప్పకపోతే పైలెట్లలో ఒకరు ఆత్మాహుతికి పాల్పడ్డారా అనే సంశయం బయల్దేరుతుంది. ఎయిర్‌లైన్స్ రేటింగ్స్ వెబ్‌సైట్ ప్రధాన సంపాదకుడు జెఫ్రీ థామస్ అడుగుతున్నది ఇదే. దర్యాప్తు ఫలితాల గురించి అంతర్జాతీయంగా అనేకులు ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే ఈ రకం విమానాలను బ్రిటిష్ ఎయిర్‌వేస్ సంస్థ, వర్జిన్ అట్లాంటిక్ సంస్థ ప్రధానంగా వినియోగిస్తున్నాయి. ప్రాథమిక నివేదిక విడుదల చేయటం స్వాగతించదగిందే. కానీ ఇప్పటికే వున్న సంశయాలను మరింత పెంచేలా, అస్పష్టత అలుముకునేలా అది వుండటం సరికాదు. పైలెట్ల మధ్య జరిగిన సంభాషణ పూర్తి పాఠం విడుదల చేస్తే అటు పైలెట్‌ల సంఘం అభ్యంతరాలతోపాటు, ఇటు బాధిత కుటుంబాల సంశయాలు కూడా సమసిపోతాయి.

## వారికి మళ్లీ ఎందుకీ ఆశలు?

వారికి తెలంగాణపై కేసీఆర్ ప్రభుత్వం ఉన్నంతకాలం ఆశలు కలుగలేదు. ఆశల మాట అట్లుంచండి, ఇటు కన్నెత్తి చూసే సాహసం కూడా చేయలేదు. ఆ విధమైన సాహసాలు, ఆశలు ఇక్కడ రేవంత్‌రెడ్డి నాయకత్వాన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదలయ్యాయి. ఆయన పాలనను ఏడాది పాటు చూసిన వెనుక రెండవ సంవత్సరం నడుస్తుండగా. ఇక్కడ రెండవ సంవత్సరం వచ్చేసరికి అటు ఏపీలో చంద్రబాబు తిరిగి అధికారానికి వచ్చి కుదురుకోవటం మొదలైంది. ఆ విధంగా అక్కడి శక్తులకు, ఇక్కడి శక్తులకు కలిసి, రేవంత్ రెడ్డి కాలం తమకు తగిన అదనుగా తోస్తున్నది. దానితో ఇరువురు కలిసి, తెలంగాణను పరోక్షంగా తమ అదుపులోకి తీసుకునేందుకు వ్యూహరచన చేసి అమలు జరుపుతున్నారు. తెలంగాణలోని చంద్రబాబు అనుకూల మీడియా ఇందులో తన పాత్ర తాను పోషిస్తున్నది. ఇక్కడ ఒక విషయం గుర్తించాలి. ఈ తరహా ఆశలు, వ్యూహాలు చంద్రబాబు వర్గాన్ని కేంద్రంగా చేసుకొని వారి చుట్టూ తిరుగుతున్నవే. అక్కడి సామాన్య ప్రజలలో ఇటువంటి ఆలోచనలు కనిపించటం లేదు. అట్లాగే, కోస్తాంధ్ర ప్రాంతాన్ని మినహాయిస్తే రాయలసీమ, ఉత్తరాంధ్రలతో పాటు, గోదావరి సీమలోనూ దీనితో మమేకత ఏమీ లేదు. అనగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును ఏ వర్గాలైతే శతవిధాలా వ్యతిరేకించి విఫలమయ్యాయో, తిరిగి వారికే ఈ ఆశలన్న మాట. ఒకసారి ఉద్యమకాలానికి వెళ్లి చూద్దాం. అప్పుడు ఇదే వర్గం తెలంగాణ ఏర్పాటును మనసా వాచా కర్మణా వ్యతిరేకించింది. అందుకు కారణం వారి ప్రయోజనాలని తెలిసిందే గనుక తిరిగి చెప్పుకోనక్కరలేదు. అయితే, వారి తరహా ప్రయోజనాలేవీ లేని ఉత్తరాంధ్ర, గోదావరి, రాయలసీమ వాసులు చివరికి కోస్తాంధ్రకు చెందిన బడుగు బలహీన వర్గాలవారు కూడా ఆ వ్యతిరేకతలో భాగం కాలేదు. అక్కడ సృష్టి అయిన సమైక్యాంధ్ర ఉద్యమం కేవలం దోపిడీదారులైన ధనిక వర్గాల వారిదని వారికి అవగాహన కలిగింది. కనుకనే ఆ ఉద్యమంలో వారు భాగస్వాములు కాలేదు. అయినా, పాలకులకు, ధనికులకు రకరకాల బలాలు ఉంటాయి గనుక వాటిని ఉపయోగించి కృత్రిమ ఉద్యమపు గాలి బుడగ ఒకటి సృష్టించి, కొద్దికాలం కృత్రిమంగా నడిపారు. ఆ బుడగలోని గాలి త్వరలోనే దిగిపోతూ చివరికి పేలిపోయింది. ఇదంతా నా పర్యటనలలో కండ్లారా చూసిన విషయం. అంతేకాదు. తెలంగాణ ఏర్పడితే తమ పరిస్థితి ఏమిటని ఆంధ్ర ప్రాంతంలోని వారికి, అంతకన్న ఎక్కువగా అప్పటికే హైదరాబాద్‌తో పాటు తెలంగాణ జిల్లాలలో నివసిస్తున్న వారికి కొద్ది సంశయాలు ఏమైనా ఉంటే, అవి కేసీఆర్ పాలన మొదలైన స్వల్పకాలంలోనే సమసిపోయాయి. ఆ సమాచారాలు ఆంధ్ర జిల్లాలకు రోజువారీగా చేరుతుండేవి. దీనంతటిలోని ఒక విశేషం, ఇక్కడి ఆంధ్రులకు, అక్కడి ఆంధ్రులకు కూడా కేసీఆర్ పాలన పట్ల ఆశ్చర్యంతో కూడిన సదభిప్రాయం కలగటం. తమకు కూడా అటువంటి పాలకుడుంటే బాగుండును కదా అనే మాట సర్వ సాధారణంగా మారింది. అప్పటికి కేసీఆర్ మొదటిసారి ప్రభుత్వాన్ని నడుపుతుండగా, ఆంధ్రలో నడుపుతున్న నాయకుడు ఉద్దండునిగా ప్రచారం పొందిన అనుభవజ్ఞుడు. ఈ విధమైన తేడాల వల్లనే ఆంధ్ర ప్రజలు రెండవ ఎన్నికలో చంద్రబాబును చిత్తుగా ఓడించి తెలంగాణలో కేసీఆర్ పార్టీకి మూకుమ్మడిగా ఓటు వేశారు. మొన్న మూడవసారి సైతం, చంద్రబాబు పార్టీ ఎన్ని కుయుక్తులు పన్నినా హైదరాబాద్ ఆంధ్రులంతా కేసీఆర్‌ను బలపరిచారు. ఈ విధమైన ఉద్యమకాలం




నేపథ్యాన్ని, వరుసగా మూడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన్ని సమీక్షిస్తే అర్థమయ్యేదేమిటి? మొదట 1956లో తెలంగాణను ఆక్రమించిన వారు, తర్వాత నుంచి ఒప్పందాలను ఉల్లంఘించినవారు, ఉద్యమాలను అణచివేసినవారు, 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడేవరకు ఈ ప్రాంతాన్ని అంతర్గత వలసగా మార్చుకొని దోపిడీ చేసినవారు, రాష్ట్రం రాకుండా శతవిధాల ప్రయత్నించినవారు, ఏర్పడిన తర్వాత సైతం విభజన సమస్యలను మిగిల్చి ఇబ్బందులు పెడుతున్నవారు, తమ పూర్వకాలపు అనుచరుడు రేవంత్‌రెడ్డి అసమర్థతను, విధేయతను ఉపయోగించుకుంటూ తెలంగాణను తమ పరోక్ష జాగీరుగా మార్చుకొనజూస్తున్న వారు అందరిదీ ఒకే జాతి, అదే వారసత్వం. మెర్కంటైల్ ఇంపీరియలిజం, భౌగోళిక వలసవాదం, సామ్రాజ్యవాదం, నయా వలసవాదం, ఆర్థిక-సాంకేతిక శాస్త్ర వలసవాదం, తర్వాత ట్రంప్ కాలపు టారిఫ్ వలసవాదం వలె, ఈ వర్గపు దోపిడీదారులు బహు రూపాలలో అవతరిస్తూ జాగీర్లు నడుపజూస్తుంటారు. కానీ, ఈ వర్గాల వెంట సామాన్య ప్రజలుండరు. ప్రస్తుతం చంద్రబాబు సాగిస్తున్న నయా జాగీర్ చాణక్యంలోనూ తన వెంట ఇక్కడి సామాన్య ఆంధ్రులు గాని, అభివృద్ధినీ, ప్రశాంత జీవనాన్ని, తెలంగాణ ప్రజలతో ప్రేమపూర్వక సంబంధాల కొనసాగుదలను కోరుకునేవారు గానీ లేరు. ఆ విధంగా చంద్రబాబు ఒక ఒంటరి. ఇతరత్రా తన వర్గానికే చెందినప్పటికీ తన వలె ఆలోచించని వారు అనేకులు గనుక ఆ విధంగానూ ఒంటరి. తనతో చేయి కలిపితే వచ్చేదీ పోయేదీ లేదు గనుక 'చేయి కలిపే చూద్దాము రామా హరీ' అనుకునే సినిమా నట నాయకుని భాగస్వామ్య ప్రయోజనం శూన్యం గనుక అట్లానూ ఒంటరి. తెలంగాణలో చంద్రబాబుతో పొత్తు నిప్పును ముట్టుకోవటమేనని బీజేపీకి తెలుసు గనుక ఆ విధంగానూ ఒంటరి. చివరికి తన వెంట నిజంగా నిలిచేది తన సామంత మీడియా మాత్రమే. సామ్రాజ్యవాద చరిత్రలోనే కాదు, అంతర్గత వలసల చరిత్రలోనూ ఆసక్తికరమైన పరిస్థితి ఒకటి కనిపిస్తుంది. దోపిడీదారులు తమ ఓటమిని ఓడిన తర్వాత కూడా అంగీకరించరు. ఆ కొత్త స్థితిని స్వీకరించి అందుకు అనుగుణంగా వ్యవహరించరు. తమ దోపిడీ ప్రయత్నాలు సాగిస్తూనే ఉంటారు. అందుకు కొత్త కొత్త మార్గాలు అన్వేషిస్తుంటారు. తమ వల్ల కలిగిన, కలుగుతున్న, కలగగల హానిని సదరు ప్రజలు గ్రహించినట్టు, దానిని ఎంతమాత్రం ఆమోదించటం లేదన్నట్టు తెలిసి కూడా తమ ప్రయత్నాలు ఆపరు. చంద్రబాబు విషయమే చూద్దాం. ఆయన ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించినపుడు, తర్వాత విభజన సమయంలో ఏమేమి చేశారన్న చరిత్ర అందరికీ తెలిసిందే గనుక ఇక్కడ గుర్తుచేయనక్కరలేదు. కాని విభజన చట్టంలో ఉన్న ప్రకారం తెలంగాణకు రావలసిన వాటికి, తర్వాత తను ఐదేండ్ల పాటు ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక సమస్యలు సృష్టించారు. వాటిలో అనేకం ఈ పదకొండేండ్లు గడిచిన తర్వాత కూడా మిగిలే ఉండటాన్ని బట్టి ఆయన స్వభావం ఏమిటో గ్రహించవచ్చు. అదంతా చాలదన్నట్టు, ఏపీలో మళ్లీ అధికారానికి వచ్చినాక గత ఏడాదిగా కూడా తెలంగాణకు నష్టం కలిగించి తాము లాభపడేందుకు కొత్త విధాలుగా ప్రయత్నిస్తున్నారు. అందుకు సరికొత్త ఉదాహరణ బనకచర్ల. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం కొనసాగుతుండి ఉంటే బనకచర్ల ప్రతిపాదన చేసేందుకైనా చంద్రబాబు సాహసించేవారా? ఆ ప్రతిపాదన వల్ల తెలంగాణకు కలిగే నష్టం ఎంతటిదో ఆయనకు తెలియనిది కాదు. అయినప్పటికీ ఏ నష్టమూ లేదని నమ్మబలుకుతూ ఆ ప్రతిపాదనను ముందుకు తోసే ప్రయత్నం చేస్తున్నారంటే అందుకు మూడు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి, పైన అనుకున్నట్టు తెలంగాణలో కేసీఆర్ అధికారంలో లేకపోవటం. రెండు, తన మద్దతుపై ఆధారపడిన కేంద్ర ప్రభుత్వం. మూడు, తనకు సహచరుడైన రేవంత్ రెడ్డి ఇక్కడ ముఖ్యమంత్రి కావటం. ఇవిగాక మరొక పరిస్థితి కూడా ఆయనకు కలసివస్తున్నట్టు తోస్తున్నది. అది, కాంగ్రెస్ జాతీయ నాయకత్వానికి ఇటువంటి విషయాలపై శ్రద్ధ లేకపోవటం. తమ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రంలో ఇటువంటి నష్టాలు జరిగితే ప్రజలలో అప్రతిష్ట పాలై తమ పార్టీకి కూడా నష్టం జరుగుతుంది. అటువంటప్పుడు తమ ముఖ్యమంత్రిని కట్టడిచేయాలి. కానీ, ఆ పనిచేయటం లేదు. తమకు కావలసిందల్లా ఇక్కడ అధికారంలో ఉండటం, తద్వారా పలురకాల లాభాలు పొందటం. రేవంత్ రెడ్డి మంత్రులకు, పార్టీ ముఖ్యులకు కూడా ఇదే పరమ లక్ష్యంగా మారినట్టు కనిపిస్తున్నది. ఇక్కడి పరిస్థితులను ఏఐసీసీ నాయకత్వానికి వివరించి జాగ్రత్తలు చెప్పవలసిన పార్టీ పరిశీలకురాలు ఒక అసమర్థ సజ్జనురాలి వలె రుజువు చేసుకుంటున్నారు. ఇక్కడి మేధావులు అనబడే వారిలో పలువురు తమ తమ స్వీయ కారణాలతో మౌనదీక్షలు చేస్తున్నారు. చంద్రబాబును ఒక నెగెటివిస్ట్ సూక్ష్మబుద్ధిగా మనం అంగీకరించవలసి ఉంటుంది. పైన వివరించుకున్న పరిస్థితులను సాకల్యంగా సమీక్షించుకున్న ఆయన, తెలంగాణను తన వర్గపు నయాజాగీర్‌గా మార్చుకునేందుకు ఇదే సానుకూల సమయమన్న అంచనాకు వచ్చినట్టు స్పష్టమవుతున్నది. ఎప్పుడైనా ఇటువైపు ఉండే బలహీనతలు అటువైపు బలమవుతాయి. కానీ, సరిగ్గా ఇక్కడనే చంద్రబాబు, ఆయన వర్గం, వారి మీడియా పెద్ద పొరపాటు చేసింది. కేసీఆర్ నాయకత్వాన బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం అధికారంలో లేకపోయినా ఏ మాత్రం చెక్కుచెదరని సజీవశక్తినీ, క్రియాశీలతనూ, అంతే ముఖ్యంగా తెలంగాణ ప్రజల చైతన్యాన్ని, పోరాట శక్తిని తప్పుగా అంచనా వేశారు. ఉద్యమకాలంలో వేసిన తప్పుడు అంచనా వంటిదే ఇది కూడా. ఆ నాటి తప్పుడు అంచనా నుంచి చంద్రబాబు, ఆయన మీడియా ఎటువంటి పాఠాలు నేర్చుకోకపోవటం గమనించదగినది. బనకచర్ల అంశం ఉదాహరణకు పేర్కొంటున్నప్పటికీ అటువంటి అజెండాలు, రేవంత్ రెడ్డి మౌనం వహిస్తున్నవి, సహకరిస్తున్నవి ఇంకా ఉన్నాయి. ఆయన ఇంకా పాలించే మూడున్నరేండ్లలో మరిన్ని ముందుకు వస్తాయి. అందువల్ల తెలంగాణ ప్రజలు, యువకులు, ఇంకా మిగిలిన మేధావి వర్గాలు నిరంతరం అప్రమత్తంగా ఉండటం అవసరం. అలా ఉన్నప్పుడు వారిని ఏ శక్తీ ఎదుర్కొనజాలదు.

## ఏం చేశారని ఓట్లడుగుతరు?

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా ఎప్పుడు మోగనున్నదనే విషయమై ఇప్పటికీ స్పష్టత రావడం లేదు. ఈ ఎన్నికలు ప్రస్తుత ప్రభుత్వానికి సవాల్‌గా మారడమే అందుకు కారణం. పదేండ్లలో తెలంగాణ గ్రామాల రూపురేఖలను సమూలంగా మార్చివేసిన కేసీఆర్ ముందు కాంగ్రెస్ ఎన్ని కుప్పిగంతులు వేసినా ప్రయోజనం ఉండదు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రెండు లక్షల రుణమాఫీ, 63 వేల ఉద్యోగాల నియామకం వంటి అరకొరగా అమలైన హామీలు ఎన్నికల్లో ఓట్లు రాల్చుతాయని అనుకోవడం కాంగ్రెస్ పాలకుల భ్రమ. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పల్లెలు బోసిపోయిన నిజం ప్రతి తెలంగాణ పౌరుడికి తెలుసు. పరాయి పాలనలో తెలంగాణ ప్రజలు బొంబాయి, దుబాయి, బొగ్గుబాయి బాట పట్టేవారు. గోరెటి వెంకన్న రాసిన 'పల్లె కన్నీరు పెడుతుందో' పాటను ఇప్పుడు విన్నా జనం కండ్లు చెమ్మగిల్లుతాయి. అయితే, నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అన్ని సమస్యలకు చరమగీతం పాడింది. కేసీఆర్ సర్కారు నెలనెలా రూ.339 కోట్లను గ్రామ పంచాయతీలకు మంజూరు చేయడంతో పల్లె ప్రగతికి పరుగులు పెట్టింది. తెలంగాణ ఏర్పాటయ్యే నాటికి ఉన్న 9,623 గ్రామ పంచాయతీల సంఖ్యను కేసీఆర్ సర్కారు 12,769కు పెంచింది. 1,177 తండాలు, గోండు, కోయ, గూడేలను గ్రామ పంచాయతీలుగా మార్చింది. గిరిజన బిడ్డలను పాలకులను చేసింది. అంతేకాదు, ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక గ్రామ కార్యదర్శి ఉండే విధంగా 9,355 మందిని గ్రామ కార్యదర్శులుగా నియమించింది. ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ సమకూర్చడంతో ఏ రోజు చెత్తను ఆ రోజే డంపింగ్ చేసే అవకాశం కలిగింది. ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతివనాలు, వైకుంఠధామాలు, నర్సరీలు ఏర్పాటయ్యాయి. 100 శాతం మరుగుదొడ్లు నిర్మితమయ్యాయి. మిషన్ కాకతీయతో పల్లెల్లోని చెరువుల్లో నీటి కళ వస్తే, మిషన్ భగీరథతో ప్రతి పల్లె ప్రజలకూ స్వచ్ఛమైన తాగునీరు లభించింది. భూగర్భ జలాలు పెరగడంతో వ్యవసాయ విస్తీర్ణం పెరిగింది. వలసపోయినవారు వాపస్ వచ్చారు. రైతులకు ఉచిత విద్యుత్తు, ఆసరా పింఛన్లు, గొర్రెలు, చేపపిల్లల పంపిణీ, రైతుబంధు, రైతు బీమా, కంటివెలుగు, కేసీఆర్ కిట్, రైతు వేదికలు గ్రామీణ ప్రజలకు ఎంతో మేలు చేశాయి. దేశంలోనే వంద శాతం ఓడీఎఫ్ ప్లస్ సాధించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచి, గెలిచింది. స్వచ్ఛ సర్వేక్షన్, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జాతీయ రూర్బన్ మిషన్, సంసద్ ఆదర్శ్ గ్రామ్ యోజన, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ పురస్కారాలు మన పల్లెలను వరించాయి. గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లాల సంఖ్యను కేసీఆర్ సర్కారు పెంచింది. తద్వారా మండల, జిల్లా పరిషత్తులు పెరిగాయి. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లా కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలు ప్రజలకు మరింత చేరువయ్యాయి. గ్రామాల్లో రవాణా సౌకర్యాలు పెరిగాయి. వాణిజ్య సౌకర్యాలు మెరుగయ్యాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా పల్లెలు, పట్టణాల ప్రగతిని పర్యవేక్షించేందుకు ఒక ఐఏఎస్ స్థాయి అధికారిని అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్)ను బీఆర్ఎస్ ప్రభుత్వం నియమించింది. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల గౌరవ వేతనాలను 30 శాతం పెంచింది. సఫాయి కర్మచారుల వేతనాలూ పెంచింది. నిధుల ఆడిట్‌కు అవలంబిస్తున్న ఆన్‌లైన్ విధానం దేశానికే ఆదర్శమని నాటి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ కొనియాడారు. అభివృద్ధి అనేది నిత్య నూతనం. ఏడాదిన్నర కాలంలో ప్రస్తుత ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు ఏమి చేసిందని ఓట్లు అడుగుతారు. గ్రామీణాభివృద్ధి అంటే తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం, టి.ఎస్ తీసేసి టి.జి చేయడం, ఉద్యమంలో ఊపందుకున్న గీతాల ట్యూన్స్టైల్‌ను మార్చడం కాదు. ప్రజలకు అవసరమయ్యే పనులు చేయాలంటే హృదయం కావాలి. చిత్తశుద్ధి, లక్ష్యసిద్ధి, కార్యసిద్ధి కావాలి. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు రాజ్యాంగ రక్షణ కల్పించండి. ప్రతి పంటకు కనీస మద్దతు ధర ప్రకటించండి. రైతుల ఆత్మహత్యలను ఆపండి. ధాన్యం సేకరణకు, ధాన్యం రక్షించుకోవడానికి గిడ్డంగుల

# ప్రజలకు ఇచ్చిన మాట నెరవేరుస్తున్నాం

ఇది మంచి ప్రభుత్వం.. ప్రజల సమస్యల పరిష్కారంలో రాజీ పడం

ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు కొనసాగిస్తాం.

అమడగూరు చినగానీపల్లి పంచాయతీలో ఇంటింటికి కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



ఆమడగూరు : పుట్టపర్తి నియోజకవర్గం ఆమడగూరు మండలం చినగానిపల్లి పంచాయతీలో కూటమి ప్రభుత్వం సుపరిపాలనలో కొన్ని అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఇంటింటికి కార్యక్రమం చేపట్టారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఏపీ అభివృద్ధి శూన్యమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమం , అభివృద్ధి కార్యక్రమాలను రెండు కళ్లు లా ప్రజలకు అమలు చేస్తోందని తెలిపారు. ఈ ఐదేళ్లలో పుట్టపర్తి నియోజకవర్గాన్ని ఏపీలో అగ్రస్థానంలో నిలపడమే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని 193 చెరువులకు రెండు రిజర్వాయర్లకు కృష్ణా జిల్లాలో తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. అమడుగూరు మండలంలోని చినగానిపల్లి పంచాయతీలో రామనాథ పురం ,బాబాజీ కొత్తపల్లి ,మారుతి పురం ఈడిగవారిపల్లి ఆకులోల్లపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేశారు. అనారోగ్యానికి గురైన నీరుగుట్టి నాగరాజు కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. 6 మాసాల నుంచి అనారోగ్యంతో మంచంపై వైద్యం కోసం ఎదురుచూస్తున్న నాగరాజుకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పరామర్శించి ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు గతంలో అతనికైన వైద్య ఖర్చులు ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రెడ్డి హామీ ఇచ్చారు. అంతే కాకుండా నాగరాజుకు మెరుగైన వైద్యం అందించే విధంగా చూడాలని సత్య సాయి జిల్లా వైద్యాధికారి ఫైరజ్ బేగంతో ఎమ్మెల్యే ఫోన్ ద్వారా మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట స్థానిక కూటమి పార్టీల నాయకులు మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి ,టిడిపి యువ నాయకుడు శ్యాంబాబు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కృష్ణమూర్తి టిడిపి నాయకులు వెంకటరెడ్డి , కృష్ణారెడ్డి ,రాజారెడ్డి , రమణారెడ్డి ,నంజప్ప ,నాగేందర్ రెడ్డి , రామకృష్ణ భాస్కర్ ,ఆకులపల్లి బూత్ కమిటీ ఇన్చార్జ్ రమేష్ డీలర్ శంకర్ ,రాజగోపాల్ , గంగాధర్ , రమణ ఆంజనేయులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం అమలుపై ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులు మానిటర్ చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,



అనంతపురం, ౼ : శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం అమలుపై ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులు మానిటర్ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం అమలుపై ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్ఈ, డిఈలు, ఏఈలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా మండలాల్లో ఇతర త్రాగునీటి పథకాలతో పాటు శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం అమలును కూడా ఆర్.డబ్ల్యు.ఎస్ ఏఈలు బాధ్యతగా పర్యవేక్షణ చేయాలన్నారు. శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం క్రింద 3.83 కోట్ల రూపాయల డబ్బులు ఎస్ఆర్ ఇన్ ఫ్రా కాంట్రాక్టర్ అకౌంట్ లో జమ కావడం జరిగిందని, ప్రభుత్వం నుంచి డబ్బులు రావడంతో కార్మికులు వెంటనే విధుల్లోకి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని చోట్లకి శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం నీరు వెళ్లేలా చూడాలన్నారు. కింది స్థాయిలో ఎవరు ఉన్నా లేకున్నా పథకాలు అమలు జరిగేలా, కొనసాగేలా చూడాలని, త్రాగునీటి పథకం ఆపేస్తాము అంటే కుదరదన్నారు. పంప్ హౌస్ లో, పైప్లైన్లలో నీళ్లు లేకపోతే అవి పగిలిపోయే అవకాశాలు ఉన్నాయని, పైపులు పగిలిపోతే సంబంధిత కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేస్తామన్నారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఎదురైనా రెగ్యులర్ వారిని పిలిపించి పనులు చేసేలా చూడాల్సిన బాధ్యతను ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు తీసుకోవాలన్నారు. శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం అమలుపై ప్రతిరోజూ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఆయా పంప్ హౌస్ లలో సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, వచ్చే శనివారం నాటికి వాటిని ఏర్పాటు చేయాలని, సీసీటీవీ కెమెరాల ఫీడ్ స్థానిక పోలీస్ స్టేషన్ తో పాటు కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కు కూడా అందించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్ఈ సురేష్, డిఈలు శిరీష, శ్రీనివాస్, ఏఈలు సురేంద్ర ప్రసాద్, శ్రీనివాసకుమార్, శివకృష్ణ, హరికృష్ణనాయక్, ధనుంజయ్, కార్యాలయం ఎస్ఈ పిఏ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# శాకంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన వాసవాంబ

18 గంటల పాటు శాకాంబరి అలంకారానికి శ్రమించిన శ్రీ వాసవి మహిళా మండలి సభ్యులు.



ధర్మవరం అర్బన్ : ఆషాడ మాసం మంగళవారం సందర్భంగా శ్రీ వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో స్థానిక కన్యకా పరమేశ్వరి దేవాలయంలోని మూల విరాట్ కు శాకంబరీ దేవి అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు పోలమడ రూప రాగిణి, కార్యదర్శి కాకుమాని కళ్యాణి, కోశాధికారి నల్లపేట మంజు సంయుక్త మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీ వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో దాతల సహాయ సహకారాలతో ఆషాడ మాసం సందర్భంగా ప్రతి శుక్రవారం, ప్రతి మంగళవారం వివిధ రకాల అలంకారాలతో అమ్మవారిని అలంకరింప చేస్తున్నామని, ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా దాతలు సహాయ సహకారాలతో ఆలయ అర్చకులు నారాయణమూర్తి, చంద్రశేఖర్ శర్మ సహాయ సహకారాలతో శాకాంబరి అలంకారాన్ని నిర్వహించామని ఇందుకోసం సుమారు 2000 కేజీల వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు తో సుమారు 18 గంటల పాటు వాసవి మహిళా మండలి సభ్యులు శ్రమించి శాకంబరీ అలంకారాన్ని నిర్వహించామని ప్రపంచంలోని సకల మానవాళి ఆయు ఆరోగ్యాలతో పాటు, సకాలంలో వర్షాలు కురిసి అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆషాడ మాసంలో అమ్మవారికి శాకంబరీ అలంకారాన్ని నిర్వహించమన్నారు. ఈ సందర్భంగా వాసవి మహిళా మండలి సభ్యులు లలిత సహస్రనామం నిర్వహించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జూటూరు రమణయ్య, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం కమిటీ చైర్మన్ పిన్ను ప్రసాద్, వాసవి మహిళా మండలి సభ్యులు, ఆర్య వైశ్య సంఘం వాటి అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# మొహారం ఘనంగ ఉత్సవాలు.

కుందుర్పి : కుందుర్పి మండలంలోఎంతో అద్భుతంగా జరుపుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా గ్రామ ప్రజలు, పెద్దమనుషులు, పోలీస్ సిబ్బంది గొడవలు కానీ ఏమి జరగకుండా ఎంత అద్భుతంగా జరుపుకొన్నారు కుందుర్పి కేంద్రం మండలంలో ఈరోజు సాయంత్రం 5 గంటలకు నీళ్లలోకి పడడం జరిగింది.

# మండల, గ్రామ స్థాయి అధికారులు ఒక్కొక్క బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలి

ఈనెల 19వ తేదీన స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలి

వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,



అనంతపురం, : జిల్లాలోని మండల, గ్రామ స్థాయి అధికారులు ఒక్కొక్క బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పంచాయతీ సెక్టార్, జీరో పావర్టీ పీ4, తదితర అంశాలపై డ్వామా పిడి, జడ్పి సిఈఓ, డిపిఓ, ఆర్డీఓలు, డిఎల్డిఓలు, డిఎల్పీఓలు, ఎంపీడీవోలు, ఈఓఆర్డీలు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీరో పావర్టీ పీ4 కార్యక్రమం కింద జిల్లాలో 54 వేల మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉందని, ఇందుకోసం మార్గదర్శకుల గుర్తింపు వేగంగా చేపట్టాలన్నారు. ప్రతిరోజు 3,000 మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనేలా చూడాలని, ప్రతి మండలం నుంచి 100 మంది, మున్సిపాలిటీ నుంచి 200 మంది బంగారు కుటుంబాలను ప్రతిరోజూ దత్తత తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్లు, వ్యాపారవేత్తలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని, ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలన్నారు. జి.ఎస్.డబ్ల్యు.ఎస్ అంశాలలో భాగంగా తల్లికి వందనం ఈకేవైసీకి సంబంధించి మదర్ చైల్డ్ ఈకేవైసీ పెండింగ్, గ్రీవెన్స్ పెండింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మన మిత్ర క్యాంపెయిన్ లో హౌస్ హోల్డ్ పెండింగ్ వెంటనే 24 గంటల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ కు సంబంధించి కంబదూరు మండలంలో 57 శాతం మాత్రమే ఉందని, అన్ని చోట్లా ఉద్యోగుల అటెండెన్స్ పూర్తిగా వంద శాతం నమోదయ్యేలా పురోగతి తీసుకురావాలన్నారు. ఏపీ సేవా సర్వీసెస్ రిక్వెస్ట్ లను సకాలంలో పరిష్కరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లాకు అవార్డులు వచ్చేలా కృషి చేయాలని, గ్రామాలు స్వచ్ఛంగా కనబడేలా చూడాలన్నారు. జి.ఎస్.డబ్ల్యు.ఎస్ అంశాలకు సంబంధించి పెండింగ్ సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్డబ్ల్యూపిసి షెడ్లను అన్ని చోట్ల పనిచేసేలా చూడాలన్నారు.

**ఈనెల 19వ తేదీన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కింద స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలి :**

ఈనెల 19వ తేదీన ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కింద స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జూలై నెల "అంతం - ప్లాస్టిక్ కాలుష్యం" అనవసరమైన ప్లాస్టిక్‌లు మరియు సంబంధిత కాలుష్యాన్ని నివారించాలనే థీమ్ తో వచ్చే శనివారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం ప్రజలందరికీ తెలిసే విధంగా టాం టాం వేయించాలని మరియు ప్రకటనలు చేయించి శనివారం రోజున ఏఏ కార్యక్రమాలు ఏ ప్రదేశాలలో జరుగుతాయో తెలియజేసి అందరూ ఇందులో పాల్గొనేలా చూడాలన్నారు. అన్ని కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, నివారించడం వంటి పనులు చేయాలన్నారు. ఐఈసి యాక్టివిటీలను మండల, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించాలని, ఆరోజు క్లాత్ బ్యాగులను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిపిఓ నాగరాజునాయుడు, సిపిఓ ఆశోక్ కుమార్, జడ్పి సిఈఓ శివశంకర్, ఆధార్ నోడల్ అధికారి నారపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాలి

జాబ్ మేళాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,



అనంతపురం, : జిల్లాలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, జాబ్ మేళాల నిర్వహణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా నైపుణ్య కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకి సంబంధించి మూడు నెలల్లో 8 జాబ్ మేళాలను నిర్వహించాల్సి ఉందని, వాటిని నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కు సంబంధించిన కార్యచరణను చేపట్టాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో చాలా మంది నిరుద్యోగులు ఉద్యోగం కావాలని అడుగుతున్నారని, వారికి ఎక్కడో ఒకచోట ప్రైవేట్, ఔట్సోర్సింగ్ లేదా ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగ అవకాశం కల్పించేలా చూడాలని ఉపాధి కల్పనా కార్యాలయం అధికారులను ఆదేశించారు. ప్రతినెల ప్లేస్మెంట్ రిపోర్ట్ అందజేయాలని సూచించారు. డిగ్రీ కళాశాలల్లో స్కిల్ హబ్స్ ని ఏర్పాటు చేసి వాటిని ప్రారంభించాలని, ఆగస్టు నాటికి వాటిని సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ల్యాబ్ ను ఏర్పాటు చేయనుండగా, ఆ సెంటర్ ను త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని, ఇందుకు సంబంధించిన పనులను పూర్తి చేయాలన్నారు.

**జాబ్ మేళా క్యాలెండర్ పోస్టర్ల ఆవిష్కరణ :**

అనంతరం 2025 - 26 సంవత్సరంలో రెండవ క్వార్టర్ జాబ్ మేళా క్యాలెండర్ కి సంబంధించిన పోస్టర్ లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి సంబంధించి జులై 18వ తేదీన, రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి జులై 28వ తేదీన, అనంతపురం అర్బన్ కి సంబంధించి ఆగస్టు 1వ తేదీన, గుంతకల్లు నియోజకవర్గం సంబంధించి ఆగస్టు 16వ తేదీన, రాయదుర్గం నియోజకవర్గానికి సంబంధించి ఆగస్టు 29వ తేదీన, సింగనమల నియోజకవర్గానికి సంబంధించి సెప్టెంబర్ 12వ తేదీన, తాడిపత్రి నియోజకవర్గానికి సంబంధించి సెప్టెంబర్ 19వ తేదీన, ఉరవకొండ నియోజకవర్గంకు సంబంధించి సెప్టెంబర్ 27వ తేదీన జాబ్ మేళాలను ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కళ్యాణదుర్గం పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, ప్రజా వేదికలో జాబ్ మేళాను 18వ తేదీన ఉదయం 09:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి జాబ్ మేళా క్యాలెండర్ పోస్టర్ లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జాబ్ మేళాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ పిడి శైలజ, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముకుద, డిటిడబ్ల్యుఓ రామాంజనేయులు, బిసి కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, రూడ్ సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జేఎన్టీయూ టిపిఓ శ్రీనివాసులు, ఎస్కేయు అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణుడు, మెప్మా డివైఎస్ఓ పద్మావతి, అయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరం చేనేత పట్టు చీరకు జాతీయ గుర్తింపు

ఓ డి ఓ పి- 2024 అవార్డును అందుకున్న మంత్రి సవితమ్మ, జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్.




ధర్మవరం. : భారత దేశ సమృద్ధమైన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం చేనేత పట్టు చీర 2024 సంవత్సరానికి గానూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "ఒక జిల్లా ఒక ఉత్పత్తి" కార్యక్రమం క్రింద ప్రతిష్టాత్మక జాతీయ అవార్డుకు ఎంపికైంది. ఈ గౌరవం ధర్మవరం పట్టు చీరల ప్రత్యేకతను, నైపుణ్య సంపదను దేశ వ్యాప్తంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయంగా కూడా గుర్తింపుచేసే దిశగా కీలకంగా మారనుంది. ఈ సందర్భంగా న్యూ ఢిల్లీ భారత్ మండపంలో ఏర్పాటు చేసిన అవార్డు ప్రదానోత్సవంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖా మంత్రి సవితమ్మ, జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ సంయుక్తంగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం

**మంత్రి సవితమ్మ మాట్లాడుతూ**

ఈ అవార్డులు వాణిజ్య రంగానికే కాకుండా, స్థానిక పరిశ్రమలకు విశేష ప్రోత్సాహం కలిగిస్తున్నాయన్నారు. ఇది కేవలం హస్తకళల ప్రదర్శన మాత్రమే కాకుండా, భారతదేశ భవిష్యత్తుకు ఒక సాంస్కృతిక గుర్తింపుగా నిలుస్తుందన్నారు. ఈ అవార్డులు ఆంధ్రప్రదేశ్‌కు లభించినందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది ఓ డి ఓ పి అవార్డుకు ధర్మవరం చేనేత పట్టు చీరలతో పాటు, కాకినాడ జిల్లా పెద్దాపురం శిల్క్, బాపట్ల జిల్లా చీరాల శిల్క్ చీరలు, తిరుపతి జిల్లా వెంకటగిరి చీరలు కూడా ఎంపికయ్యాయి అని తెలిపారు. ఈ ఎంపిక ద్వారా రాష్ట్రంలోని సంప్రదాయ హస్తకళలు, చేనేత ఉత్పత్తుల విలువ మరింతగా పెరిగే అవకాశం కలుగుతుంది అని తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ట్.ఎస్.చేతన్ మాట్లాడుతూ..ధర్మవరం చేనేత కార్మికుల నైపుణ్యానికి, పట్టుదలకు ఇది గౌరవ సూచికని, ఈ అవార్డు వల్ల ధర్మవరం చేనేత రంగానికి మరిన్ని కొత్త అవకాశాలు లభిస్తాయి అని తెలిపారు. మార్కెట్, ఉపాధి అవకాశాలు మరింత పెరగడానికి, అంతర్జాతీయ గుర్తింపు సాధించే మార్గంలో ఇది ఒక మైలురాయి అవుతుందన్నారు. ధర్మవరం చేనేత పట్టు చీరలకు ఈ గౌరవం దక్కినందుకు జిల్లా ప్రజలకు, చేనేత కార్మికులకు వారు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్త, కేంద్ర సహాయ వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి జితిన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై దాడిచేసి పలు వాహనాలకు జరిమానా విధించిన

## ఆర్డిఓ మహేష్.



ధర్మవరం. :ధర్మవరం డివిజన్ పరిధిలో గల తాడిమర్రి బత్తలపల్లి ధర్మవరం మండలాలలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న పలు వాహనాలపై ఆర్డిఓ మహేష్ ఆకస్మిక దాడి చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలో పలు ఇసుక వాహనాలను తరలిస్తున్న జెసిబి తో పాటు పలు వాహనాలను గుర్తించి సీజ్ చేసి జరిమానా విధించడం జరిగిందని ఆర్డీవో తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న ఫిర్యాదులు అధికంగా రావడంతో ఈ ఆకస్మిక దాడులను నిర్వహించడం జరిగిందని తెలిపారు. అక్రమ ఇసుక తరలింపులో మూడు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లు ,ఒక జెసిబి వాహనాలను గుర్తించి సీజ్ చేసి జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పురాతమైతే మైండ్స్ అండ్ మినరల్స్ చట్టం కింద నేరంగా భావించి కేసులను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గ ప్రజలు కూడా ఇలాంటి అక్రమ ఇసుక రవాణా కార్యకలాపాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొని పోవాలని తెలిపారు. సమాచారమిచ్చిన వారి పేరును గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ఎవరైనా అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని వారి హెచ్చరించడం జరిగింది. అనంతరం పోలీస్ శాఖ గనుల శాఖకు తగిన సూచనలను వారు తెలియజేశారు. అంతేకాకుండా ఈ తనిఖీల ద్వారా అధికారులు అక్రమ ఇసుక రవాణా చర్యలపై నిఘా కొనసాగించాలని, సమాచారం అందిన వెంటనే తక్షణ చర్యలు చేపట్టాలని వారు తెలిపారు. ఈ ఇసుక అక్రమ రవాణాపై ఎవరిని ఉపేక్షించమని వారు తెలియజేశారు.

# అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ

సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్

కాలనీల్లో సమస్యలపై శ్రీరామ్ కు విజ్ఞప్తులు

ఇది ప్రజలకు బాధ్యతగా ఉండే ప్రభుత్వమన్న పరిటాల శ్రీరామ్

టీడీపీ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని శ్రీరామ్ సూచన



ధర్మవరర్ : ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ.. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ ముందుకు సాగుతున్నారు. మంగళవారం పట్టణంలోని 1వ వార్డులోని గూడ్స్ షెడ్డు కొట్టాలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీరామ్ కు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆయన ఇంటింటికీ వెళ్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. ఏ ఇంట్లో ఎంత మందికి ఎన్ని పథకాలు వచ్చాయన్నది వివరించారు. పింఛన్లు 1వ తేది ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారా లేదా.. తల్లికి వందనం ఇంట్లో పిల్లలందరికీ అందిందా వంటి వాటి గురి ఆరా తీశారు. దాదాపు అన్ని చోట్ల పథకాలు అందుతున్నాయని చెప్పారు. కొన్ని చోట్ల సాంకేతిక కారణాలు, విద్యుత్ బిల్లులు వంటి వాటితో పథకాలు అందడం లేదని చెప్పగా.. వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. అలాగే కాలనీలో ఉన్న సమస్యల్ని ప్రజలు శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై స్థానికంగా ఉన్న సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. వాటిని వెంటనే పరిష్కరించేలా చూడాలని సూచించారు. స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు ఎప్పటికప్పుడు కాలనీల్లో తిరుగుతూ ఉండాలని.. ప్రజలకు దగ్గరగా ఉంటే వారి



సమస్యలు మనకు తెలుస్తాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఈ ప్రభుత్వం మరింత బాధ్యతగా ఉంటుందని ఈ సందర్భంగా శ్రీరామ్ స్పష్టం చేశారు. ఏడాది కాలంలో మీరు చూసిన అభివృద్ధి కొంతేనని.. ఇంకా నాలుగేళ్ల సమయంలో మరింత అభివృద్ధి చూస్తారన్నారు. సంక్షేమ పథకాలు అందించడం మాత్రమే ప్రభుత్వం లక్ష్యం కాదని.. అభివృద్ధి కూడా అదే స్థాయిలో జరగాలని అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టులు కూడా పూర్తి చేయాలనే లక్ష్యాలు ఉన్నాయన్నారు. వీటిన్నింటికీ ప్రజల సహకారం అవసరమని శ్రీరామ్ అన్నారు....

# పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జెసి సేతుమాధవన్



విజయనగరం, :స్థానిక గాజులరేగ సీతం కళాశాల సమీపంలోని అయాన్ డిజిటల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ తనిఖీ చేశారు. ఏపిపిఎస్‌సి ఆధ్వర్యంలో లెక్చరర్ పోస్టుల భర్తీకి మంగళవారం నుంచి పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. దీంతో ఈ పరీక్షా కేంద్రాన్ని జెసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహిస్తున్న తీరును, చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్ధులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఎటువంటి అవకతవకలకు తావివ్వకుండా, పకడ్బంధీగా పరీక్షలను నిర్వహించాలని అధికారులను జెసి ఆదేశించారు. ఈ తనిఖీల్లో విజయనగరం తాహసీల్దార్ కూర్మనాధరావు, సెంటర్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

## సాలూరు పురపాలక సంఘ కమీషనర్ ప్రసాద రావు:-



సాలూరు,: సీజినల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక అవగాహన ఉండాలని కమిషనర్ ప్రసాద్ రావు సూచించారు. మంగళవారం కమిషనర్ మరియు శానిటరీ ఇన్స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ ఆదేశాల మేరకు పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యత పై పురపాలక సంఘ పరిధిలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు (సబ్బు) చేతులు శుభ్రపరచుకోవడం పై విద్యార్థులకు అవగాహన నిర్వహించడం జరిగింది అని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమతో పాటు తమ ఇంటిని మరియు తన చుట్టు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని పరిశుభ్రత మరియు పారిశుద్ధ్యం పై దృష్టి పెట్టాలని సీజనల్ వ్యాధులకు బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు.పుర ప్రజలు ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుండి వచ్చిన వ్యర్థాలను ప్రతిరోజు తమ ఇంటికి వచ్చిన పారిశుధ్య కార్మికుడికి అందించాలని రోడ్లపై కాలువలో విచ్చలవిడిగా వ్యర్థాలను పారబోయి కూడదని సూచించారు.అలాగే పరిశుభ్రత మరియు పారిశుధ్యం పై దృష్టి పెట్టాలని లేకపోతే మనం సీజనల్ వ్యాధుల బారిన పడడం జరుగుతుందని దానివల్ల అనారోగ్యాన్ని గురి కాకూడదు అని అక్కడున్న



విద్యార్థిని,విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన చేయడం జరిగింది అన్నారు. అంతేకాకుండా మీరు పరిశుభ్రతపై నేర్చుకున్న విద్యను మీ గ్రామాల్లో,మీ తల్లిదండ్రులకు,మీ స్నేహితులకు,కూడా అవగాహన చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు,శానిటరీ సెక్రటరీలు మరియు శానిటరీ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# సూపరిపాలనే ధ్యేయం





విజయనగరం, : ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనకు తొలిఅడుగులో భాగంగా విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అతిథి గజపతిరాజు ఆదేశాలతో రెండో డివిజన్ అయిన పూల్ బాగ్ కాలనీలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాలన ఏ విధంగా ఉంది, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ముందుగా మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతి రాజుకు గోవా గవర్నర్ రావడంతో శ్రీ పాదాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అమలయ్యే తీరును అడిగి తెలుసుకున్నారు. తమ కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బూతు ఇంచార్జులు ,మరియు అద్దేపల్లి.సంతోసిరాజు, మహంతి. శ్రీరవి,కిలాన. మహేశ్,పాపారావు, కిలాన.వెంకటేష్ హురిటి. సాయి, ఎమ్. నవీన్, కె.షణ్ముఖరావు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు

# క్రీడాకారిణి భవానిని అభినందించిన జెసి సేతు మాధవన్

## క్రీడాప్రాధికార సంస్థ తరపున ప్రోత్సాహకం అందజేత



విజయనగరం,: కజకిస్తాన్‌లో జరిగిన జూనియర్ ఆసియన్ ఛాంపియన్‌షిప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వరుసగా 3 బంగారు పతకాలను సాధించిన జిల్లాలోని కొండకరకాం గ్రామానికి చెందిన క్రీడాకారిణి రెడ్డి భవానిని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అభినందించారు. తమ ఛాంబర్‌లో మంగళవారం ఆమెను దుశ్శాలువతో సత్కరించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ తరపున రూ.25వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. వచ్చే ఒలింపిక్ పోటీల్లో పతకాన్ని సాధించి, దేశానికి, జిల్లాకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వర్రావు, కోచ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# నాగవంశం సంక్షేమ సంఘం మరియు స్వామి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం





విజయనగరం,: విజయనగరం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ స్వర్గీయ అవనాపు సూరిబాబు 75వ జయంతి సందర్భంగా నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 476 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వీరిలో 142 మందికి ఆపరేషను చేయించేందుకు ఏర్పాట్లు చేశారు. అవనాపు సూరిబాబు 75వ జయంతి సందర్భంగా విజయనగరం నాగవంశ సంక్షేమ సంఘం మరియు స్వామి కంటి ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించిన ఈ మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నాగవంశ సంక్షేమ సంఘం అధ్యక్షలు అవనాపు విక్రమ్ ప్రారంభించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ మంచు రవళి నేతృత్వంలో స్వామి కంటి ఆసుపత్రి సిబ్బంది రోగులకు సేవలు అందించారు. సమాజ సంక్షేమానికి అవసరమైన కార్యక్రమాలు నిర్వహించడం తన తండ్రి గారైన స్వర్గీయ అవనాపు సూరిబాబు నుండి అనవాయితీగా వస్తుందని, ఆయన చూపిన మార్గంలో తాము కూడా పయనిస్తూ ముందుకు సాగుతున్నామని ఈ సందర్భంగా విక్రమ్ అన్నారు. ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్తా సమాజ సేవకు వెనుకాడబోమని స్పష్టం చేశారు . కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ కాళ్ళ గౌరి శంకర్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ మంచు రవళి, నాగవంశ సంక్షేమ సంఘ ప్రతినిధులు, అభిమానులు, స్థానిక పెద్దలు, యువత భారీ సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు. అవనాపు సూరిబాబు గారి జయంతి ని పురస్కరించుకొని ప్రేమ సమాజంలో వృద్ధులకు మధ్యాహ్న భోజనాన్ని ఉచితంగా అందించారు. మున్సిపల్ ఆఫీసు వద్దనున్న అన్నా క్యాంటీన్ లో పేదలకు మధ్యాహ్న భోజనాన్ని ఉచితంగా అందించారు అలాగే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

# మహిళలకు రక్షణగా శక్తి మొబైల్ యాప్

విజయనగరం జిల్లా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత

శక్తి యాప్ పట్ల అవగాహన కల్పించేందుకు అపెక్స్ కళాశాల

విద్యార్థిని, విద్యార్థులతో మమేకమైన అదనపు ఎస్పీ

లక్ష్యంతో శ్రమించాలని, ఉన్నత స్థానంలో చేరుకోవాలని.

తల్లిదండ్రుల ప్రేమాభిమానాలను అర్ధం

చేసుకోవాలని కోరిన అదనపు ఎస్పీ

ప్రలోభాలకు, ఆకర్షణలకు లోను కావద్దని, బంగారు

భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్న శక్తి టీం





విజయనగరం, : జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో విజయనగరం పట్టణంలోని అపెక్స్ విద్యార్థులకు శక్తి యాప్ పట్ల జూలై 15న అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ పి.సౌమ్యలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ పి మాట్లాడుతూ - మహిళల మొబైల్ ఫోనులో శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందని, ఒక కుటుంబ సభ్యుడు మీకు తోడు ఉన్నట్లేనన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ లోని ఎస్.ఓ.ఎస్. బటన్ ను ప్రెస్ చేసినట్లయితే క్షణాల్లో పోలీసు బృందం మీరున్న ప్రాంతానికి చేరుకొని, రక్షణగా నిలుస్తారన్నారు. మహిళల భద్రతకు ఈ యాప్లో సేఫ్ ట్రావెల్ ఆప్షన్ ఉందని, మహిళలు ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తుల వాహనాలు, ఆటోల్లో ప్రయాణించేటప్పుడు ఈ ఆప్షన్ పై క్లిక్ చేసి, చేరుకోవాల్సిన ప్రాంతాన్ని నమోదు చేస్తే, వారు సురక్షితంగా గమ్య స్థానానికి చేరుకొనేంత వరకు వారి ప్రయాణంపై పోలీసులు నిఘా పెడతారన్నారు. విద్యార్థులు లక్ష్యంపై దృష్టి పెట్టుకొని, చదువుకోవాలని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. చదువుకొనే సమయంలో ఇతరులపట్ల ఆకర్షితులు కావద్దని, వారు చెప్పే మాయమాటలు నమ్మి, జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. 18సం.లు నిండకుండా అమ్మాయిలు ఇష్టపూర్వకంగా వ్యవహరించినా, అమ్మాయిలను వేధించినా, వెంటపడినా పోక్సో చట్టం క్రింద నేరంగానే పరిగణిస్తారన్నారు. పోక్సో కేసుల నమోదు కావడం వలన అమ్మాయి, అబ్బాయి జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఈ తరహా నేరాల్లో నిందితులుగా ఉన్న వ్యక్తుల జీవితాల పూర్తిగా నాశనమవుతాయని, నేరం నిరూపణ అయితే 10 నుండి 25 సం.లు వరకు జైలు జీవితం అనుభవించాల్సి వస్తుందన్నారు. కావున, విద్యార్థులు ఎటువంటి ప్రలోభాలకు, ఆకర్షణలకు లోనుకావద్దన్నారు. తాత్కాలికమైన ఆనందాలు కోసం తల్లిదండ్రులను కష్ట పెట్టవద్దని, నిర్దిష్ట లక్ష్యంతో శ్రమించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. గంజాయి, ఇతర మత్తు, మాదక ద్రవ్యాలకు విద్యార్థులు బానిసలు కావద్దని, జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి గురించిన సమాచారం ఏదైనా తెలిస్తే డయల్ 100/112 కు లేదా 1972 కు గాని వెంటనే తెలియజేయాలని విద్యార్థులను అదనపు ఎస్పీ పి.సౌమ్యలత కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టరు ఈ.నరసింహమూర్తి, ఎస్‌బి శిరీష, శక్తి బృందం కానిస్టేబుళ్ళు పి.పి.నాయుడు, కె.ఎల్.నారాయణ, ఎం.అమల, పి.అరుణ, కళాశాల ప్రిన్సిపల్ నిజాముద్దీన్, కళాశాల ఏ.ఓ. పి.శ్రీనివాస్ మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగస్టు 19న ఐద్వా 9వ జిల్లా మహాసభలు

## ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుణ్యవతి,రమణమ్మ గోడ పత్రిక ఆవిష్కరణ



విజయనగరం,: 2025 ఆగస్టు 19న విజయనగరంలో జరుగు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) 9వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా విజయనగరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.పుణ్యవతి, పి. రమణమ్మలు కోరారు. మంగళవారం స్థానిక ఎల్ బి జి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా సంఘం ఉపాధ్యక్షులు అర్.కృష్ణవేణి, సహాయ కార్యదర్శి వి.లక్ష్మి ల తో కలిసి మహాసభ గోడ పత్రికను విడుదల చేశారు.అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ ఐద్వా ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీవిముక్తి అనునినాదంతో 1936లో ఏర్పడిందన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు అసమానతలు లేని సమాజం కోసం, మతసామరస్యాన్ని కాపాడాలని, మహిళాహక్కుల సాధనకోసం, మహిళలకు 33శాతం రిజర్వేషన్ కోసం, అధికధరలకు వ్యతిరేకంగా, ప్రజాసమస్యల పరిష్కారం కోసం మహిళలపై జరిగే దాడులు, హత్యలు, అత్యాచారాలు, లైంగిక, వరకట్న వేధింపులు, స్త్రీవివక్షత, ద్యాక్రామహిళల సమస్యలు, మైక్రోఫైనాన్స్, అధికధరలు, మద్యం, గంజాయి, డ్రగ్స్, అశ్లీల మొదలైన సమస్యల పైన జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిందన్నారు. మన జిల్లాలో విజయనగరం పట్టణంలో పేదలకు ఇళ్ళు, ఇళ్లస్థలాలు, మంచినీరు, మరుగుదొడ్లు, మౌళికవసతుల కోసం పోరాడింది. ఎల్.కోట మండలం కల్లిపల్లి గ్రామంలో ద్వాక్రాగ్రూపుల్లో జరిగిన 16లక్షల అవినీతికి వ్యతిరేకంగా పోరాడి 13లక్షల 50వేల రూ? ఇప్పించింది. విజయనగరం పట్టణంలో 14 ఏళ్లుగా రోడ్లు మౌళిక సౌకర్యాలు లేని కరకవలస సమస్యపై పోరాడి 30లక్షలతో రోడ్లు, మౌళిక వసతులను సాధించిందన్నారు. మెంటాడ మండలంలో గిరిజన గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారం కోసం పోరాడి 4 బోర్లు, 2 వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు చేయించిందన్నారు. విజయనగరం లో తల్లిదండ్రులతో కలిసి భర్త భార్యను వేధింపులకు గురిచేసి ఇద్దరు పిల్లలతో వదిలేస్తే భర్త నుండి 5 లక్షలు పరిహారం ఇప్పించిందన్నారు. ఆగస్టు 15, బాలల దినోత్సవం, సంక్రాంతి, తదితర పండగలు సందర్భంగా బహుముఖ కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల 6 నెలల పసిపాప నుండి 60 ఏళ్ల బామ్మవరకు మహిళ మానానికి, ప్రాణానికి రక్షణ లేదన్నారు. భయటకు వెళ్లిన ఆడ కూతురు ఇంటికి వచ్చే వరకు భయంతో ఎదురు చూడాల్సిన పరిస్థితులకు ప్రభుత్వాల దుర్మార్గమే కారణమన్నారు. ఎన్ని చట్టాలు ఉన్నా మహిళలను కాపాడలేకపోతున్నాయి. వీటన్నింటికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఐద్వా మూడేళ్ల కాలంలో చేసిన పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్ కర్తవ్యాలు తీసుకోవాల్సి ఉంది. అందుకోసమే ఈ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభలను విజయవంతం కావడానికి సహకరించాలని కోరారు. ఆగస్టు 19 న జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఎన్ పి అర్ భవనం వరకు ప్రదర్శన అనంతరం,మహాసభ ఎన్ పి అర్ భవనంలో జరుగుతుందని తెలిపారు.అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# వైద్యారోగ్య రంగ బలోపేతానికి వినూత్న చర్యలు తీసుకుంటున్నాం...

ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చేలా నిమ్స్

స్థాయికి... విమ్స్ ను తీసుకెళ్తాం

వచ్చే ఏడాది నుంచి సైకియాట్రీలో డిప్లొమా, క్లినికల్

సైకాలజీలో ఎం.ఫిల్ కోర్సులు ప్రవేశపెడతాం

విశాఖలో సెంటర్ ఆఫ్ ఎక్సెల్స్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్

ప్రారంభోత్సవాల్లో మంత్రి సత్యకుమార్

మానసిక వైద్యశాలలో రూ.29.70 కోట్లతో ఆధునిక

భవనాలు, పెదవాల్తేర్లో రూ.1.38 కోట్లతో యూపీహెచ్సీ

ప్రారంభోత్సవాల్లో భాగస్వాములైన ఎంపీ, ఎమ్మెల్సీ, తూర్పు,

ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్



విశాఖపట్నం,: రాష్ట్రంలో వైద్యారోగ్య రంగ బలోపేతానికి వినూత్న రీతిలో చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. నిమ్స్ స్థాయికి.. విమ్స్ ను తీసుకెళ్ళామని ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చేలా చర్యలు చేపడతామని చెప్పారు. దీర్ఘకాలిక లక్ష్యాలు, అవసరాల దృష్ట్యా వచ్చే ఏడాది నుంచి సైకియాట్రీ విభాగంలో ఎమ్మెస్సీ లేదా డిప్లొమా, క్లినికల్ సైకాలజీలో 30 సీట్లతో కూడిన ఎం.ఫిల్ కోర్సులు ప్రవేశపెడతామని హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య అవసరాలు తీరుస్తున్న విశాఖపట్టణంలోని మెంటల్ ఆసుపత్రి పేరు మార్పుపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. మెంటల్ కేర్ ఆసుపత్రి ప్రాంగణంలో రూ.29.70 కోట్లతో నిర్మించిన భవనాలు, పోలమాంబ గుడి సమీపంలో భాగోజీనగర్ లో రూ.1.38 కోట్లతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్(యూపీహెచ్సీ)లను మంగళవారం ఆయన లాంఛనంగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు.

**అభివృద్ధికి నిధులు కాదు... ఆశ, ఆశయం ఉండాలి..**

కార్యక్రమంలో భాగంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ పలు



అంశాలపై మాట్లాడారు. "అభివృద్ధి చేయాలంటే నిధులు కాదు.. ఆశ, ఆశయం ఉండాలి. గత ఏడు సంవత్సరాల నుంచి విశాఖలోని ఈ భవనాలపై తాత్సారం జరిగింది. డబ్బులుండి కూడా పనులు పూర్తి చేయలేకపోయారు. ఇప్పుడు సంకల్పంతో అందుబాటులోకి తీసుకొస్తున్నాం. కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా నిధులు సమకూర్చి ఆధునిక వసతులతో కూడిన భవనాలను నిర్మించగలిగాం. ఈ రోజు ఇంత మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం.. సంతృప్తిగా ఉంది. ఇది చాలా ప్రతిష్టాత్మకమైన ఆసుపత్రి. మన రాష్ట్రం వాళ్లే కాకుండా ఒడిశా, ఛత్తీస్ ఘడ్ నుంచి కూడా వస్తున్నారు. ఈ రోజు దేశంలో 15 కోట్ల మంది మానసిక పరమైన వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. వారిలో 80 శాతం మందికి రోగమేంటో తెలియదు. రాష్ట్రంలో చాలా పరిమితి సంఖ్యలో మానసిక వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఈ పరిస్థితి మార్చాల్సి ఉంది. దేశంలో 25,000 మంది సైకియాట్రిస్టులు మాత్రమే ఉన్నారు. 50వేల మందికి పెరగాల్సిన అవసరం ఉంది. లక్ష మందికి ముగ్గురు సైకియాట్రిస్టులు ఉండాల్సి ఉండగా... 0.7 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. దీన్ని అధిగమించేందుకు యువత మానసిక కోర్సులను ఎంపిక చేసుకోవాలి. మరింత మంది ఈ రంగంలోకి రావాల్సి ఉంది. మానసిక పరమైన వ్యాధిగ్రస్తులను ఎడ్డి పరిస్థితుల్లోనూ కించపరచకూడదు. శ్రీశ్రీ సమాజంలోని సమస్యలను, బాధలను తనదిగా భావించి రచనలు చేసేవారు. మరి అలాంటి మానసిక వైద్య నిపుణులు కూడా సేవలందిస్తున్నారు. వారంతా శ్రీశ్రీ వంటి వారు అని మంత్రి అభివర్ణించారు."మానసిక రుగ్మతలను పారద్రోలేందుకు గాను భవిత కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. పిల్లలపై అనవసర ఒత్తిడి తీసుకురాకూడదు. ఈ మధ్య కోస్టల్ తీరంలో జరిగిన కొన్ని సర్వేలను పరిశీలించినట్లయితే... 14.5 శాతం బాలింతలు మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. ఆ సంఖ్య గ్రామీణ ప్రాంతాల్లో 19 శాతం, గిరిజన ప్రాంతాల్లో 21 శాతం ఉంది. 2020-21 గణాంకాల ప్రకారం ఆన్ని కారణాలతో 8,062 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. గత ఏడాది ఈ పరిస్థితి 48 శాతం పెరిగింది. వారిలో 34 శాతం మంది దీర్ఘకాలిక వ్యాధుల వల్ల చనిపోతే. 7 శాతం కేవలం మానసికమైన సమస్యల వల్లే ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అందులో ప్రధాన భాగం యువతే ఉండటం విచారకరం. రోగమంటే శారీరకమైనది మాత్రమే కాదు. మానసికమైనది కూడా. అలాంటి మానసిక రుగ్మతలను పారద్రోలేందుకు, సేవ చేసేందుకు వైద్యులు ముందుకు రావటం అభినందనీయం. ఆధునిక వైద్య సదుపాయాలు, నిపుణుల సాయంతో కూడిన కౌన్సెలింగ్ ప్రక్రియల ద్వారా ఈ పరిస్థితిని మార్చాల్సి ఉంది" అని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. మెంటల్ ఆసుపత్రి పేరు మార్చాలని ఆసుపత్రి సూపరింటెండెంట్, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రతిపాదించగా పేరు మారిస్తే ఇబ్బందులు రావొచ్చని, ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.ఏతంతరం స్థానిక ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ మానసిక వైద్యంలో మరింత నాణ్యత పెరగాల్సి ఉందని, వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా సేవలు మెరుగుపడాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. భవితాలపై పునరాలోచించుకొని ముందుకెళ్లాలని హితవు పలికారు. సైకాలజీ, సైకియాట్రిస్టుల సంఖ్య పెరగాల్సి ఉందని, వారికి సరైన ప్రోత్సాహం అవసరమని పేర్కొన్నారు. డి. అడిక్షన్ సెంటర్ల సేవలను మరింత విస్తృతం చేయాల్సి ఉందని, ఇంకా ఏం చేయాలో ఆలోచించి సేవలను విస్తరించాల్సి ఉందని అన్నారు. ఏతత్ర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ మెంటల్ కేర్ ఆసుపత్రి పేరును మార్చితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. న్యూరో సైన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ అనే నామకరణం పై ఆలోచించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రసంగంలో భాగంగా సత్యకుమార్ చాలా శక్తిమంతుడని, ఎలాంటి పనైనా సులభంగా చేయగలరని, నిధులు తేగలరని మంత్రిని ఉద్దేశించి పేర్కొన్నారు. ఏదేశ సంపన్నత నాణ్యమైన మానవ వనరుల రూపంలోనే ఉంటుందని, ఆ ప్రక్రియలో మానసిక వైద్యులు కీలకపాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్సీ, విప్ వేపాడ చిరంజీవిరావు అన్నారు. వైద్య వృత్తి దైవ సమానమని, అందులోనూ మానసిక రుగ్మత కలిగిన రోగులకు సేవ చేయటం మరింత ఉన్నతమైనదని కొనియాడారు. ఈ రంగంలోని గురువులు విద్యార్థుల పట్ల కాస్త కఠినంగా ఉండాలని, అప్పుడే నాణ్యమైన భవిత వైద్యులు అందుబాటులోకి వస్తారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఎవరికైనా, ఏమైనా మానసిక సమస్యలుంటే అత్యున్నతా భావానికి గురికాకుండా త్వరితగతిన స్పందించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఇలాంటి వారి కోసమే భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. పాఠశాల, జూనియర్ కళాశాల స్థాయిలోనే విద్యార్థులు చిన్నపాటి మానసిక సమస్యలతో సతమతమవుతున్నారు.. వారంతా మానసిక వైద్యుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. ఉద్యోగులు కూడా మానసికపరమైన సమస్యలతో బాధపడుతున్నారని, సమస్యలను చెప్పుకోలేక విఫలమవుతున్నారని గుర్తు చేశారు. జిల్లాలో వైద్య సేవలను విస్తృతం చేసేందుకు గాను ఆధునిక వసతులను సమకూరుస్తున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయనతో పాటు స్థానిక ఎంపీ భరత్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఉత్తర ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎస్.టి.ఆర్. వైద్య సేవ ట్రస్ట్ ఛైర్మన్ సీతారామ సుధాకర్, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ డా. వెంకటేశ్వరరావు, మెంటల్ కేర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె.వి. రామిరెడ్డి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ కె.వి.ఎస్.ఎమ్. సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ వాణి, డీఎంఅండ్‌హెచ్‌వో పి. జగదీశ్వరరావు, స్థానిక కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యమయ్యారు.

# ఏపీపీఎస్సీ పరీక్షలు ప్రారంభం

## నరసన్నపేటలో పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన డీఆర్ఓ వెంకటేశ్వరరావు



శ్రీకాకుళం, : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహిస్తున్న లెక్చరర్ పోస్టుల రాత పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మూడు నోటిఫికేషన్ల ద్వారా వివిధ లెక్చరర్ పోస్టుల భర్తీకి ఈ పరీక్షలు జరుగుతున్నాయి. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీస్ పరీక్షా కేంద్రంలో ఉదయం 8 గంటలకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష ప్రారంభమైంది. పరీక్షా కేంద్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు పరిశీలించగా, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరపున అసిస్టెంట్ సెక్రటరీ ఏ. కృష్ణవేణి, సెక్షన్ అధికారి ఎం. అమ్మాజీ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు కేంద్రంలో ఏర్పాటు చేసిన సాంకేతిక సదుపాయాలు, సీసీ కెమెరా పర్యవేక్షణ, అభ్యర్థుల బయోమెట్రిక్ ధ్రువీకరణ వంటి అంశాలను పరిశీలించారు. మంగళవారం నిర్వహించిన పరీక్షకు మొత్తం 148 మంది అభ్యర్థులు హాజరవ్వాల్సి ఉండగా, అందులో 95 మంది హాజరయ్యారు, 53 మంది గైర్హాజరయ్యారు. అధికారులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టినట్టు తెలిపారు. పరీక్షలు ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

# గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం:

## ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకర్ రావు



మందస,: గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకర్ రావు అన్నారు. మంగళవారం మందస తహసీల్దార్ కార్యాలయంలో గిరిజనులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ఈ మేరకు హామీ ఇచ్చారు. అల్లూరి సీతారామరాజు, మన్యం ప్రాంతాలలో ఇప్పటికే పర్యటించిన తాను, ఈ ప్రాంత సమస్యలపై కూడా అవగాహన ఉందని తెలిపారు.

### ప్రణాళికతో సమస్యల పరిష్కారం:

ఈ సందర్భంగా శంకర్ రావు మాట్లాడుతూ, అడవితల్లిపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం, అధికారులతో కలిసి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి గిరిజనులు అవగాహన పెంచుకోవాలని, సమిష్టి కృషితో గిరిజనాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. వాట్సాప్ ద్వారా సమస్యలు తెలియజేస్తే, వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గిరిజనులు ఆయనకు వినతిపత్రాలు సమర్పించారు. ముఖ్యంగా భూ సమస్యలు పరిష్కరించి భూ హక్కు కల్పించాలని, తాగునీరు, రహదారి సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు. చీపి పంచాయతీకి అనుసంధానంగా ఉన్న వంతెనను నిర్మించాలని, తద్వారా రాకపోకల ఇబ్బందులు తొలగించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు కూడా తమ సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు అన్నేపు దొర, ఆర్డీఓ జి.వెంకటేష్, సహాయ గిరిజన సంక్షేమ అధికారి మల్లికార్జున రావు, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ సత్యనారాయణ, జిల్లా గిరిజన ఐక్యవేదిక సంఘం అధ్యక్షులు చౌదరి లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల రమణమూర్తి, సవర రాంబాబు, సవర జగన్నాయకులు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం వేడుకలు




శ్రీకాకుళం,: భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడలు మంత్రిత్వ శాఖకు చెందిన మేరా యువ భారత్ ( ఎన్ వై కే ) ఆధ్వర్యంలో శ్రీకాకుళం స్కిల్స్ హబ్ హాలులో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవంను మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిధగా పాల్గొన్న డి ఎల్ టి సి అసిస్టెంట్ డైరెక్టర్ వై. రామ మోహన రావు మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి ప్రకటించిన ఈ దినోత్సవం ద్వారా, యువతకు నైపుణ్యాలు అందించడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, యువతను శక్తివంతం చేయడం, భవిష్యత్‌కు మెరుగైన దారి చూపించడం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. అతిధులుగా పాల్గొన్న జిల్లా ఉపాధి కల్పనాధికారి కె. సుధ, మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె. వెంకట్ ఉజ్వల్, సెట్‌శ్రీ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి వి.వి. అప్పలనాయుడు, సీనియర్ వృత్తి నిపుణులు సిహెచ్. సుబ్బిరెడ్డి యువతతో నేరుగా సంభాషిస్తూ, నైపుణ్యాల ప్రాముఖ్యత, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు, స్వయం ఉపాధి అవకాశాల గురించి చర్చించారు.



ప్రస్తుత యుగంలో టెక్నికల్ మరియు వృత్తిపరమైన నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరిస్తూ, యువత తద్వారా భవిష్యత్తులో స్థిరత సాధించవచ్చని ఈ సందర్భంగా ఎన్ వై కె డిడి వివరించారు. ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ గణాంకధికారి, సహాయకుడు, ఎన్ వై కె వాలంటీర్లు, యువకులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 17న రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు రాక

## గిరిజన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహణ

## ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం,: : రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు శ్రీమతి ఎస్.భార్గవి ఈ నెల 17వ తేదీన జీఓఎంఎస్ నెం.3 మరియు గిరిజన చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 17వ తేదీ ఉదయం 10.30గం.లకు స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో ఈ అవగాహన సదస్సును ఆమె నిర్వహిస్తారని చెప్పారు. కావున ఈ సదస్సుకు ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాలు, గిరిజన సంఘాలు, న్యాయవాదులు, ఎన్జీఓలు,ఇతర నాయకులు తదితరులు హాజరుకావాలని ఆయన ఆ ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు.

# పేదరిక నిర్మూలన కోసం పి- 4

## కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం: రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన పి- 4 విధానాన్ని గ్రామ, వార్డు స్థాయిల్లో సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, స్వర్ణ ఆంధ్ర ఏ2047 లక్ష్యాలలో భాగంగా ఈ నెలాఖరుకు బంగారు కుటుంబాల తుది జాబితాను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఇంకా జిల్లాలోని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు మేలు కలిగించే విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా 12 ప్రధాన అంశాలపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. బంగారు కుటుంబం, వైద్యం - ఆరోగ్యం, రైతులకు ఎరువుల పంపిణీ, రుణాల మంజూరు, వసతి గృహాలలో అదనపు సౌకర్యాలు, కోర్టు కేసులు తదితర అంశాలపై సమీక్ష జరిగింది. బ్యాంకు అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి, రైతుల అవసరాలకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే వ్యాధులను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపాలిటీ అధికారులు నీటి నమూనాలను పరీక్షించి ఎప్పటికపుడు నివేదిక ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ హాస్టళ్లు, ఆసుపత్రులు, బస్టాండ్లలో పారిశుధ్య నిర్వహణపై పర్యవేక్షణ తప్పనిసరి అని చెప్పారు. పీజీ ఆర్ ఎస్ ద్వారా వచ్చే ప్రజా సమస్యలపై అధికారులు మరింత చురుకుగా స్పందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బంగారు కుటుంబం పథకం లక్ష్యాలను చేరుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రాల నిర్మాణం, నిర్వహణ, వాటితో ఎరువు తయారీపై ప్రశ్నలు అడిగారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరమని, స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సర్వేలో మంచి ఫలితాలు సాధించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలు పై ఆరా తీసిన కలెక్టర్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు,ప్రత్యేక ఉప కలెక్టర్లు బి. పద్మావతి, జయదేవి, వివిధ శాఖల అధికారులు, మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.




# విశాఖ రుషికొండ బీచ్ సుందరీకరణపై పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ స్పెషల్ ఫోకస్

మంత్రి కందుల దుర్గేష్ నిశిత పరిశీలనతో పరిశుభ్రంగా దర్శనమిస్తున్న విశాఖ ఆర్ కే బీచ్

ఎప్పటికప్పుడు బీచ్ సుందరీకరణపై ప్రధాన దృష్టి.. అధికారులతో చర్చలు

ప్రతిష్టాత్మక బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ పొందిన బీచ్ పై దుష్ప్రచారం తగదని హెచ్చరిక

కలకాలం బ్లూఫ్లాగ్ గుర్తింపు కొనసాగేలా కూటమి ప్రభుత్వం చర్యలు

కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఆర్కే బీచ్ లో క్రమంగా పెరుగుతున్న పర్యాటకుల సంఖ్య






(అమరావతి: : రాష్ట్రంలో ప్రతిష్టాత్మక బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ పొందిన విశాఖపట్నంలోని రుషికొండ బీచ్ పై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక దృష్టిసారించారు. కలకాలం బ్లూఫ్లాగ్ గుర్తింపు కొనసాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఇవే గాక రాష్ట్రంలో మరిన్ని బీచ్ లకు బ్లూఫ్లాగ్ గుర్తింపు వచ్చేందుకు ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ బీచ్ క్లీన్ గా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పర్యాటకులు అధికంగా వచ్చే ఆర్ కే బీచ్ లో ఎప్పటికప్పుడు పరిశుభ్రత, భద్రత, పర్యావరణ నిర్వహణ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, గ్రే వాటర్ నిర్వహణ, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై స్థానిక అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. బీచ్ లో సుందరీకరణకు పెద్దపీట వేయాలని ఇప్పటికే పర్యాటక శాఖ తరపున రూ.24 లక్షలు కేటాయించిన విషయం విదితమే. మంత్రి కందుల దుర్గేష్ ఎప్పటికప్పుడు అధికారులతో చర్చిస్తూ నిత్యం బీచ్ పరిసర ప్రాంతాల్లో వ్యర్థాల సేకరణ, మురుగు సముద్రంలోకి వెళ్లకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయంలో పర్యాటకులకు సైతం తాము తాగి పడేసిన బాటిళ్లు, తిని పడేసిన ప్లేట్లు డస్ట్ బిన్ లో వేసేలా అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో రుషికొండ బ్లూఫ్లాగ్ బీచ్ క్షేత్రస్థాయి సందర్శన కోసం విశాఖ పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్, జీవీఎంసీ చీఫ్ ఇంజినీర్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, విశాఖలోని నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఓషియనోగ్రఫీ సీనియర్ సైంటిస్ట్, రూరల్ వాటర్ సప్లై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ 2, జీవీఎంసీ జోనల్ కమిషనర్ 3,



ప్లాటిపస్ ఎస్కేప్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, లెవిన్ అడ్వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ లతో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేశారు. బీచ్ తీర ప్రాంతంలో తరుచూ సముద్రపు వ్యర్థాలు, మురుగు సముద్రంలో కలవకుండా నాలా అవుట్ ఫాల్స్ ను గుర్తించి తొలగింపుకు తగు చర్యలు తీసుకునేందుకు కమిటీ పనిచేస్తోంది. చెత్త ఒడ్డుకు చేరకుండా నిరోధించేందుకు యంత్రాలు ఏర్పాటు చేసి తద్వారా బీచ్ పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా దీర్ఘకాలిక పరిష్కారానికి కమిటీ శ్రమిస్తుంది. అదే విధంగా బీచ్‌లో పర్యాటక సందడి పెరగడానికి మంత్రి దుర్గేష్ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అంతేగాక విశాఖపట్నం వచ్చే పర్యాటకులకు, నగరవాసులకు డబుల్ డెక్కర్ బస్సుల్లో నగర విహారం చేసేలా అనుభూతి భరితమైన, పర్యావరణహితమైన ప్రయాణాన్ని అందించారు. పర్యాటకులు కేవలం బీచ్‌ల సందర్శనకే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలను సందర్శించేలా టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పర్యాటకుల సంఖ్య రోజురోజుకు పెరగడం విశేషం. ఈ విషయంలో పర్యాటక శాఖతో పాటు వివిధ శాఖల అధికారుల కృషి ప్రశంశనీయం. మరోవైపు ఎప్పటికప్పుడు జిల్లాల పర్యాటక శాఖ అధికారులతో టూరిజం శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం శాఖ ఎండీ ఆమ్రపాలి కాటలు సమీక్షలు నిర్వహించి విలువైన మార్గదర్శకత్వం అందిస్తూ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. భారతదేశంలో కేవలం ఎనిమిది బీచ్‌లకు మాత్రమే బ్లూఫ్లాగ్ గుర్తింపు ఉంటే అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖ రుషికొండ బీచ్ ఒకటి. ప్రఖ్యాత డెన్మార్క్ కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్ మెంటల్ ఎడ్యుకేషన్ (ఎఫ్ ఈఈ) సంస్థ ఈ గుర్తింపు అందించింది. ప్రతిష్టాత్మక బీచ్ పై కొందరు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తూ రాష్ట్ర ఖ్యాతిని పాడు చేస్తున్నారు. ఇప్పటికే ఒకసారి బ్లూఫ్లాగ్ గుర్తింపు తాత్కాలిక రద్దవడంతో మంత్రి దుర్గేష్ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి బీచ్ లో మళ్లీ పర్యావరణ సంరక్షణ మెరుగుపడేలా చర్యలు తీసుకొని గుర్తింపు తిరిగి దక్కేలా చొరవ చూపారు. అనంతరం బీచ్ ను స్వయంగా సందర్శించి స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, స్థానిక అధికారులతో చర్చించి దిశానిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో కొందరు పాత ఫోటోలు జత చేసి బీచ్ లో పరిశుభ్రత లోపించిందన్న సందేశాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. ఇది ఎంత మాత్రం సరికాదని భావించాలి. రాష్ట్ర బీచ్ పర్యాటకాన్ని బాగు చేసేందుకు నిర్మాణాత్మక సలహాలు, సూచనలు ఇచ్చి పర్యాటకాంధ్రప్రదేశ్ కు బాటలు వేసేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# జిల్లా జడ్జితో పార్వతీపురం ఎస్పీ భేటీ

పార్వతీపురం,: శ్రీకాకుళం జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానాని, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి మంగళవారం నాడు జిల్లా కోర్టులోని జడ్జి చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాన్ని అందజేసారు. బాధిత ప్రజలకు న్యాయం... నిందితులకు శిక్షలు పడేలా ఇరు శాఖల అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పని చేద్దామని... ఇరు శాఖల మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొనేలా సమన్వయంతో ముందుకెళ్దామని జిల్లా జడ్జి, ఎస్పీలు ఆకాంక్షించారు

# త్రైమాసిక విచారణ ఖైదీల సమీక్ష




( విజయనగరం: జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ షెడ్యూల్ ప్రకారము త్రైమాసిక అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం భబిత మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఏ కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ త్రైమాసిక సమావేశంలో బెయిల్ లభించిన, పూచికత్తు దారులు లేని కారణంగా ఇంకా జైల్లోనే ఉంటున్న రిమాండ్ ఖైదీల కొరకు సమావేశం నిర్వహించారు. ఎజెండా ప్రకారము 27 మంది బెయిల్ లభించి పూచికత్తులు లేని కారణంగా జైల్లోనే ఉండిపోయిన ముద్దాయిల యొక్క వివరాలను సేకరించి వారి కొరకు చర్చించారు. ఈ సమావేశంలో పార్వతీపురం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ శోభిక , పార్వతీపురం మన్యం జిల్లా ఎడిషనల్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ అంకిత సురానా , విజయనగరం జిల్లా సబ్ జైల్ అధికారి , డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ శైలజ పాల్గొన్నారు.



# ఏసీబీ వలలో నెల్లిమర్ల కమిషనర్

## -ప్లాన్ అప్రూవల్ కు 20 వేలు లంచం డిమాండ్

## -రూ 15 వేలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడిన కమిషనర్




(విజయనగరం: నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ ఎ తారక్ నాథ్ మంగళవారం ఏసీబీకి చిక్కారు. పట్టణంలోని పద్మశాలివీధిలో నివసిస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి ఇంటి నిర్మాణం నిమిత్తం ప్లాన్ అప్రూవల్ కోసం మున్సిపల్ కార్యాలయంలోని తన గదిలో రూ 15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ రమ్య అందించిన వివరాల ప్రకారం......నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని పద్మశాలి వీధిలో నివశిస్తున్న బురిడి మహేష్ అదే వీధిలో ఇల్లు నిర్మించుకుంటున్నారు. సదరు ఇంటికి ప్లాన్ అప్రూవల్ నిమిత్తం ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు.అయితే ప్లాన్ అప్రూవల్ కోసం నగర పంచాయతీ కమిషనర్ తారక్ నాథ్ మహేష్ నుంచి రూ 20 వేలు లంచం డిమాండ్ చేశారు. రూ 15 వేలు నగదు రూపంలో, మిగిలిన రూ 5 వేలకు దివాన్ కాట్ బెడ్ ఇవ్వాలని కోరారు. ప్లాన్ కోసం అవసరమైన ఫీజు చెల్లించానని, లంచం ఇవ్వలేనని మహేష్ ప్రాధేయపడ్డారు. అయినా సరే కమిషనర్ అంగీకరించలేదు. దీంతో మహేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు వారి సూచన మేరకు మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో నగర పంచాయతీ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ కు వెళ్లిన మహేష్ రూ 15 వేలుఅందజేశాడు.లంచంతీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమ్య ఆధ్వర్యంలో సిబ్బంది రెడ్ హ్యాండెడ్ గా కమిషనర్ తారక్ నాథ్ ను పట్టుకున్నారు. కేసు నమోదు చేశామని, బుధవారం కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి:

# ఎస్సై దామోదర్ రావు




సూర్యోదయం, చీపురుపల్లి ): మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని చీపురుపల్లి ఎస్ఐ దామోదర్ రావు పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో చీపురుపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండలంలోని అలజంగి, మెట్టపల్లి గ్రామాలల్లో " సంకల్ప రథం" నిలిపి, మాదక ద్రవ్యాల అనర్థాలను వివరిస్తూ, లఘు చిత్రాలను, వీడియోలను ప్రదర్శించి, మత్తు, మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్సై కోరారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల విద్యార్థులు భవిష్యత్తు ఏ విధంగా నాశనం అవుతుంది, సరదాగా ప్రారంభించిన అలవాట్లు విద్యార్థుల భవిష్యత్తుపై ఏవిధంగా చెడు ప్రభావాన్ని చూపిస్తుందన్న విషయాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. మాదక ద్రవ్యాల అలవాటుకు స్నేహితుల ప్రోద్బలం, ఒత్తిడి, ఉత్సుకత వంటి కారణాలతో యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారన్నారు. మత్తు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల విచక్షణ కోల్పోయి చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు వాటిని కొనుగోలు చేసేందుకు దొంగతనాలు పాల్పడి, దురదృష్టవశాత్తు చట్టం ముందు దోషులుగా మారుతున్నారన్నారు. విద్యార్థులు విద్య పైనే దృష్టి పెట్టాలని చక్కని లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకునేందుకు తమ సమయాన్ని వినియోగించుకోవాలన్నారు. సోషల్ మీడియా, సెల్ ఫోన్ లకు అలవాటు పడి విలువైన సమయాన్ని పాడు చేసుకోవద్దని, ఇంటర్నెట్ ను మంచి విషయాలు తెలుసుకునేందుకు మాత్రమే వినియోగించుకోవాలని యువతకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. అలాగే యువత , మహిళలు, పెద్దలు , చిన్న పిల్లలు పట్ల గౌరవ భావన కలిగేటట్లు ఉండాలని కోరారు. అలాగే సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వాటి బారిన పడి నష్టపోవద్దని ఎస్సై దామోదర రావు సూచించారు

# వర్కింగ్ జర్నలిస్టులకు హెల్త్ స్కీమ్ పొడిగింపు....

(విజయవాడ: వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ 2025%-%26 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంగళవారం జీవో యం.యస్ నెం. 77 ను జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ, సంచాలకులు హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. కావున రాష్ట్ర వ్యాప్తంగా అక్రిడిటేషన్లు అమలులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకం ప్రీమియం క్రింద రూ. 1250/- డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు. సి ఎఫ్ ఎం ఎస్.ఏపీ. జిఓవి.ఇన్ వెబ్ సైట్ ద్వారా ఈ క్రింద తెలిపిన పద్దుకు చెల్లించి లబ్ధి పొందవలసినదిగా సంచాలకులు తెలిపారు. హెడ్ అఫ్ అకౌంట్: 8342-00-120-01-03-001-001, డి డి ఓ కోడ్: 2703 0802 003 ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, రెన్యూవల్ చేయించుకున్న రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ జిరాక్స్ కాపీలను విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్, ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ లోని రెండవ ఫ్లోర్ లో ఉన్న సమాచార పౌర సంబంధాల శాఖ, సంచాలకుల కార్యాలయంలోనూ, జిల్లా స్థాయి జర్నలిస్టులు సంబంధిత జిల్లా కేంద్రాల్లోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాల్సిందిగా సంచాలకులు హిమాన్షు శుక్ల తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం ప్రీమియం రూ. 2,500 కాగా ఇందులో జర్నలిస్టు వాటా రూ. 1,250, ప్రభుత్వం వాటా రూ. 1,250 అన్నారు. జర్నలిస్టు, భార్య/భర్త, పిల్లలు, జర్నలిస్టుపై ఆధారపడిన తల్లిదండ్రులకు ఈ స్కీమ్ వర్తిస్తుందన్నారు. ఈ స్కీమ్ లో భాగంగా ప్రభుత్వం కార్పస్ ఫండ్ ను నిర్వహిస్తూ జర్నలిస్టుల వైద్య ఖర్చులను డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు విధి విధానాలను అనుసరించి చెల్లిస్తుందన్నారు. జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఏదైనా అనారోగ్యం సంభవించిన ప్రతిసారి రూ. 2 లక్షల వరకు విలువ చేసే వైద్య సేవలు అందుతాయని, ఇలా సంవత్సర కాలంలో ఎన్నిసార్లైనా పరిమితులు లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఇ హెచ్ ఎస్ ) తరహాలో నగదు రహితంగా వైద్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా పొందే వైద్య సేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, అదే విధంగా నిర్దేశిత చికిత్సలకు సంబంధించి ఉచిత అవుట్ పేషెంట్ సేవలు కూడా పొందవచ్చని ఆయన వివరించారు. ఈ పథకానికి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా, అదే విధంగా సమాచార పౌర సంబంధాల శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని ఆయన పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని హిమాన్షు శుక్ల ఆ ప్రకటనలో కోరారు.

# పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలి - జడ్పీ సీఈఓ



చీపురుపల్లి) : అన్ని గ్రామ పంచాయతీ లలో పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని జడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని అలజంగి, ఆర్థివలస, విశ్వనాథపురం, ఎలకలపేట గ్రామాల్లో మండల అధికారులు తో కలిసి పర్యటన చేశారు. నాలుగు గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు శుభ్రపరిచిన తేదీలు, తడి పొడి చెత్త సేకరణ, కాలువలు నిర్వహణ పనులు పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వాస్తవాలు ఆరా తీశారు. చెత్త సంపద తయారీ కేంద్రం నిర్వహణ తీరును పరిశీలించారు. ఈయన వెంట చీపురుపల్లి డి ఎల్ డి ఓ హేమ సుందర్, ఎంపిడివో సురేష్, సచివాలయ సిబ్బంది ఉన్నారు

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు



చీపురుపల్లి): కూటమి ప్రభుత్వం హయంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు, ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు అన్నారు. పట్టణంలోని హడ్కో కాలనీ, లావేరు రోడ్, బూత్ నెంబర్ 137లో మాజీ వార్డ్ సభ్యులు పట్నాన ఈశ్వరరావ్ ఆధ్వర్యంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు, టీడీపీ నాయకులు వివేక్, శనపతి శంకర్, చిలుకూరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# నిండా మునిగిపోతున్నారు!

రాజకీయ, మతపరమైన హింస మూలంగానో... మెరుగైన జీవితం కోసమో ప్రజలు వలసపోవడం తెలిసిందే. కానీ- వాతావరణ మార్పుల వల్ల ఇప్పుడు ఏకంగా ఒక దేశ జనాభా యావత్తూ తరలిపోవాల్సి వస్తోంది. ఇలాంటి విషాద సందర్భం ప్రపంచంలో ఇదే ప్రథమం. తువాలు దేశీయులు తమ పురిటిగడ్డను శాశ్వతంగా విడిచిపెట్టాల్సిన అనివార్య పరిస్థితులు వచ్చేశాయి. కానీ, పిల్లాపాపలతో ఎక్కడికని వెళ్తారు? ఎలా బతుకుతారు? లేత నీలి రంగు సాగర జలాలు, పగడపు దిబ్బలూ పొడవాటి కొబ్బరి చెట్లతో ప్రకృతి సౌందర్యం తొణకిసలాడే బుల్లి ద్వీపదేశం- తువాలు! నృత్య సంగీతాలతో మమేకమైన జీవనం, మూడువేల సంవత్సరాల సాంస్కృతిక వైభవం అక్కడి ప్రజల సొంతం. హవాయ్, ఆస్ట్రేలియాల నడుమ పసిఫిక్ మహా సాగరంలో తొమ్మిది ద్వీపాలతో కూడిన ఈ చిట్టి దేశానికి ఇప్పుడు పెద్దముప్పే వచ్చిపడింది. మరికొన్ని దశాబ్దాల్లోనే అది పూర్తిగా కనుమరుగు కానుంది. నేలతో పాటు అక్కడి జన జీవితాలనూ వేడెక్కిన సముద్ర జలాలు కబళిస్తున్నాయి. తువాలు భూభాగం సముద్ర మట్టానికి కనిష్ఠంగా 6.6అడుగులు, గరిష్ఠంగా 15అడుగుల ఎత్తులోనే ఉందిప్పుడు. అంతా కలిపి 25.14 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, 10,643 మంది జనాభా! వాతావరణ మార్పుల వల్ల తుపానుల ఉద్ధృతి, సముద్ర మట్టం పెరుగుతుంటే, అలల తాకిడికి నేల కోసుకుపోతోంది. తాగునీటి వనరులు ఉప్పునీటితో కలగలిసిపోతున్నాయి. వ్యవసాయం, జీవనోపాధులు దెబ్బతినిపోతున్నాయి. వెరసి ఇవన్నీ తువాలును నివాసానికి పనికిరాకుండా చేస్తున్నాయి. వాతావరణ మార్పులు ఎంతటి విధ్వంసాన్నీ విషాదాన్నీ మిగులుస్తాయో తువాలు, ఆ దేశ ప్రజల దుస్థితే చెబుతోంది. భారత్ సహా అనేక దేశాల తీరప్రాంతాల్లో ఇలాంటి దృశ్యాలే అగుపిస్తాయి.

### ఆశాకిరణం ఆస్ట్రేలియా...

పరిశోధకుల అంచనా ప్రకారం, 2050 నాటికి తువాలు రాజధాని ఫునాఫుటిలో సగం భాగం వరదలతో మునిగిపోనుంది. 2100 నాటికి ఆ దేశంలో 95శాతం భూభాగం జలమయం కావచ్చు. తువాలు ప్రజల సగటు వయసు దాదాపు 29 సంవత్సరాలు. ఏదో ఒక వృత్తిలో కుదురుకుని, కుటుంబ జీవితాన్ని కట్టుకోవాల్సిన తరుణంలో- వారి భవిష్యత్తు గాలిలో దీపం అవుతోంది. అయితే, 2023లో ఆస్ట్రేలియాతో కుదుర్చుకున్న 'ఫలేపిలి యూనియన్ ట్రీటీ' తువాలువాసులకు ఆశాకిరణంలా మారింది.

# ఓర్నాయనో.. పసుపు ఎక్కువగా తీసుకుంటే ఆ పార్ట్ దెబ్బతింటుందంట..



సహజమైన వస్తువులు ఎల్లప్పుడూ ప్రయోజనకరంగా ఉండాల్సిన అవసరం లేదు.. ముఖ్యంగా వాటిని అధికంగా లేదా వైద్యుల సలహా లేకుండా తీసుకున్నప్పుడు.. ఆరోగ్యానికి మరింత ప్రమాదకరంగా మారతాయి.. ఒక్కోసారి ప్రాణాంతకంగా కూడా కావొచ్చు.. ఇటీవల, ఇలాంటి కేసు వెలుగులోకి వచ్చింది.. ఇది సప్లిమెంట్ తీసుకునే వారు మరింత జాగ్రత్తగా.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తోంది.. ఇప్పుడు దాని గురించి తెలుసుకుందాం. ఇటీవల అమెరికా నుంచి ఒక షాకింగ్ న్యూస్ వచ్చింది.. అందులో 57 ఏళ్ల మహిళ పసుపు సప్లిమెంట్లు తీసుకోవడం వల్లే కాలేయం దెబ్బతింది. ఆ మహిళ వాపు, ఇన్ఫ్లమేషన్‌ను తగ్గించడానికి రోజూ పసుపు మాత్రలు తీసుకోవడం ప్రారంభించింది. అలాంటి పరిస్థితిలో, కొన్ని వారాల్లో ఆమె ఆరోగ్యం క్షీణించడం ప్రారంభమైంది. ఆమె ముఖం పాలిపోయింది, మూత్రం రంగు నల్లగా మారింది.. అలసట, నీరసం కొనసాగింది. పరీక్షించినప్పుడు, ఆమె కాలేయ ఎంజైమ్‌లు సాధారణం కంటే 60 రెట్లు ఎక్కువగా ఉన్నాయని తేలింది.. ఇది కాలేయ వైఫల్యానికి చాలా దగ్గరగా ఉన్న పరిస్థితి. వైద్యుల ప్రకారం, ఆ మహిళ సూచించిన మొత్తం కంటే చాలా ఎక్కువ మోతాదులో పసుపు సప్లిమెంట్ (టర్మరిక్) ను తీసుకుంది. ఇది ఆమె కాలేయంపై భారీ ప్రభావాన్ని చూపింది. చికిత్స తర్వాత, ఆ మహిళ పరిస్థితి మెరుగుపడింది.. కానీ ఈ సంఘటన సహజమైన వస్తువులు పెద్ద పరిమాణంలో తీసుకుంటే హానికరం అనే హెచ్చరిక సంకేతం.. అని వైద్య నిపుణులు చెబుతున్నారు. పసుపులో ఉండే క్రియాశీల పదార్థం కర్కుమిన్ శరీరంలో మంటను తగ్గిస్తుంది.. ఇది యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. కానీ దీనిని సప్లిమెంట్‌గా పెద్ద మొత్తంలో తీసుకున్నప్పుడు, దాని ప్రభావం చాలా రెట్లు పెరుగుతుంది. శరీరం దానిని పూర్తిగా ప్రాసెస్ చేయలేకపోవడానికి ఇదే కారణం.. ఇది నేరుగా కాలేయాన్ని ప్రభావితం చేస్తుంది. కర్కుమిన్ అధిక మోతాదు కాలేయ కణాలను దెబ్బతీస్తుంది. హెపటైటిస్ వంటి పరిస్థితులకు కూడా కారణమవుతుంది. న్యూస్ ప్రకారం.. ఈ సందర్భంలో, ఆ మహిళ రోజుకు దాదాపు 2,250 మిల్లీగ్రాముల పసుపు సప్లిమెంట్లను తీసుకుంటోంది. ఇది సురక్షితమైన మొత్తానికి రెండు రెట్లు ఎక్కువ. దీని వలన ఆమె కాలేయ ఎంజైమ్‌లు గణనీయంగా పెరిగాయి.. అనంతరం ఆమె పరిస్థితి దిగజారడంతో ఆ మహిళను ఆసుపత్రిలో చేర్చాల్సి వచ్చింది. సాధారణ ఆహారంలో పసుపు పరిమాణం తక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రభావం నెమ్మదిగా, సురక్షితంగా ఉంటుంది.. కానీ సాంద్రీకృత సప్లిమెంట్లు అవయవాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయి, ముఖ్యంగా వైద్యుడి సలహా లేకుండా తీసుకుంటే మరింత ప్రమాదకరం కావొచ్చు.

### ఎంత పసుపు తినడం సరైనది?

పసుపు భారతీయ వంటకాల్లో ముఖ్యమైన భాగం.. సాధారణంగా శరీరానికి హాని కలిగించదు. కానీ సప్లిమెంట్ల విషయానికి వస్తే, దాని పరిమాణం గురించి జాగ్రత్తగా ఉండటం ముఖ్యం. హార్వర్డ్ హెల్త్, అనేక ఇతర ఆరోగ్య పరిశోధన సంస్థల ప్రకారం.. కర్కుమిన్ మొత్తం రోజుకు 500 నుండి 1,000 సురక్షితమైనదిగా పరిగణిస్తారు. ఈ మోతాదు కంటే ఎక్కువ తీసుకోవడం శరీరంపై, ముఖ్యంగా కాలేయం, మూత్రపిండాలు జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఆహారంలో పసుపును ఉపయోగించినప్పుడు, ఈ పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది.. కాబట్టి ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ మార్కెట్లో వచ్చే సప్లిమెంట్లలో 90-95% వరకు కర్కుమిన్ కంటెంట్ ఉంటుంది.. కొన్నిసార్లు వాటిని నల్ల మిరియాలు లేదా ఇతర బయోఎన్‌హాన్సర్‌లతో ఇస్తారు.. దీని కారణంగా అవి శరీరంలో త్వరగా శోషించబడతాయి.. ఈ వేగం మరింత హానికరం కావచ్చు. కాబట్టి, పసుపును సప్లిమెంట్‌గా తీసుకునే ముందు, వైద్యుడిని సంప్రదించి తీసుకోండి.. అలాగే, లేబుల్‌పై పేర్కొన్న మోతాదును అనుసరించండి. ట్రెండ్‌ను చూడటం ద్వారా లేదా సోషల్ మీడియాలో చూడటం ద్వారా అవసరం లేకుండా ఎటువంటి మూలికా ఔషధాలను తీసుకోకండి.

### ఈ విషయాలను గుర్తుంచుకోండి

ఏదైనా సప్లిమెంట్ తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించండి. సప్లిమెంట్ లేబుల్‌పై జాబితా చేయబడిన పదార్థాలు పరిమాణాలను జాగ్రత్తగా చదవండి. పసుపును “పైపెరిన్” లేదా “నల్ల మిరియాల సారంతో” కలిపితే, దాని శోషణ సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. అలాంటి సందర్భంలో మరింత జాగ్రత్తగా ఉండండి. కామెర్లు, అలసట, ఆకలి లేకపోవడం లేదా ముదురు మూత్రం వంటి లక్షణాలను మీరు గమనించినట్లయితే, వెంటనే మిమ్మల్ని మీరు తనిఖీ చేసుకోండి. ఇంట్లో తయారుచేసిన పసుపు సురక్షితమే, కానీ దానిని ఎక్కువగా తినకుండా ఉండండి. సోషల్ మీడియా ప్రభావంతో ఏదైనా సప్లిమెంట్ తీసుకోవడం ప్రారంభించవద్దు.. ఇది హానికరం కావొచ్చు.


# జైపూర్?లోని ఈ 5 సరస్సులు హృదయాలను


# ఆకట్టుకుంటాయి.. కచ్చితంగా చూడాలి..











రాజస్థాన్ రాజధానిగా జైపూర్ చారిత్రక మైలురాళ్ళు, మార్కెట్ కార్యకలాపాలు, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రసిద్ధి చెందింది. జైపూర్ పట్టణ ఆకర్షణల్లో అద్భుతమైన సహజ ప్రకృతితో ఆకట్టుకుంటున్నాయి ఉప్పునీటి సరస్సులు. పక్షులను ఇష్టపడేవారికి ఇవి అనువైన ప్రదేశాలు. పక్షులను చూడటానికి జైపూర్ చుట్టూ ఉన్న ఉప్పునీటి సరస్సులు ఏంటి.? ఈ స్టోరీలో తెలుసుకుందాం..

సాంబార్ సరస్సు: జైపూర్‌కు నైరుతి దిశలో దాదాపు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న సాంబార్ సరస్సు భారతదేశంలోని అతిపెద్ద లోతట్టు ఉప్పునీటి సరస్సుగా ఉంది. అదే సమయంలో రామ్‌సర్ ప్రదేశంగా కూడా హోదాను కలిగి ఉంది. శీతాకాలం సమయంలో వేలాది వలస పక్షులు ఈ 230 చదరపు కిలోమీటర్ల నిస్సారమైన తడి భూమిని తమ ప్రధాన నివాసంగా ఉపయోగిస్తాయి. వివిధ రకాల బాతులు సరస్సులో ఫ్లెమింగోలు, పెలికాన్లు, స్పూన్‌బిల్స్, అవోసెట్‌లు ఆకట్టుకుంటాయి. పక్షి పరిశీలకులు గులాబీ రంగు ఫ్లెమింగోలను చూసి ఆనందిస్తారు. బహుళ శాశ్వత పక్షి జాతులు సాంబార్ సరస్సులో నివసిస్తాయి. ఇందులో భారతీయ నెమలి, నల్ల రెక్కల స్టిల్ట్‌లు, కార్మోరెంట్‌లు ఉన్నాయి.

దిడ్వానా సరస్సు: రాజస్థాన్‌లోని జైపూర్ నుండి 150 కిలోమీటర్ల దూరంలో ప్రముఖ ఉప్పునీటి దిడ్వానా సరస్సు ఉంది. సాండ్‌పైపర్‌లు, టెర్న్‌లు, గల్స్ వంటి అనేక జాతుల పక్షులు ఈ సరస్సును నివాసంగా ఉంది. ప్రతి సంవత్సరం అనేక పక్షులు మధ్య ఆసియా, సైబీరియా వైపు వలస వెళ్ళేటప్పుడు దిడ్వానా సరస్సును తమ విశ్రాంతి కేంద్రంగా చేసుకుంటాయి. ఈ ప్రదేశం సుదూర స్థానం కారణంగా జనసమూహం తక్కువగా ఉంటుంది. ఇది తీవ్రమైన వన్యప్రాణుల పరిశీలకులకు ప్రత్యేకమైన పక్షుల వీక్షణాలను అందిస్తుంది.


పచ్‌పద్ర సరస్సు: జైపూర్‌కు పశ్చిమాన దాదాపు 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న పచ్‌పద్ర సరస్సు ఉప్పునీటి లక్షణాలను కలిగి ఉండటం వలన చాలామందికి తెలియదు. ఈ సుదూర సరస్సు వద్ద అపారమైన వైవిధ్యం కలిగిన పక్షి జాతులు నివసిస్తాయి. సందర్శకులు ఈ ప్రదేశంలో కింగ్‌ఫిషర్‌లతో పాటు హెరాన్‌లు, ఎగ్రెట్‌లతో పాటు పెయింట్ చేసిన కొంగలను చూడవచ్చు. ఈ సరస్సు ఫోటోగ్రాఫర్‌లను, వాతావరణాన్ని కోరుకొనేవారికి అనువైన ప్రదేశం.

లాల్ సాగర్ సరస్సు: నాగౌర్ సమీపంలోని లాల్ సాగర్ సరస్సు అతి తక్కువ మందికి మాత్రమే తెలుసు. ఇది పక్షుల పరిశీలనకు ఉత్తేజకరమైన ప్రదేశంగా ఉంది. స్థానిక, వలస పక్షులకు ఈ ఉప్పునీటి సరస్సు నివాస స్థలంగా ఉంది. క్రేన్, ఐబిస్, లాప్వింగ్ పక్షి సందర్శకులను ఈ ప్రదేశానికి ఆకర్షిస్తుంది. ఎడారి వాతావరణం సందర్శకులకు అనువైన ప్రదేశం.

కియోలాడియో నేషనల్ పార్క్ (భరత్‌పూర్): జైపూర్ నుంచి సుమారు 180 కిలోమీటర్లు దూరంలో ఉన్న కియోలాడియో నేషనల్ పార్క్ ప్రపంచవ్యాప్తంగా పక్షి అభయారణ్యంగా ఖ్యాతి పొందింది. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం హోదాను అందుకుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా పక్షి అభిమానులను ఆకర్షిస్తుంది. అరుదైన సైబీరియన్ క్రేన్ సహా లెక్కలేనన్ని పక్షి జాతులు ఈ ప్రదేశంలో విశ్రాంతి తీసుకోవడానికి ఆగుతాయి. ఉద్యానవనంలోని విభిన్న పర్యావరణ మండలాలు, గడ్డి భూములు, అడవులతో సహా చిత్తడి నేలలు 370 కంటే ఎక్కువ విభిన్న జాతుల పక్షులతో ఆకట్టుకుంది.

# వాకింగ్ ఎప్పుడు చేయాలి..? భోజనానికి ముందా..

# తర్వాతా..? నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసా..?



వాకింగ్ మన హెల్త్ కి ఎంత బెనిఫిట్ అనేది అందరికీ తెలుసు. ఇది ఒక పవర్ ఫుల్ వ్యాయామం.. గుండెకు మంచిది, స్ట్రెస్ తగ్గిస్తుంది. ఇలా చెప్పుకుంటూ పోతే లిస్ట్ చాలా పెద్దది. అయితే చాలా మందికి వచ్చే బిగ్గెస్ట్ డౌట్ ఏంటంటే.. అసలు ఈ వాకింగ్ ను ఎప్పుడు చేయాలి..? ఖాళీ కడుపుతో వాకింగ్ చేయాలా..? ఈ కన్ఫ్యూజన్ చాలా మందిలో ఉంటుంది.లేక భోజనం తర్వాత చేయాలా..? నిపుణులు ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఖాళీ కడుపుతో వాకింగ్**

ఉదయాన్నే నిద్రలేవగానే ఖాళీ కడుపుతో కాసేపు వాకింగ్ చేయడం వల్ల శరీరంలోని కొవ్వు కరిగి శక్తిగా మారుతుంది. దీన్ని ఫాస్టెడ్ కార్డియో అంటారు. దీనివల్ల బరువు తగ్గే అవకాశం ఉంటుంది. ఉదయపు వాకింగ్ మనసుకి ప్రశాంతతను ఇస్తుంది. భోజనానికి ముందు వాకింగ్ చేసే వారికి ఆకలి నియంత్రణ సులభం అవుతుంది. దీంతో ఎక్కువగా తినే అలవాటు తగ్గుతుంది.

**మానసిక ఆరోగ్యం**

వాకింగ్ మెదడును చురుకుగా ఉంచుతుంది. హార్మోన్లు సమతుల్యం అవుతాయి. ముఖ్యంగా మధ్యాహ్నం భోజనానికి ముందు కాసేపు వాకింగ్ చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. పని చేసే వారికి ఇది మంచి మానసిక విశ్రాంతినిస్తుంది.

**భోజనం తర్వాత వాకింగ్**

ప్రాచీన ఆచారాల ప్రకారం.. భోజనం చేశాక కొద్దిసేపు నెమ్మదిగా వాకింగ్ చేయడం జీర్ణక్రియకు మంచిది. ఆధునిక సైన్సు కూడా ఇదే చెబుతోంది. భోజనం చేసిన 15 నిమిషాల్లోపు వాకింగ్ చేయడం రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. ఇది డయాబెటిస్ ఉన్నవారికి ప్రత్యేకంగా ఉపయోగపడుతుంది.

**గ్లూకోజ్ నియంత్రణకు వాకింగ్**

మీరు వేగంగా నడవకపోయినా.. భోజనం చేశాక చేసే వాకింగ్ కండరాలకు ఆహారంలోని గ్లూకోజ్ ను త్వరగా ఉపయోగించుకునేలా చేస్తుంది. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ప్రత్యేకంగా రాత్రిపూట డిన్నర్ తర్వాత కాసేపు నడవడం మంచి నిద్రకు సహాయపడుతుంది.

**జీర్ణక్రియ వేగవంతం**

భోజనం తర్వాత వాకింగ్ చేయడం వల్ల ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. ఇది కడుపు ఉబ్బరం, గ్యాస్, బరువుగా అనిపించడం లాంటి సమస్యలను తగ్గిస్తుంది.అయితే వేగంగా వాకింగ్ చేయడం మాత్రం ఇబ్బందిగా మారవచ్చు.

**సమయం కాదు.. క్రమశిక్షణే ముఖ్యం**

ప్రతి రోజు ఒకే సమయంలో వాకింగ్ చేయడం కంటే.. క్రమం తప్పకుండా వాకింగ్ చేయడమే ముఖ్యమని గుర్తుంచుకోండి. ఉదయం వాకింగ్ వల్ల కొవ్వు తగ్గుతుంది. దీని వల్ల శరీరానికి ఎక్కువ శ్రమ లేకుండానే మంచి ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి.

**మార్నింగ్ వర్సెస్ నైట్ వాకింగ్**


ఉదయాన్నే సూర్యరశ్మిలో వాకింగ్ చేయడం వల్ల శరీరంలో మెలటోనిన్ స్థాయి సమతుల్యం అవుతుంది. ఇది రాత్రిపూట మంచి నిద్రకు సహాయపడుతుంది.

**డయాబెటిస్, ఉన్నవారికి మేలు**

టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారు, ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఉన్నవారు భోజనం తర్వాత కాసేపు వాకింగ్ చేసినప్పుడు రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలు సమతుల్యంగా ఉండే అవకాశం ఉంది ఉదయం అయినా, భోజనం తర్వాత అయినా..

## నిద్రపోయే ముందు ఇలా చేస్తే కష్టమే..

# డేంజర్ జోన్‌లోకి జారుకున్నట్లే భయ్యే..



ఆయుర్వేదం ప్రకారం, నిద్రపోయే అరగంట ముందు పాలు తాగడం చాలా మంచిది. ఈ సమయంలో శరీరం ప్రశాంతంగా ఉండటం ప్రారంభమవుతుంది. పాలలోని పోషకాలు మరింత సమర్థవంతంగా గ్రహించబడతాయి. పాలు ప్రతీరోజూ తాగడం చాలా మందికి అలవాటు. ఇందులో ప్రోటీన్, కాల్షియం, వివిధ పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇందులో ఆరోగ్య ప్రయోజనాలు చాలా ఉన్నాయి. కాబట్టి, దీనిని క్రమం తప్పకుండా తాగాలని చెబుతుంటారు. ఆయుర్వేదం ప్రకారం, ఆవు పాలు వాత, పిత్త దోషాలను సమతుల్యం చేస్తాయి. తద్వారా బలం, శక్తి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. కానీ, గరిష్ట ప్రయోజనాలను పొందడానికి మీరు ఎప్పుడు పాలు తాగాలి? అనే విషయం తెలుసుకుందాం..

### రాత్రిపూట పాలు తాగవచ్చా?

ఆయుర్వేదం ప్రకారం, నిద్రపోయే అరగంట ముందు పాలు తాగడం మంచిది. ఈ సమయంలో శరీరం ప్రశాంతంగా ఉండటం ప్రారంభమవుతుంది. పాలలోని పోషకాలు మరింత సమర్థవంతంగా గ్రహించబడతాయి. పాలలో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది. సౌకర్యవంతమైన నిద్రను ప్రోత్సహించడంలో సహాయం చేస్తుంది. రాత్రిపూట ఒక గ్లాసు పాలు తాగడం వల్ల మీ ఆరోగ్యానికి మేలు జరుగుతుందనడంలో సందేహం లేదు. కానీ, కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి. ఎల్లప్పుడూ గోరువెచ్చని పాలు తాగితే చాలా మంచిది. అలాగే, మరిన్ని ప్రయోజనాలను పొందడానికి మీరు పసుపు, ఏలకులు లేదా అల్లం జోడించవచ్చు. పాలు తాగే ముందు లేదా ఈ విషయాలను తప్పక గుర్తుంచుకోవాలి. ఉప్పు పదార్థాలు, తేనె, సిట్రస్ పండ్లు లాంటి వాటికి దూరంగా ఉండాలి. వీటితో కలిపి పాలను తీసుకోవడం వల్ల ఇబ్బంది పడాల్సి ఉంది.

### ఎవరు జాగ్రత్తగా ఉండాలి?

జీర్ణక్రియ సరిగా లేకపోవడం లేదా తరచుగా జలుబు, దగ్గు ఉన్నవారు చల్లని పాలు తాగకూడదు. ఈ చిట్కాలు కేవలం అవగాహన కల్పించడానికి మాత్రమే అందించాం. సోషల్ మీడియాలో లభించిన సమాచారం మేరకు వీటిని అందించాం. వీటిని పాటించే ముందు ఖచ్చితంగా వైద్యుడి సలహాలు తీసుకోవాలి.

## బీ అలెర్ట్.. వర్షాకాలంలో మీరు ఈ తప్పులు

# చేస్తున్నారా..? జబ్బులు వస్తాయి జాగ్రత్త..!



వర్షాకాలం వచ్చిందంటే చాలు.. చిటపట చినుకులు, చల్లని వాతావరణం భలే ఉంటాయి. కానీ ఈ కూల్ కూల్ సీజన్ లో ఆరోగ్యం విషయంలో మాత్రం అసలు కాంప్రమైజ్ అవ్వకూడదు. ముఖ్యంగా మనం తినే ఆహారం, అందులోనూ కూరగాయల విషయంలో పక్కా ప్లానింగ్ ఉండాలి. ఈ సీజన్ లో కొన్ని కూరగాయలు మనకు హెల్త్ రిస్క్ లు తెచ్చే ఛాన్స్ ఉంటుంది. ఎలాంటి కూరగాయలకు దూరంగా ఉండాలి, వాటిని ఎలా క్లీన్ చేయాలి, ఎలా వండుకోవాలి అనే విషయాలు డీటెయిల్డ్ గా తెలుసుకుందాం. వర్షాకాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహారం విషయంలో మరింత శ్రద్ధ వహించాలి. ఈ కాలంలో కొన్ని కూరగాయలపై బాక్టీరియా, ఫంగస్, క్రిములు ఎక్కువగా వృద్ధి చెందుతాయి. వాటిని తినడం వల్ల జీర్ణ సమస్యలు, ఫుడ్ పాయిజనింగ్ వచ్చే ప్రమాదం ఉంది. వర్షాలు కురుస్తున్నప్పుడు మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే కొన్ని రకాల కూరగాయలను తినకుండా ఉండటం మంచిది. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

### ఆకుకూరలు

పాలకూర, మునగాకు, చుక్కకూర, క్యాబేజీ లాంటి ఆకుకూరలు మామూలుగా ఆరోగ్యానికి మంచివి. కానీ వర్షాకాలంలో ఇవి తేమ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పెరుగుతాయి. వర్షపు నీరు, తడి నేల వల్ల వాటిపై క్రిములు, సూక్ష్మజీవులు, పరాన్నజీవులు పేరుకుపోతాయి. మామూలు నీటితో కడిగినా ఇవి పూర్తిగా పోవడం కష్టం. పచ్చిగా లేదా సరిగ్గా శుభ్రం చేయకుండా తింటే జీర్ణ సమస్యలు వస్తాయి.

### కాలీఫ్లవర్, బ్రోకలీ

కాలీఫ్లవర్, బ్రోకలీ నిర్మాణంలో చిన్న చిన్న రంధ్రాలుంటాయి. వాటిలో వర్షపు తేమ నిలిచిపోయే అవకాశం ఎక్కువ. అలాంటి తేమ ఉన్న చోట పురుగులు, క్రిములు, బ్యాక్టీరియా నివసిస్తాయి. సరిగ్గా శుభ్రం చేయకుండా తింటే అజీర్తి కలగవచ్చు. అందుకే వీటిని తినే ముందు ఉప్పు నీటిలో నానబెట్టి బాగా ఉడికించడం అవసరం.

### పచ్చి కూరగాయలు

వర్షకాలంలో దోసకాయ, టమాటా, ముల్లంగి లాంటి తేమ ఎక్కువగా ఉండే కూరగాయలను పచ్చిగా తినడం మంచిది కాదు. ఈ కాలంలో సలాడ్ ల రూపంలో పచ్చి కూరగాయలు తినడం వల్ల అజీర్ణం, విరేచనాలు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అందుకే వీటిని కొద్దిగా ఆవిరిపై ఉడికించడం లేదా మరిగించి తినడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.

### సీజనల్ కూరగాయలే మేలు


వర్షాకాలంలో మన ప్రాంతంలో కాలానికి తగ్గట్టు లభించే కూరగాయలను వాడటం చాలా మంచిది. ఉదాహరణకు సొరకాయ, కాకరకాయ, బీరకాయ లాంటి కూరగాయలు తేలికగా జీర్ణమవుతాయి. శుభ్రపరచడం కూడా సులభం. వీటిని త్వరగా వండుకోవచ్చు కాబట్టి శరీరంపై ఒత్తిడి తక్కువగా ఉంటుంది. వీటిలో తేమ తక్కువగా ఉంటుంది కనుక క్రిముల ముప్పు కూడా తక్కువ.

### కూరగాయల శుభ్రత

తినే ముందు ప్రతి కూరగాయను చాలా సార్లు నీటితో కడగాలి. ఒకసారి కడిగిన తర్వాత ఉప్పు కలిపిన నీటిలో 10 నుంచి 15 నిమిషాలు నానబెట్టడం వల్ల సూక్ష్మజీవులు తొలగిపోతాయి. ఇలాంటి కూరగాయలను మరిగించడం లేదా ఆవిరిపై ఉడికించడమే ఉత్తమం. పచ్చిగా తినే అలవాటు మానేయడం ఆరోగ్యానికి మంచిది. వర్షాకాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే.. తినే కూరగాయల ఎంపిక, శుభ్రత, వండే పద్ధతిపై శ్రద్ధ పెట్టాలి. కాలానుగుణంగా, తక్కువ తేమ ఉన్న కూరగాయలు తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండొచ్చు.

## అమృతం కన్నా పవర్‌ఫుల్.. రోజూ గ్లాస్

# తాగారంటే, బండరాళ్లయినా కరగాల్సిందే..



రోజును ఎల్లప్పుడూ టీ, కాఫీకి బదులుగా నీటితో ప్రారంభించాలి. ముఖ్యంగా ఎవరైతే మూత్రపిండాల సమస్యలను ఎదుర్కొంటున్నారో.. వారు తప్పకుండా ఉదయం ఖాళీ కడుపుతో ఈ 5 సహజ పానీయాలు తీసుకోవడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. మన శరీరంలో మూత్రపిండాలు (కిడ్నీలు) ఒక ముఖ్యమైన ఫిల్టర్ల వలె పనిచేస్తాయి. రక్తాన్ని శుభ్రపరిచి, వ్యర్థాలను, అదనపు నీటిని మూత్రం రూపంలో బయటకు పంపడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, మారిన జీవనశైలి, సరైన నీరు తీసుకోకపోవడం వంటి కారణాల వల్ల మూత్రపిండాల్లో చిన్న చిన్న రాళ్లు ఏర్పడటం సాధారణ సమస్యగా మారింది.

1. నిమ్మకాయ నీరు: నిమ్మకాయలో ఉండే సిట్రిక్ యాసిడ్ మూత్రంలో ఉండే కాల్షియం స్ఫటికాలు ఏర్పడకుండా నిరోధిస్తుంది. ప్రతిరోజూ ఉదయం గోరువెచ్చని నీటిలో సగం నిమ్మకాయ పిండి తాగడం వల్ల రాళ్లు ఏర్పడే అవకాశాలు తగ్గుతాయి. ఇప్పటికే ఉన్న రాళ్లు క్రమంగా కరిగి బయటకు వస్తాయి.
2. సెలెరీ నీరు: సెలెరీ మూత్రపిండాలకు సహజమైన డీటాక్స్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఇది శరీరం నుంచి విషాన్ని తొలగించే మూత్రవిసర్జన లక్షణాలను కలిగి ఉంటుంది. ఒక టీస్పూన్ సెలెరీని రాత్రిపూట నీటిలో నానబెట్టి, ఉదయం వడకట్టిన తర్వాత తాగాలి. ఈ పానీయం మూత్రపిండాల్లో రాళ్లను తొలగించడంలో కూడా సహాయపడుతుంది.
3. కొబ్బరి నీళ్లు: కొబ్బరి నీళ్ళు ఎలక్ట్రోలైట్లతో సమృద్ధిగా ఉంటాయి. శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుతాయి. ఇది మూత్ర పరిమాణాన్ని పెంచుతుంది. ఇది మూత్రపిండాల్లో రాళ్ళు, ఇతర విష పదార్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో వారానికి 3%-%4 సార్లు కొబ్బరి నీళ్ళు తాగడం వల్ల మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంటాయి.
4. పాలకూర, కొత్తిమీర నీరు: కొత్తిమీర, పాలకూర రెండింటిలోనూ నిర్విషీకరణ లక్షణాలు ఉన్నాయి. వాటిని మరిగించి, నీటిని వడకట్టి, చల్లబరిచిన తర్వాత తాగాలి. ఈ పానీయం మూత్రపిండాలను శుభ్రపరుస్తుంది. మూత్రం ద్వారా రాళ్లను తొలగించడంలో సహాయపడుతుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది.
5. పసుపు నీరు: పసుపులో కర్కుమిన్ ఉంటుంది. ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ, డీటాక్సిఫైయింగ్ లక్షణాలను కలిగి ఉంటుంది. ప్రతి ఉదయం గోరువెచ్చని పసుపు నీటిని తాగడం వల్ల మూత్రపిండాల వాపు తగ్గుతుంది. శరీరం నుంచి విషాన్ని తొలగిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్ల ప్రారంభ లక్షణాలలో ఇది చాలా ప్రభావవంతంగా ఉంటుంది

# బీఎస్ఎన్ఎల్ నుంచి 4జీ సేవలు




ప్రస్తుతం దేశంలో 5జీ సేవలు విస్తరిస్తున్న విషయం తెలిసిందే. దేశంలో ప్రధాన టెలికం కంపెనీలన్నీ 5జీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఈ క్రమంలోనే ప్రముఖ ప్రభుత్వ టెలికాం రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. ఆగస్టు నాటికి దేశంలో 4జీ సేవలను తీసుకొచ్చేందుకు బీఎస్ఎన్ఎల్ సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా 4జీ సేవలకు సంబంధించిన ప్లాన్స్‌ను కంపెనీ ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో వివరాలను వెల్లడించారు. ఇంతకీ %దీూచీూ% అందిస్తోన్న ప్లాన్స్ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

రూ. 2,399 ప్లాన్..

ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే 395 రోజుల వ్యాలిడిటీ లభిస్తోంది. ఈ ప్లాన్‌తో ప్రతి రోజూ 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు పొందొచ్చు. వీటితో పాటు ప్రతి రోజూ 2 జీబీ డేటా పొందొచ్చు.

రూ. 1,999 ప్లాన్..

ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే 365 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. మొత్తం 600 జీబీ డేటా లభిస్తుంది. రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే అన్‌లిమిటెడ్ కాల్స్ పొందొచ్చు.

రూ. 997 ప్లాన్..

రూ. 997 ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే 160 రోజుల వ్యాలిడిటీ పొందొచ్చు. ప్రతీరోజూ 2 జీబీ డేటా లభిస్తుంది. అలాగే రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు పొందొచ్చు.

రూ. 599 ప్లాన్..

రూ. 599 ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే రూ. 84 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. అన్‌లిమిటెడ్ కాల్స్ పొందొచ్చు. ప్రతీ రోజూ 3 జీబీ డేటా లభిస్తుంది.

రూ. 347 ప్లాన్..

ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే 54 రోజుల వ్యాలిడిటీ పొందొచ్చు. ప్రతీరోజూ 2 జీబీ డేటా పొందొచ్చు. రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు ఉచితం. ఇందులో అన్‌లిమిటెడ్ కాల్స్ పొందొచ్చు.

రూ. 199 ప్లాన్..

రూ. 199తో రీఛార్జ్ చేసుకుంటే 30 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు పొందొచ్చు. అలాగే ప్రతీ రోజూ 2 బీబీ లభిస్తుంది.

రూ. 153 ప్లాన్..

ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే 26 రోజుల వ్యాలిడిటీ వస్తుంది. మొత్తం 26జీబీ డేటా, 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు, అన్‌లిమిటెడ్ కాల్స్ పొందొచ్చు.

రూ. 118 ప్లాన్..

# విద్యుత్ వినియోగదారులకు గుడ్ న్యూస్.. క్యూఆర్ కోడ్‌తో బిల్ చెల్లింపు



మొన్నటి వరకు కరెంట్ బిల్లు చెల్లించాలంటే కరెంట్ ఆఫీస్‌కు వెళ్లి లైన్‌లో నిలబడే పరిస్థితి ఉండేది. అయితే ఎప్పుడైతే యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయో అప్పటి నుంచి కరెంట్ బిల్లుల చెల్లింపులు సింపుల్‌గా మారాయి.దఒక క్లిక్‌తో కరెంట్ బిల్లులు చెల్లించే అవకాశం లభించింది. అయితే తాజాగా ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయంతో ఈ సేవలకు అంతరం ఏర్పడింది. థర్డ్ పార్టీ జోక్యాన్ని తగ్గించాలే ఉద్దేశంతో ఫోన్‌పే, పేటీఎమ్ వంటి యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు కుదరవని ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇప్పటి వరకు యాప్స్ ద్వారా పేమెంట్ చేస్తున్న వారు ఆందోళన పడే పరిస్థితి వచ్చింది. అయితే ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు టీజీఎస్‌పీడీసీఎల్ కీలక నిర్ణయం తీసుకుంది. వినియోగదారులు సింపుల్‌గో ఫోన్‌లోనే బిల్ పేమెంట్ చేసేలా చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే టీఎస్‌పీడీసీఎల్ యాప్ ద్వారా కరెంట్ బిల్లులు చెల్లించే అవకావం కల్పించింది. అయితే ఇది కాస్త ఇబ్బందితో కూడుకున్న అంశం. కాబట్టి పేమెంట్స్‌ను మరింత సులభతరం చేసే ఉద్దేశంతో కరెంటు బిల్లులపైనే క్యూఆర్ కోడ్ ముద్రించే దిశగా టీజీఎస్‌పీడీసీఎల్ అడుగులు వేస్తోంది. దీంతో మీ కరెంట్ బిల్లుపై ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి బిల్లును సులభంగా పే చేయొచ్చు. ఏ నెలకు ఆ నెల బిల్‌పై ఉండే క్యూఆర్ కోడ్ అప్డేడ్ అవుతుంది. ఈ విధానాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఇప్పటికే మట్టేవాడ ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీసర్ (ఈఆర్ఓ) వరంగల్, భూపాలపల్లిలో అమలు చేస్తున్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ ఈ సేవలను తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్యూఆర్ కోడ్ సహాయంతో ఫోన్‌లోని యూపీఐ యాప్స్‌తో స్కాన్ చేసి సులభంగా పే చేసుకోవచ్చు. దీంతో థార్డ్ పార్టీ యాప్‌లు వసూలు చేసే ఛార్జీలను కూడా తప్పించుకోవచ్చు.

# మార్కెట్ లో కల్తీ పండ్లు, కూరగాయలను ఇలా గుర్తించండి..?



ప్రస్తుతం మార్కెట్‌లో కల్తీ లేకుండా ఏదైనా లభించడం చాలా కష్టంగా మారింది. పండ్లు, కూరగాయల్లో కూడా కల్తీ మొదలైంది. మార్కెట్‌లో లభించే పండ్లు, కూరగాయలను పండించడానికి.. వాటిని చాలా రోజులు తాజాగా ఉంచడానికి వివిధ రకాల రసాయనాలను ఉపయోగిస్తారు. ఈ రసాయనాలు నిండిన కూరగాయలు రుచిగా ఉండవు. అలాగే ఆరోగ్యానికి కూడా మంచివి కావు. అయితే కూరగాయలు కొనుగోలు చేసేటప్పుడు అవి స్వచ్ఛమైనవా..? కాదా .? ఎలా గుర్తించడానికి ఈ చిట్కాలు పాటించండి.

మచ్చలు ఉన్న కూరగాయలను కొనవద్దు....

కూరగాయలను పండించడానికి వాటిని చాలా రోజులు తాజాగా ఉంచడానికి వివిధ రకాల రసాయనాలను ఉపయోగిస్తారు. కూరగాయలు పండించడానికి రసాయనాలు వాడితే వాటిపై కొన్ని మరకలు పడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల, మచ్చలు ఉన్న కూరగాయలను కొనడం మానుకోవాలి.

పండ్లను గోరుతో గిల్లడం...

కూరగాయ లోపలోకి మీ గోళ్లను తేలికగా గుచ్చండి. కూరగాయలు తాజాగా ఉంటే, గోరు సులభంగా లోపలికి వెళుతుంది. అయితే కూరగాయలు పాతవి లేదా రసాయనంతో నిండి ఉంటే గోరు లోపలికి వెళ్లదు.

వాసన ద్వారా....

తాజా, స్వచ్ఛమైన కూరగాయలను గుర్తించడానికి ఉత్తమ మార్గం వాసన. సేంద్రియ పద్దతిలో పండించిన కూరగాయలు, పండ్ల వాసన బలంగా ఉంటుంది. రసాయనాలు కలిగిన పండ్లు, కూరగాయల వాసన భిన్నంగా లేదా వాసన లేకుండా ఉంటాయి.

ఇలా కూరగాయల రంగును....

కూరగాయలు తాజాగా కనిపించేందుకు మార్కెట్‌లో వస్తున్న కూరగాయలకు పారాఫిన్ హైడ్రోకార్బన్ రసాయనాలు కలిపి కల్తీ రంగులు వేస్తున్నారు. కూరగాయలు లేదా పండ్లలో కృత్రిమ రంగును గుర్తించడానికి, కాటన్ గుడ్డను కొద్దిగా తేమ చేసి, కూరగాయలు, పండ్లపై రుద్దండి. కూరగాయలు, పండ్లలో కల్తీ రంగు ఉంటే ఆ గుడ్డకు అంటుకుంటుంది. ఈ కథనం ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా మాత్రమే ఇచ్చినది. ఆరోగ్య సమస్యల నివారణకు సంబంధిత వైద్య నిపుణుడిని సంప్రదించడం ఉత్తమం.

## రోజూ రెండు వేప ఆకులను తీసుకుంటే
# ఈ వ్యాధులు పేరు లేకుండా పోతాయి!



వేప ఆకుల ప్రయోజనాలు: వేప చాలా ఆరోగ్యకరమైనది మరియు రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే రసాయనాలను కలిగి ఉంటుంది. అంతేకాకుండా, వేప ఆకులను నమలడం ద్వారా జీర్ణవ్యవస్థలోని బ్యాక్టీరియాను నయం చేయగల సామర్థ్యం ఉంది, వేప ఆకులను 1 నెల పాటు నమలడం వల్ల శరీరంలో ఎలాంటి మార్పులు సంభవిస్తాయో వివరంగా చూద్దాం.

**రక్తం శుద్ధి అవుతుంది.....**

వేప ఆకులుఇది యాంటీమైక్రోబయల్ మరియు రక్తాన్ని శుద్ధి చేసే లక్షణాలను కలిగి ఉంది, ఇది దాదాపు 140 క్రియాశీల సమ్మేళనాలను కలిగి ఉంటుంది మరియు శరీరంలోని రక్తాన్ని శుద్ధి చేయడంలో సహాయపడుతుంది.

**చర్మ కాంతిని పెంచుతుంది :**

వేప ఆకులను నమలడం వల్ల చర్మం మెరుస్తుంది. వేప ఆకుల్లో డిటాక్సిఫైయింగ్ గుణాలు ఉన్నాయి. ఇది చర్మానికి కొత్త మెరుపును ఇస్తుంది, ఇది రక్తాన్ని శుద్ధి చేస్తుంది, దాని ప్రభావం చర్మంపై కనిపిస్తుంది.

**రోగ నిరోధక శక్తిని పెంచుతుంది :**

వేప ఆకులను నమలడం వల్ల శరీరంలోని బలహీనమైన రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఈ పండులో రెండు వెల్లుల్లి రెబ్బలు మిక్స్ చేసి మధ్యాహ్నం పూట తింటే బ్లడ్ షుగర్ మామూలే!

**సంక్రమణ ప్రమాదాన్ని తగ్గిస్తుంది:**

వేప ఆకులుయాంటీ బాక్టీరియల్మరియు యాంటీవైరల్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇది ఇన్ఫెక్షన్ నుండి శరీరాన్ని రక్షిస్తుంది.

**బరువు తగ్గడం :**

వేప ఆకులను నిరంతరం నమలడం వల్ల శరీరంలోని వ్యర్థ పదార్థాలను తొలగించడం ద్వారా ఇది నిర్విషీకరణ గుణాలను కలిగి ఉండి త్వరగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

**బ్లడ్ షుగర్ నియంత్రణ:**

వేప ఆకులను చాలా రోజుల పాటు నమలడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిని చాలా వరకు నియంత్రిస్తుంది.

**తినడానికి సరైన మార్గం:**

ఖాళీ కడుపుతో వేప ఆకులను నమలడానికి ప్రయత్నించండి.

# యూరిక్ యాసిడ్ ప్యూరిన్ ను తొలగించే తమలపాకు!



తమలపాకులను ఆయుర్వేదంలో ఔషధంగా ఉపయోగిస్తారనే విషయం తెలిసిందే. తమలపాకులో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. తమలపాకులను పూజలో, అనేక వ్యాధులను నయం చేయడానికి ఉపయోగిస్తారు. తమలపాకు యూరిక్ యాసిడ్ రోగులకు కూడా మేలు చేస్తుంది. తమలపాకుతో యూరిక్ యాసిడ్ సమస్యను గణనీయంగా నియంత్రించవచ్చు. యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉన్న రోగి తమలపాకును ఎలా ఉపయోగించాలో, దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం?

**యూరిక్ యాసిడ్‌లో తమలపాకును ఎలా ఉపయోగించాలి?**

యూరిక్ యాసిడ్ రోగులు తమలపాకులను మరిగించి తాగవచ్చు. దీని కోసం, సుమారు 2 కప్పుల నీటిని తీసుకుని, అందులో 2-4 తాజా తమలపాకులను జోడించండి. ఇప్పుడు దీన్ని మరిగించి, నీరు సగం కాగానే వడగట్టి తాగాలి.

కావాలంటే తమలపాకులను మెత్తగా నూరి దాని రసం తీసి అరకప్పు గోరువెచ్చని నీటిలో కలుపుకుని తాగాలి. దీని వల్ల మీరు చాలా ప్రయోజనం పొందుతారు. అలాగే తమలపాకులను కడిగి తమలపాకులాగా నమిలి తినవచ్చు. దీనితో, ఆకులోని రసం శరీరంలోకి ప్రవేశిస్తుంది.

**తమలపాకులు తినడం వల్ల కలిగే లాభాలు?**


యూరిక్ యాసిడ్‌ను నియంత్రించండి- మీ కిడ్నీలను మెరుగుపరిచే మూలకాలు తమలపాకులలో కనిపిస్తాయి. ఇది మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తుంది. శరీరం నుండి యూరిక్ ఆమ్లాన్ని తొలగిస్తుంది. ఇవి సహజ మూత్రవిసర్జనగా పనిచేస్తాయి, ఇవి మూత్రం ద్వారా శరీరంలో పేరుకుపోయిన యూరిక్ యాసిడ్‌ను కూడా తొలగిస్తాయి.

వాపును తగ్గిస్తుంది - తమలపాకులు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. తమలపాకులలో పాలీఫెనాల్స్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉండే అనేక బయోయాక్టివ్ కాంపౌండ్స్ ఉంటాయి. దీంతో వాపు సమస్య తగ్గుతుంది. శరీరంలో మంట పెరగడం వల్ల, యూరిక్ యాసిడ్ పెరిగే ప్రమాదం కూడా పెరుగుతుంది. తమలపాకుతో కీళ్లనొప్పులు కూడా తగ్గుతాయి.

విటమిన్ ఎ, సి సమృద్ధిగా - విటమిన్ ఎ, విటమిన్ సి తమలపాకులలో లభిస్తాయి. ఇది కాకుండా, యాంటీ ఆక్సిడెంట్లు తమలపాకులలో కూడా కనిపిస్తాయి, ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి చర్మాన్ని రక్షించడంలో సహాయపడతాయి. తమలపాకులను తీసుకోవడం వల్ల శరీర కణాలకు నష్టం జరగకుండా చేస్తుంది. యూరిక్ యాసిడ్ తగ్గిస్తుంది.


జీర్ణక్రియ, జీవక్రియను బలపరుస్తుంది - తమలపాకులను ముఖ్యంగా జీర్ణక్రియను మెరుగుపరచడానికి, జీవక్రియను వేగవంతం చేయడానికి ఉపయోగిస్తారు. ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. ఆహారం శరీరానికి సరిగ్గా శోషించబడుతుంది.

## కిడ్నీ సమస్య ఉన్నవాళ్లు
# ఈ ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి..



కిడ్నీలు మన శరీరంలో ఎంతో ముఖ్యమైన అవయవం. ఇవి రక్తంలోంచి వ్యర్థాలను, విషతుల్యాలను వడపోస్తాయి. మూత్రం రూపంలో వ్యర్థాలను, టాక్సిన్స్‌ను బయటకు వెళ్లగొడతాయి.దఅంతేకాదు, మన శరీరంలో యాసిడ్స్, బేస్‌లను స్థాయిలను నియంత్రిస్తాయి. ఇవి రక్తపోటును కంట్రోల్‌లో ఉంచుతాయి. ఎర్రరక్త కణాల ఉత్పత్తిని పెంచే హార్మోన్లనూ కిడ్నీలు తయారు చేస్తాయి. ఎముకలు బలంగా ఉండేలా సహాయ పడతాయి. వాటిని సంరక్షించుకోవాలి. కానీ ఏదో రకంగా కిడ్నీ సమస్యలు వచ్చినప్పుడు కొన్ని ఆహార పదార్థాలు అస్సలు తినొద్దు. వాటిలో సోడియం అధికంగా ఉండే ఆహారాలు, ప్రాసెస్ చేసిన మాంసాలు, కార్బోనేటేడ్ పానీయాలు, అధిక ప్రోటీన్ కలిగిన ఆహారాలు తీసుకోకూడదు. అరటిపండు- అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. కాబట్టి కిడ్నీ రోగులు దీనికి దూరంగా ఉండాలి. కెఫిన్- ఇది కాకుండా కిడ్నీ రోగులు కూడా కెఫిన్‌కు దూరంగా ఉండాలి. శరీరంలో కెఫిన్ ఎక్కువగా ఉండటం వల్ల డీహైడ్రేషన్‌కు కారణమవుతుంది. దీని వల్ల అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం ఉంది. రక్తపోటు పెరిగినప్పుడు, మూత్రపిండాలపై ఒత్తిడి పడుతుంది. అధిక ప్రోటీన్ ఆహారం వాస్తవానికి ప్రోటీన్ మన ఆరోగ్యానికి ముఖ్యమైనది, కానీ అది చాలా ఎక్కువ మన మూత్రపిండాలను దెబ్బతీస్తుంది. ప్రొటీన్లు ఎక్కువగా తినడం వల్ల కిడ్నీపై ఒత్తిడి పడుతుంది. పప్పులు , ఇతర అధిక ప్రొటీన్ల ఆహారాలను పరిమిత పరిమాణంలో మాత్రమే తినండి. ఊరగాయలు- కిడ్నీ రోగులు పొరపాటున కూడా పచ్చళ్లు తినకూడదు. ఊరగాయలలో సోడియం ఎక్కువగా ఉంటుంది, ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. మీరు కిడ్నీ వ్యాధిగ్రస్తులైతే, ఈ అలవాటను మాత్రం నివారించండి.

## భూమిని తాకనున్న భారీ ఉల్క..
# యుగాంతమే అంటున్న ఇస్రో



ఓ భారీ ఉల్క భూమిని తాకనుంది. అదే జరిగితే యుగాంతమే అని ఇస్రో చీఫ్ సోమనాథన్ అంటున్నారు. 2029 ఏప్రిల్ 13న ఒకసారి.. ఆ తర్వాత 2036లో మరోసారి అతి భారీ ఉల్క భూమిని తాకనుందట. ఈ రెండింటిలో ఏది సంభవించినా యుగాంతం జరిగే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. సైబీరియాలోని తుంగుస్కా ప్రాంతంలో 1908లో ఓసారి భారీ ఉల్క పడింది. ఆ సమయంలో 2,200 చదరపు అడుగుల అడవి మొత్తం అంతరించిపోయింది. 8 కోట్ల వృక్షాలు కుప్పకూలిపోయాయి. 2029, 2036లో పడబోయే ఉల్క సైజు 370 మీటర్లు ఉంటుందట. ఉల్క సైజు 10 కిలోమీటర్లు కానీ లేదా అంత కంటే ఎక్కువ సైజు ఉన్నవి భూమికి తాకితే యుగాంతం జరిగే అవకాశాలు చాలా ఎక్కువట. ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్పేస్ కేంద్రాలు ఇలాంటి ఉల్కల నుంచి భూగ్రహాన్ని కాపాడేందుకు పరిశోధనలు చేపడుతున్నాయి. వీటికి ఇస్రో కూడా తన వంతు సాయం చేస్తోంది. ఇలాంటి ఉల్కలు భూమిని తగలడం అరుదైనప్పటికీ విధ్వంసం మాత్రం ఘోరంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి ఉల్కలను ముందే పసిగట్టే టెక్నాలజీని రూపొందిస్తున్నారు.

# పొట్ట రాకూడదా? పొట్టు తియ్యద్దు మరి!




పొట్టు తీయని ధాన్యాల (హోల్ గ్రేయిన్స్)లో పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయన్నది తెలిసిందే. ఈ పొట్టు కారణంగానే అవి చాలా నెమ్మదిగా జీర్ణమవుతుంటాయి. అందుకే వాటిల్లోంచి వచ్చే కార్బోహైడ్రేట్లు రక్తంలో నెమ్మదిగా కలుస్తుంటాయి. ఫలితంగా ఒంట్లోకి విడుదలయ్యే చక్కెర మోతాదులూ ఆలస్యమవుతాయి. పొట్టుతీయని వరి విషయంలో ముడి బియ్యం మాదిరిగానే పొట్టు తీయని ఓట్స్, గోధుమ, బార్లీ వంటి వాటిని అలాగే తీసుకోవడం వల్ల పొట్టుతీసిన వాటితో పోలిస్తే తక్కువగా బరువు పెరుగుతారని, అందువల్ల ఇన్సులిన్ విడుదల యంత్రాంగం కూడా నియంత్రితంగా పనిచేస్తూ పూర్తిస్థాయి ఆరోగ్యకరంగా ఉంటుందంటున్నారు పరిశోధకులు 'అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్'లో ప్రచురితమైంది. ఇలా తినడం వల్ల ఊబకాయం తగ్గడంతో పాటు స్థూలకాయంతో వచ్చే అనేక అనర్థాలనూ తగ్గించుకోవచ్చన్నది పరిశోధకుల మాట.

## అందం కోసం బ్యూటీ పార్లర్స్ కే వెళ్లాలా ఏంటి..?
# అవిసె గింజలతో కూడా సాధ్యం..!




అవిసె గింజలు చాలా ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. అందువల్లే ప్రతి ఇంట్లో వీటిని విరివిగా ఉపయోగిస్తూ ఉంటారు. వీటిలో ఉండే ఓమేగా త్రీ ఫ్యాటీ ఆసిడ్స్ అందాన్ని రెట్టింపు చేయడంలో సహాయపడతాయి. అవిసె గింజలను మూడు నుంచి నాలుగు గంటలు నీటిలో నానబెట్టి అనంతరం పేస్ట్ లాగా తయారు చేసుకోవాలి. దీన్ని ముఖానికి అప్లై చేయడంతో ముఖం అండ్ మెడ అందంగా తయారవుతుంది. అవిస గింజల పేస్ట్ ను లేదా జల్ ను తరచూ మీ చర్మంపై రాసుకోవడం ద్వారా చర్మం బిగుతుగా మారుతుంది. అదేవిధంగా నిత్యం యవ్వనంగా ఉండవచ్చు. అవిస గింజలను రాత్రంతా నీటిలో నానబెట్టి అనంతరం రోజ్ వాటర్ లో కలిపి ఫేస్ ప్యాక్ వేసుకోవచ్చు. దీన్ని ముఖానికి అప్లై చేయడం ద్వారా మెరిసే చర్మం మీ సొంతం అవుతుంది. బయట చర్మంతో పాటు లోపలి చర్మం ఆరోగ్యంగా ఉంటేనే ముఖంపై సహజమైన మెరుపు కనిపిస్తుంది. అవిసె గింజల పొడిని ఒక గుడ్డు తెల్ల సోనాలో కలిపి ఫేస్ ప్యాక్ గా ఉపయోగిస్తే చర్మం లోపల నుంచి ఆరోగ్యంగా మారుతుందని నిపుణులు సైతం తెలియజేస్తున్నారు. అదేవిధంగా అవిస గింజల నూనెను ఉపయోగించడంతో మీ జుట్టు బలంగా మారుతుంది కూడా. అదేవిధంగా మెరిసే కురుల కోసం ఈ నూనెను తలచు ఉపయోగించవచ్చు. అవిసె గింజలతో తయారు చేసిన హెయిర్ జెల్ తో జుట్టు కుదుళ్ళు బలంగా తయారవుతాయి. జుట్టు ఒత్తుగా కూడా పెరుగుతుంది. ఇక పచ్చి అవిసె గింజలు రోజు తినడం ద్వారా మీ జుట్టు ఆరోగ్యంగా మెరుగుపడుతుంది. ఇందులో ఉండే విటమిన్ ఈ గుణాలు మన జుట్టుకి అండ్ శరీరానికి బాగా తోడ్పడతాయి. అవిస గింజలతో చేసే హెయిర్ ప్యాక్ చుండ్రు సమస్యను తగ్గిస్తుంది. రెండు టేబుల్ స్పూన్ల అవిసె గింజలను పొడి చేసుకుని అందులో 1/2 కప్పు పెరుగు అండ్ నాలుగు చుక్కల నూనె వేసుకుని మీ జుట్టుకు పట్టిస్తే మీ జుట్టు మృదువుగా అండ్ చుండ్రు పోతుంది కూడా. ఇన్ని ఉపయోగాలున్న అవిస గింజలను ప్రతి రోజు కాకపోయినా వారానికి రెండు రోజులు మీ మొఖానికి అండ్ హెయిర్ కి అప్లై చేసి ఈ అద్భుతమైన బెనిఫిట్స్ ని మీ సొంతం చేసుకోండి.

# కొత్త సిమ్ కార్డ్ రూల్స్!..



ఒకే పేరుతో అనేక సిమ్ కార్డులను తీసుకోవడం వల్ల ఇప్పుడు అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. టెలికామ్ చట్టంలో పేర్కొన్నదానికంటే కూడా ఎక్కువ సిమ్ కార్డులను తీసుకుంటే భారీ జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. పదేపదే నిబంధనను ఉల్లంఘిస్తే జైలుకు కూడా వెళ్లాల్సి వస్తుంది. ఒక వ్యక్తి ఎన్ని సిమ్ కార్డులను తీసుకోవచ్చు. ఒక పేరు మీద ఎన్ని సిమ్ కార్డులున్నాయని ఎలా తెలుసుకోవాలి అనే వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం. ఒక వ్యక్తి ఎన్ని సిమ్ కార్డులను తీసుకోవాలి అనే అంశం, వారు ఎక్కడ సిమ్ కార్డు తీసుకుంటున్నారనే దానిపై ఆధారపడి ఉంటుంది. అయితే సాధారణంగా ఒక వ్యక్తి తొమ్మిది సిమ్ కార్డులను తీసుకోవచ్చు. అయితే జమ్మూ & కాశ్మీర్, అస్సాం, ఈశాన్య లైసెన్స్‌డ్ సర్వీస్ ఏరియాలలో అయితే ఒక వ్యక్తి ఆరు సిమ్ కార్డులను మాత్రమే తీసుకోవాలి. కొత్త టెలికమ్యూనికేషన్స్ యాక్ట్ 2023 ఈ నిబంధనలను అమలులోకి తెచ్చింది. కొత్త టెలికమ్యూనికేషన్స్ యాక్ట్ 2023 ఈ నిబంధనలను ఉల్లంఘించి.. నిర్ణయించిన సంఖ్యకంటే ఎక్కువ సిమ్ కార్డులను కలిగి ఉంటే వారికి జరిమానా విధించే అవకాశం ఉంది. ఆ తరువాత మళ్ళీ ఈ రూల్ అతిక్రమిస్తే మొదటిసారి నేరానికి రూ. 50000 వరకు జరిమానా విధిస్తారు. ఆ తరువాత మళ్ళీ రిపీట్ అయితే.. రూ. 2 లక్షల జరిమానా విధిస్తారు. కొన్ని సందర్భాల్లో జైలుపాలయ్యే అవకాశం కూడా ఉంది. కొత్త టెలికమ్యూనికేషన్స్ యాక్ట్ 2023 ప్రకారం.. మోసం, చీటింగ్ చేయడానికి సిమ్ కార్డ్‌లను ఉపయోగిస్తే, అటువంటి వారికి 3 సంవత్సరాలు జైలు శిక్ష, రూ. 50000 జరిమానా విధిస్తారు. కొన్ని సందర్భాల్లో జైలు శిక్ష, జరిమానా రెండూ పడే అవకాశం ఉంది. ఒక వ్యక్తి పేరు మీద ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయని తెలుసుకోవడానికి ప్రభుత్వం 'సంచార్ సాథీ' అనే ప్రత్యేక పోర్టల్‌ని ప్రవేశపెట్టింది. ఇందులో మీ పేరు మీద ఎన్ని సిమ్ కార్డ్‌లు రిజిస్టర్ అయ్యాయో చాలా సులభంగా చెక్ చేసుకోవచ్చు.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com